www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



హైడ్రోజన్ రైలు వచ్చేస్తోంది!
గ్రీన్ ఎనర్జీ హబ్‌లో చేరనున్న భారతీయ రైల్వే
2

బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా
బిహార్ మంత్రి నబీన్!

నితిన్ నబీన్

ఆశ్చర్యపరిచిన ఎంపిక

అంకిత భావమే కారణమన్న బీజేపీ నేతలు

ఛత్తీస్‌గఢ్‌లో పార్టీని విజయం వైపు నడిపించిన వ్యూహకర్త ఈయనే

యూపీ బీజేపీ చీఫ్‌గా కేంద్ర మంత్రి పంకజ్ చౌధరి
2

సోమవారం | 15-12-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 279 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, బహుళపక్షం, తిథి: ఏకాదశి రా.9:20 తదుపరి ద్వాదశి, నక్షత్రం: చిత్త ఉ.11:09 తదుపరి స్వాతి, వర్జ్యం: సా.5:27-7:15, దుర్ముహూర్తం: మ.12:32-1:16, మ.2:43-3:27, అమృతఘడియలు: తె. 4:15-6:03, రాహుకాలం: ఉ. 7.30-9.00, సూర్యోదయం: 6:41, సూర్యాస్తమయం: 5:39 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బకాయిలు గట్టెక్కేదెలా?

డా. ఎన్.టి.ఆర్ వైద్య సేవ - పేదలందరికి ఆధునిక వైద్యం

'ఎన్టీఆర్ వైద్య సేవ'ను వెంటాడుతున్న కష్టాలు

ట్రస్టుకు రుణాలు ఇవ్వలేమన్న బ్యాంకులు

నెట్‌వర్క్ ఆస్పత్రుల బకాయిల చెల్లింపునకు రూ.3 వేల కోట్ల రుణం కోరిన అధికారులు

రెండు సార్లు బ్యాంకర్లతో భేటీ

ష్యూరిటీ లేకపోవడంతో బ్యాంకర్ల నిరాకరణ

ఆస్తి, ఆదాయం, హామీ, తనఖాపై ప్రశ్నలు

వాస్తవానికి ఆస్పత్రుల బకాయిలు 2,400 కోట్లే

జగన్ ప్రభుత్వంలో 600 కోట్లు 'బదలాయింపు'

రుణం భారమంటున్న నిపుణులు

ఆస్పత్రులతో మాట్లాడుకుని వాయిదాల్లో చెల్లించాలని సూచన

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఒకవైపు గతానికి మించి సంక్షేమ పథకాల అమలు, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలు.. రెండింటికీ భారీగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి. దీనికితోడు గత జగన్ ప్రభుత్వంలో అడ్డగోలుగా చేసిన అప్పులు, వాటి వడ్డీల భారం. వెరసి.. కూటమి ప్రభుత్వానికి 'ఆర్థిక' సమన్వయంలో కష్టాలు ఎదురవుతున్నాయి. కొన్ని పథకాలకు ఒక్కోసారి నిధులు కేటాయించలేని దుస్థితి. దీంతో పథకాలు నడవాలంటే కొత్త రుణాలు తీసుకోకతప్పని పరిస్థితి. నెట్‌వర్క్ ఆస్పత్రుల బకాయిల చెల్లింపు కోసం ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు అధికారులు రూ.3 వేల కోట్లు అప్పు తేవాలనుకున్నారు. బ్యాంకర్లతో రెండుసార్లు సమావేశమయ్యారు. తొలి భేటీలో రెండు బ్యాంకులు సానుకూలంగా స్పందించాయి. కానీ రెండో సమావేశంలో రుణం ఇచ్చేందుకు బ్యాంకర్లు ససేమిరా అన్నారు. 'ట్రస్టుకు రుణాలు ఇవ్వడం సాధ్యం కాదు. పైగా ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టుకు ఆస్తులు లేవు. వచ్చే ఆదాయమూ లేదు. ఒక వేళ రుణాలు ఇచ్చినా

మిగతా 11వ పేజీలో...



అరటి ధరకు ఊపు!
కిలో కనీసంగా రూ.10, గరిష్ఠంగా రూ.17

ఉత్తరాది వ్యాపారుల రాకతో మార్కెట్ జోష్

రాయలసీమ రైతులకు ఊరట
10

గత నెలలో కిలో అరటి రూ.2కు పతనం

హెచ్1బీ వీసాలు తాత్కాలిక రద్దు

హెచ్4 వీసాదార్లకు కూడా.. వారి 'సోషల్' ఖాతాల తనిఖీ కోసమేనని వాదనలు
2

భారతీయ ఉద్యోగులపై తీవ్ర ప్రభావం!

యువత ఆకస్మిక మరణాలు.. కొవిడ్ టీకాల వల్ల కాదు

45 ఏళ్ల లోపువారిలో 42% మంది ఆకస్మిక మరణాలకు గుండె జబ్బులే ప్రధాన కారణం

తర్వాతి స్థానంలో ఊపిరితిత్తుల సమస్యలు

మహిళల కంటే పురుషుల్లో 5 రెట్లు ఎక్కువ

'ఎయిమ్స్' వైద్యుల అధ్యయనంలో వెల్లడి
2

సత్యానికి, అసత్యానికి మధ్య పోరాటం


రాంలీలా మైదానంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'ఓట్ చోర్-గద్దీ ఛోడ్' మెగా ర్యాలీలో రాజ్యాంగ ప్రతులతో రాహుల్, ఖర్గే, సోనియా

బీజేపీ డీఎన్ఏలోనే ఓట్ చోరీ.. కాంగ్రెస్‌లో సత్యం, అహింస

ఆ రెండింటి ద్వారానే పోరాడి.. మోదీని ఓడించి.. గద్దె దించుతాం

కేంద్ర ఎన్నికల సంఘం బహిరంగంగా బీజేపీ కోసం పనిచేస్తోంది

ఓట్‌చోరీలో దొరికిపోయామని మోదీ, షాలకు అర్థమైంది

సభలో నా ప్రశ్నకు జవాబిస్తున్నప్పుడు షా చేతులు వణికాయి

సత్యం గెలవడానికి సమయం పట్టొచ్చు.. కానీ తుది గెలుపు మాదే

'ఓట్ చోర్-గద్దీ ఛోడ్' సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

దశలవారీగా రాజ్యాంగాన్ని నాశనం చేసే కుట్ర: మలికార్జున ఖర్గే

దమ్ముంటే బ్యాలెట్ విధానంలో పోటీ చేసి గెలవండి: ప్రియాంక

న్యూఢిల్లీ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దేశంలో సత్యానికి, అసత్యానికి మధ్య పోరాటం నడుస్తోందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస మార్గంలో పోరాడడం ద్వారానే.. నరేంద్ర మోదీ, ఆర్ఎస్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని చెప్పారు. బీజేపీ డీఎన్ఏలోనే ఓట్ చోరీ ఉందని, కాంగ్రెస్ డీఎన్ఏలోనే సత్యం, అహింస ఉన్నాయని ఆయన వ్యాఖ్యానించారు. కేంద్ర ఎన్నికల సంఘం బహిరంగంగానే బీజేపీ కోసం పనిచేస్తోందని మండిపడ్డారు. ఆదివారం న్యూఢిల్లీ

మిగతా 2వ పేజీలో...

యూదులపై మారణకాండ
12 మంది మృతి

సిడ్నీ బోండి బీచ్‌లో 'హనూకా' వేడుకలపై ఇద్దరు సాయుధుల కాల్పులు

29 మందికి గాయాలు.. ఉగ్రవాదిపైకి లంఘించి తుపాకీ లాక్కున్న పౌరుడు

పోలీసుల కాల్పులు.. ఇద్దరు ఉగ్రవాదుల్లో ఒకరి మృతి, మరొకరి అరెస్ట్

ఆస్ట్రేలియా విధానాలతోనే యూదు ద్వేషానికి ఆజ్యం: నెతన్యాహు
2



లఖ్‌నవూలో జరిగిన బీజేపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్న లక్ష్మణ్, యూపీ సీఎం యోగి, కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ తదితరులు

బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా
బిహార్ మంత్రి నితిన్ నబీన్!

న్యూఢిల్లీ, పట్నా, లఖ్‌నవూ, డిసెంబరు 14 : బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బిహార్ మంత్రి నితిన్ నబీన్(45)ని ప్రకటించారు. పార్టీ పార్లమెంటరీ బోర్డు ఆయన్ను నియమించినట్లు బీజేపీ జాతీయ జనరల్ సెక్రటరీ అరుణ్ సింగ్ ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నితిన్ నబీన్ బిహార్ ప్రభుత్వంలో ప్రజాపనుల శాఖ మంత్రిగా ఉన్నారు. రానున్న కాలంలో ఈయన జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా స్థానాన్ని భర్తీ చేస్తారని బీజేపీ నేతలు తెలిపారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన నబీన్ ఇప్పటికే బిహార్ రపభుత్వంలో రెండుసార్లు మంత్రిగా వ్యవహరించారు. ప్రస్తుతం పట్నాలోని బంకిపూర్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన యువ నేతల్లో ఈయన ఒకరు. కాగా ఈయన నియామకం పలువురిని ఆశ్చర్యపరిచింది. అయితే పరిపాలన అనుభవం, పార్టీకి అంకిత భావంతో చేసి న సేవలు ఆయనకు ఈ పదవిని తెచ్చి పెట్టాయని బీజేపీ నేతలు చెబుతున్నారు. బీజేవైఎం నేతగా సుదీర్ఘ అనుభవం, బూత్ స్థాయిలో పని చేసి న అనుభవం, కార్యకర్తలను నడిపించే నైపుణ్యం ఆయనకు కలిసి వచ్చా యి. 2023లో జరిగిన ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలు ఆయన నాయకత్వ పటిమను మరింత వెలుగులోకి తెచ్చాయి. ఆ ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖాయమని పలు ఎగ్జిట్ పోల్స్ అంచనా వేయగా.. అందుకు భిన్నంగా ఘనవిజయం సాధించింది. అప్పుడు ఛత్తీస్‌గఢ్ బీజేపీ ఇన్‌చార్జిగా ఉన్న నితిన్ నబీన్ తన వ్యూహరచనతో పార్టీని ప్రజలకు చేరువ చేయడంతోపాటు నేతలను ఏకతాటిపై నడిపించి పార్టీకి ఘన విజయాన్ని సాధించి పెట్టారు. దీంతో ఎన్నికల వ్యూహకర్తగా పార్టీలో ఆయన పేరు గడించారు.

మోదీ అభినందన

ప్రధాని మోదీ ఆయన్ను అభినందిస్తూ.. నబీన్ అంకిత భావం, సమర్థత రానున్న కాలంలో బీజేపీని మరింత బలోపేతం చేస్తుందని ఆకాంక్షించారు. కాగా బీజేపీ ఉత్తర్‌ప్రదేశ్ యూనిట్ నూతన అధ్యక్షుడిగా కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి ఎన్నికయ్యారు. ఈమేరకు లఖ్‌నవూలో ఆదివారం యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, ఉప ముఖ్యమంత్రులు కేశవ్ ప్రసాద్ మౌర్య, బ్రజేష్ పాఠక్ సమక్షంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ పంకజ్ చౌధరి ఎన్నికైనట్లు ప్రకటించారు.

నితిన్ నబీన్‌కు బాబు, పవన్ శుభాకాంక్షలు

అమరావతి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బిహార్ మంత్రి నితిన్ నబీన్ నియామకంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన పదవీకాలం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. మంత్రి లోకేశ్ కూడా నితిన్ నబీన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. నితిన్ నబీన్‌కు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఎన్డీయేను పటిష్టంగా తీర్చిదిద్దారని, ఆ స్ఫూర్తిని నితిన్ బలంగా ముందుకు తీసుకెళ్తారని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

దేశంలోకి హైడ్రోజన్ రైలు వచ్చేస్తోంది!

న్యూఢిల్లీ, డిసెంబరు 14: భారతీయ రైల్వే తన సుదీర్ఘ ప్రయాణంలో మరో అరుదైన మైలురాయిని చేరుకోనుంది. దేశంలోనే తొలిసారిగా హైడ్రోజన్‌తో నడిచే రైలును అందుబాటులోకి తీసుకురానుంది. ఇప్పటికే నిర్మాణం పూర్తిచేసుకున్న ఈ రైలు పైలట్ ప్రాజెక్టుగా త్వరలోనే పట్టాలెక్కనుంది. ఇది అందుబాటులోకి వస్తే భారతీయ రైల్వే కూడా గ్రీన్ ఎనర్జీ హబ్‌లో చేరనుంది. రిసెర్చ్, డిజైన్, స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ (ఆర్‌డీఎస్‌వో) నిర్దేశిత ప్రమాణాలకనుగుణంగా ఈ ప్రాజెక్టును పూర్తిచేశారు. గతవారం లోక్‌సభ వేదికగా రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ వివరాలు వెల్లడించారు. దేశంలో తొలి హైడ్రోజన్ రైలు నిర్మాణం పూర్తయిందని, దీన్ని పూర్తిగా దేశీయంగా రూపొందించి అభివృద్ధి చేశామని చెప్పారు. ఈ రైలు నిర్వహణ కోసం హరియాణాలోని జింద్‌లో ప్రత్యేక హైడ్రోజన్ ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటుకు ప్లాన్ చేశామన్నారు. ఇది పూర్తిగా భారత్‌లోనే రూపొందించి అభివృద్ధి చేసిన హైడ్రోజన్ రైలు. పది కోచ్‌లతో కూడిన ఈ రైలు ప్రపంచంలోనే అత్యంత పొడవైన హైడ్రోజన్ రైలుగా గుర్తింపు పొందింది. బ్రాడ్‌గేజ్ ట్రాక్‌పై నడిచే అత్యంత శక్తివంతమైన హైడ్రోజన్ రైలు కూడా ఇదే. ఈ రైలులో 1200 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన రెండు డ్రైవింగ్ పవర్ కార్లు (డీపీసీ), 8ప్యాసింజర్ కోచ్‌లు ఉంటాయి. ఇది హైడ్రోజన్ ఇంధనాన్ని ఉపయోగించి రసాయన చర్య ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసి నడుస్తుంది. పర్యావరణానికి హాని చేసే కార్బన్‌డయాక్సైడ్‌ను విడుదల చేయదు. అంటే సున్నా కర్బన ఉద్గారాలతో పూర్తిగా పర్యావరణ హితమైనది. పర్యావరణ అనుకూల ప్రయాణంలో ఇదొక గేమ్ చేంజర్ అవుతుందని భావిస్తున్నారు. పైలట్ ప్రాజెక్టు విజయవంతమైతే భవిష్యత్తులో హైడ్రోజన్ రైళ్ల విస్తరణకు మార్గం సుగమంఅవుతుంది. ముఖ్యం గా విద్యుత్ ట్రాక్‌లులేని మార్గాల్లో ఈ రైళ్లను నడిపే వీలుకలుగుతుంది.

మోదీని హతమార్చాలని కోరుకుంటున్నారు!

▸▸ కాంగ్రెస్ నిజస్వరూపం, అజెండా స్పష్టమైంది: బీజేపీ

న్యూఢిల్లీ, డిసెంబరు 14: కాంగ్రెస్ పార్టీపై బీజేపీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. ఆ పార్టీ ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా తలపెట్టిన ఓట్ చోరీ ర్యాలీ వెనక అసలు అజెండా ప్రధాని మోదీని హతమార్చడమేనని ఆరోపించింది. బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఆదివారం కాంగ్రెస్ నేతలు "మోదీ సమాధి తవ్వుతాం. ఒకవేళ ఈ రోజు కాకపోతే, రేపు తవ్వుతాం" అంటూ నినాదాలు చేస్తున్న వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "కాంగ్రెస్ అజెండా ఏంటో స్పష్టమైంది. అది కేవలం ఎస్ఐఆర్ మీద కాదు. ఏకంగా రాజ్యాంగం మీదే యుద్ధం. కాంగ్రెస్ నేతలు మోదీ సమాధి తవ్వుతామని నినాదాలు చేస్తున్నారు" అని పూనావాలా పేర్కొన్నారు. రాముడిని వ్యతిరేకించే కాంగ్రెస్ పార్టీ అసహనంతో, చొరబాటుదారుల మద్దతుతో రామ్‌లీలా మైదానంలో ర్యాలీ నిర్వహించిందని బీజేపీ ఎంపీ సుధాంశు త్రివేది విమర్శించారు. మోదీ సమాధి తవ్వుతామంటూ కాంగ్రెస్ శ్రేణులు నినాదాలు చేసిన వీడియోను మరో బీజేపీ నేత ప్రదీప్ భండారి కూడా ఎక్స్‌లో షేర్ చేశారు.

హెచ్ 1 బీ వీసాలు తాత్కాలిక రద్దు

▸▸ అమెరికాలోని వీసాదారులకు ప్రభుత్వం ఈమెయిల్స్

న్యూఢిల్లీ, డిసెంబరు 14: విదేశీ ఉద్యోగులు, విద్యార్థులకు వీసాల జారీలో ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తున్న అమెరికా.. ఆ దేశంలోని విదేశీ ఉద్యోగులపై కూడా చర్యలకు ఉపక్రమించింది. అమెరికాలో హెచ్1బీ, హెచ్4 వీసాలతో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులకు.. వారి వీసాలను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఈమెయిల్స్ పంపింది. అయితే, వీసాలు తాత్కాలికంగా రద్దయినా ఆ ఉద్యోగులు తమ వీసాల గడువు సహజంగా ముగిసేవరకు అమెరికాలో చట్టబద్ధంగా నివసించవచ్చు. ఇది శాశ్వత వీసా తిరస్కరణ కాదని హ్యూస్టన్‌కు చెందిన ఇమిగ్రేషన్ అటార్నీ ఎమిలీ న్యూమన్ తెలిపారు. హెచ్1బీ, హెచ్4 వీసాదారుల సోషల్ మీడియా కార్యకలాపాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోంది. అందుకోసమే వీసాల తాత్కాలిక రద్దు నిర్ణయం తీసుకున్నట్లు భావిస్తున్నారు. ఇప్పటికే విదేశీ విద్యార్థుల వీసా ఇంటర్వ్యూలను కూడా అమెరికా అధికారులు వాయిదా వేశారు. ట్రంప్ ప్రభుత్వ నిర్ణయంతో అత్యధికంగా ప్రభావితం అయ్యేది భారతీయులేననే వాదన వినిపిస్తోంది. హెచ్1బీ, హెచ్4 వీసాదారుల్లో ఎక్కువ మంది భారతీయులే ఉన్నారు. వీసాల తాత్కాలిక రద్దు వల్ల వారు ఏదైనా ముఖ్యమైన పని ఉన్నా స్వదేశానికి రాలేని పరిస్థితిలో పడిపోయారు. ఒకవేళ వస్తే.. తిరిగి అమెరికా వెళ్లటం కష్టమవుతుంది. సుదీర్ఘకాలం వేచి ఉండటంతోపాటు మళ్లీ కొత్త వీసా పొందినంత పని అవుతుందని నిపుణులు చెబుతున్నారు.



'ఓట్ చోర్- గద్దీ ఛోడ్' మెగా సభలో పాల్గొన్న సోనియా గాంధీ, ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్ తదితరులు

సత్యానికి అసత్యానికి మధ్య
పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

రాంలీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'ఓట్ చోర్- గద్దీ ఛోడ్' మెగా ర్యాలీ జరిగింది. ఈ ఆందోళనలో కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, అభిషేక్ మను సింఘ్వీ, జైరాం రమేశ్, చిదంబరం సహా సీడబ్ల్యూసీ సభ్యులు, ఏఐసీసీ కీలక నేతలు, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మెగా ర్యాలీకి ముందు కాంగ్రెస్ కేంద్ర కార్యాలయంలో పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలతో కలిసి రాహుల్ గాంధీ విందు చేశారు. అక్కడి నుంచి నేరుగా ర్యాలీకి చేరుకున్నారు. సభలో ప్రసంగించిన రాహుల్‌గాంధీ.. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పేర్లు ప్రస్తావించి మరీ.. వారు బీజేపీ కోసం పనిచేస్తున్నారని ఆరోపించారు. తాము పనిచేసేది దేశం కోసమని, మోదీ కోసం కాదని సత్యాన్ని ఇకనైనా వారు గ్రహించాలని అన్నారు. బిహార్ ఎన్నికల సమయంలో ఓటర్లకు రూ.10వేల చొప్పును బీజేపీ బదిలీ చేసినా.. ఈసీ ఎటువంటి చర్యలూ తీసుకోలేదని మండిపడ్డారు. "సత్యానికి అసత్యానికి మధ్య జరుగుతున్న పోరులో.. కేంద్ర ఎన్నికల కమిషన్ బీజేపీతో కలిసి పనిచేస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఏది చెబితే అదే చేయాలన్నట్టు వ్యవహరిస్తోంది. మేము.. నిస్సందేహంగా సత్యం వైపు నిలబడ్డాం. నరేంద్ర మోదీ, ఆర్ఎస్ఎస్ ప్రభుత్వాన్ని అధికారం నుంచి దింపేస్తాం. వారు అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఓట్ చోరీకి పాల్పడుతున్నారు. కానీ.. మాకు ప్రజాస్వామ్య సిద్ధాంతాలపై నమ్మకం ఉంది. ఈ పోరాటంలో విజయం సాధించడానికి, సత్యం గెలవడానికి సమయం పట్టొచ్చు. కానీ.. అంతిమ విజయం మాత్రం సత్యానిదే. సత్యం, అహింస మార్గంలోనే మేం పనిచేస్తాం" అని రాహుల్ పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ సభ్యులపై ఎటువంటి చర్యలూ తీసుకోకుండా కేంద్రం ఓ చట్టాన్ని తీసుకొచ్చిందని.. కానీ, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ చట్టాన్ని మార్చి ఎన్నికల కమిషనర్లపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

దొరికిపోయామని గ్రహించి..

'ఓట్ చోరీ' విషయంలో తాము దొరికిపోయినట్టు ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా సహా బీజేపీ నాయకులు గ్రహించారని రాహుల్ తెలిపారు. అందుకే మోదీతోపాటు ఆ పార్టీ నాయకుల్లో ఆత్మవిశ్వాసం సడలిందన్నారు. లోక్‌సభలో 'ఓట్ చోరీ'పై చర్చ సందర్భంగా తన ప్రశ్నలకు సమాధానం ఇస్తున్నప్పుడు షా చేతులు అందుకే వణికాయన్నారు. బీజేపీ నాయకుల ఆత్మవిశ్వాసం, ధైర్యం కేవలం అధికారం నుంచే వస్తాయని, ఓట్ చోరీతో వాళ్లు ఆ అధికారం దక్కించుకున్నారని మండిపడ్డారు. "మోదీ, షా... మీరు ఎన్ని ప్రసంగాలు చేసినా, అంతిమంగా సత్యానిదే విజయం... మేం మిమ్మల్ని సత్యం, అహింసతో ఓడిస్తాం," అని రాహుల్ హెచ్చరించారు. కాగా.. దశలవారీగా రాజ్యాంగాన్ని నాశనం చేసేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్ర పన్నుతున్నాయని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆరోపించారు.


దశలవారీగా నాశనం: ఖర్గే

"బీజేపీది ఆర్ఎస్ఎస్ సిద్ధాంత కర్త గోల్వాల్కర్, మోహన్ భాగవత్, మనుస్మృతి భావజాలం. ఆ ఆలోచనా విధానం దేశాన్ని కాపాడదు. నాశనం చేస్తుంది. మోదీ, బీజేపీ అదే మార్గాన్ని అనుసరిస్తున్నారు. దశలవారీగా రాజ్యాంగాన్ని నాశనం చేస్తారు. హిందు మతం, హిందుత్వం పేరుతో పేదలను బానిసలుగా ఉంచేందుకు ప్రయత్నిస్తున్నారు" అని ఖర్గే మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ దేశానికి స్వాతంత్రం తీసుకొచ్చే సమయానికి మోదీ, అమిత్ షా పుట్టారా అని నిలదీశారు. "బీజేపీ వాళ్ల ద్రోహులు, నాటకాలు ఆడేవారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు ప్రధాని మోదీ పార్లమెంటుకు రారు. మేము అడిగే ఏ ప్రశ్నకూ సమాధానం చెప్పరు. వందే మాతరంపై దేశ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు" అని నిప్పులు చెరిగారు. ఓటు హక్కును, రాజ్యాంగాన్ని కాపాడాలంటే.. 'ఓట్‌చోరీకి' పాల్పడుతున్న బీజేపీని అధికారం నుంచి తొలగించాలని పిలుపునిచ్చారు. దేశాన్ని కాపాడగలిగేది కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని.. అందుకే కాంగ్రెస్ సిద్ధాంతాన్ని ఐక్యంగా బలోపేతం చేయడం ప్రతి భారతీయుడి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. "140 కోట్ల మంది ప్రజలను కాపాడటం ఎంతో ముఖ్యం. దేశంలో ధనవంతులు, పేదల మధ్య పోరాటం జరుగుతోంది. బీజేపీకి పేదల గోడు ఎప్పుడూ పట్టదు. కార్పొరేట్ శక్తులవైపే నిలుస్తుంది. ఆర్ఎస్ఎస్, బీజేపీ వంటి దేశద్రోహులు, ఓట్లను చోరీ చేసేవాళ్లకు వ్యతిరేకంగా మేం పోరాడుతున్నాం. ఈ పోరాటానికి మీరు మరింత బలోపేతం చేకూర్చాలి. గ్రామగ్రామానికీ వెళ్లి ఈ విషయాలు తెలియజేయాలి." అని ఖర్గే కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఇక.. ఎన్నికల కమిషన్ సరిగా పనిచేయట్లేదనే విషయం దేశంలోని ప్రతిఒక్కరికీ తెలుసని ప్రియాంక గాంధీ అన్నారు. "ఎన్నికలకు ముందు ఒక్కొక్కరి ఖాతాలో రూ.10 వేలు వేయడం ఓట్ చోరీ కాదా?" అని ఆమె ప్రశ్నించారు. బిహార్‌లో ఓట్ చోరీతోనే బీజేపీ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. దమ్ముంటే.. బ్యాలెట్ విధానంలో పోటీ చేసి ఎన్నికల్లో గెలవాలని బీజేపీకి ఆమె సవాల్ విసిరారు.

అదే వారి సిద్ధాంతం..

"ప్రపంచం సత్యం వైపు చూడదు. అధికారం వైపు మాత్రమే చూస్తుంది. అధికారం ఉన్నవాడినే గౌరవిస్తుంది" అని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలను రాహుల్ గుర్తు చేశారు. ఇదే మోహన్ భాగవత్ ఆలోచన, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతమని విమర్శించారు. ప్రపంచంలోని ప్రతి మతం సత్యమే ప్రధానమని చెబుతుందని, కానీ.. సత్యానికి అర్థమేలేదని, అధికారమే కీలకమని మోహన్ భగవత్ అంటున్నారని మండిపడ్డారు. "ఈ దేశం 'సత్యం, శివం, సుందరం'.. 'సత్యమేవ జయతే' అనే తత్వాలపై ఆధారపడి నడుస్తుంది. చివరికి కాంగ్రెస్ సత్యం, అహింసతోనే మోదీని, బీజేపీని ఓడించి గద్దె దించుతుంది. దీనికోసం కాంగ్రెస్ శాంతియుత, ప్రజాస్వామిక పంథాలోనే పోరాటం సాగిస్తుంది. సత్యాన్ని ఆచరిస్తూ, సత్యాన్ని అంటిపెట్టుకుని, సత్యాన్ని ఆయుధంగా చేసుకుంటే నరేంద్ర మోదీ, అమిత్ షా, ఆర్ఎస్ఎస్ ను ఈ దేశం నుంచే తరిమెయ్యొచ్చు." అని రాహుల్ గాంధీ అన్నారు. ఓట్ చోరీపై ఆధారాలతో సహా తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తినప్పటికీ, ఎన్నికల సంఘం సమాధానం ఇవ్వలేదని మండిపడ్డారు. హరియాణా ఓటర్ల జాబితాలో ఒక బ్రెజిలియన్ మహిళ ఫొటో 22సార్లు ఎలా కనిపించిందో, అదే రాష్ట్రంలోని ఒకే పోలింగ్ బూత్‌లో ఒక మహిళ ఫొటో 200సార్లు ఎలా ఉందో, యూపీకి చెందిన బీజేపీ కార్యకర్తలు హరియాణా ఎన్నికల్లో ఎలా ఓటేశారో? తాళం వేసిన ఒకే ఇంట్లో 600, 700 మంది ఓట్లరు ఎలా ఉన్నారో? ఎన్నికల కమిషన్ సమాధానం చెప్పడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

లోకం తీరు



'సర్పంచ్ భర్తల' పాలనపై
హక్కుల కమిషన్ సీరియస్

▸▸ 22లోగా చర్యల నివేదికలు ఇవ్వండి

▸▸ రాష్ట్రాలు, యూటీల అధికారులకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ హెచ్చరిక

న్యూఢిల్లీ, డిసెంబరు 14: దేశవ్యాప్తంగా పంచాయతీరాజ్, పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికైన మహిళల స్థానంలో వారి భర్తలు పరోక్ష పాలన సాగించడాన్ని జాతీయ మానవ హక్కుల కమిషన్ తీవ్రంగా పరిగణించింది. రాజ్యాంగ రక్షణలు, కోర్టు తీర్పులు ఉన్నప్పటికీ ఎన్నికైన మహిళా ప్రతినిధులు నామమాత్రంగా మారుతున్నారని.. అధికారాలన్నీ వారి భర్తలు అనుభవిస్తున్నారని ఆక్షేపించింది. హరియాణా బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మాజీ సభ్యుడు సుశీల్ వర్మ చేసిన ఫిర్యాదుపై కమిషన్ సభ్యుడు ప్రియాంక్ కానుంగో నేతృత్వంలో సమావేశమైన ధర్మాసనం విస్తృతంగా చర్చించింది. మహిళల పేరిట భర్తల పరోక్ష ప్రాతినిధ్యం..73,74 రాజ్యాంగ సవరణల స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టంచేసింది. ఎన్నికైన మహిళా ప్రతినిధులను డమ్మీలుగా మార్చడంపై కానుంగో గతంలోనే అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల (యూటీలు) అధికారులకు ఆదేశాలు జారీచేశారు. చర్యల నివేదిక(ఏటీఆర్)లను ఈ ఏడాది సెప్టెంబరు 9లోగా సమర్పించాలని నిర్దేశించారు. అయితే ఆంధ్రప్రదేశ్, బిహార్, ఒడిసా, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు, యూపీలోని కొన్ని నగరాలు మాత్రమే నివేదికలు సమర్పించాయి. ఇప్పుడు సుశీల్ వర్మ ఫిర్యాదుతో కమిషన్ ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించింది. అన్ని రాష్ట్రాలు, యూటీల పంచాయతీరాజ్, పురపాలక శాఖల ముఖ్య కార్యదర్శులు ఈ నెల 22లోగా చర్యల నివేదికలను పంపాలని సమన్లను జారీచేసింది. లేదంటే వారు ఈ నెల 30న సంబంధిత ఏటీఆర్‌లతో తమ ముందు హాజరవ్వాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఈ విషయాన్ని కమిషన్ ఈ నెల 12న ఓ ప్రకటనలో వెల్లడించింది.

యూదులపై మారణకాండ

▸▸ సిడ్నీ బోండి బీచ్‌లో 'హనూకా' వేడుకలపై ఇద్దరు సాయుధుల కాల్పులు

▸▸ 12 మంది మృతి.. 29 మందికి గాయాలు

సిడ్నీ, డిసెంబరు 14: అది ఆస్ట్రేలియా సిడ్నీ నగరంలోని ప్రఖ్యాత బోండి బీచ్.. ఓ పక్కగా యూదుల మత కార్యక్రమం 'హనూకా' వేడుకలు జరుగుతున్నాయి.. వందలాది మంది గుమిగూడి ఉన్నారు.. ఉన్నట్టుండి నలుపు రంగు దుస్తుల్లో ఉన్న ఇద్దరు సాయుధులు అక్కడికి దూసుకొచ్చారు. కార్యక్రమం జరుగుతున్న ప్రాంతానికి సమీపంలోని పాదచారుల వంతెనపైకి ఎక్కి జనం వైపు కాల్పులు మొదలుపెట్టారు. యూదు ల్లో ఒక్కసారిగా హాహాకారాలు చెలరేగాయి. ఎటువైపువారు అటు చెల్లాచెదురయ్యారు. పదుల సంఖ్యలో రక్తపు మడుగులో పడిపోయారు. మరికొందరు ప్రాణాలు కాపాడుకోవడానికి పరుగులు తీశారు. ఉగ్రవాదులు వారిని వెంటాడుతూ కాల్పులు జరిపారు. సుమారు ఏడు నిమిషాలపాటు మారణహోమం జరిగింది. ఈ క్రమంలో ఒక యువకుడు ధైర్యంగా ఓ ఉగ్రవాదితో కలబడి తుపాకీ లాక్కున్నారు. కాసేపట్లోనే పోలీసులు అక్కడికి చేరుకుని కాల్పులు జరిపారు. ఉగ్రవాదుల కాల్పుల్లో 12 మంది యూదులు మరణించగా, మరో 29 మంది తీవ్రంగా గాయపడ్డారు. పోలీసు కాల్పుల్లో ఒక ఉగ్రవాది మరణించాడు. మరొకరిని ప్రాణాలతో పట్టుకున్నారు. ఆదివారం సాయంత్రం 6.30 గంటల సమయంలో జరిగిన ఈ ఘటన ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపింది. బోండి బీచ్ ఘటన నేపథ్యంలో ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ వెంటనే జాతీయ భద్రతా సమావేశాన్ని నిర్వహించి, పరిస్థితిని సమీక్షించారు. ఉగ్రవాద దాడి చాలా దారుణమని.. దీనిపై లోతుగా దర్యాప్తు జరిపి, చర్యలు చేపట్టాల్సిందిగా పోలీసులు, అధికారులను ఆదేశించారు. కాగా, ప్రధాని ఆల్బనీస్ బోండి బీచ్ ఘటన యూదులపై జరిగిన దాడి అనే ప్రస్తావన తీసుకురాకపోవడంపై ఆస్ట్రేలియా యూదు అసోసియేషన్ తీవ్రంగా మండిపడింది. ఇది ఆయన సిగ్గుపడాల్సిన విషయమని వ్యాఖ్యానించింది. ఆస్ట్రేలియాలో యూదు ద్వేషంపై చాలా సార్లు ప్రభుత్వానికి హెచ్చరికలు వచ్చాయని, అయినా యూదులను రక్షించేందుకు తగిన చర్యలు చేపట్టలేదని పేర్కొంది. ఆస్ట్రేలియాలోని ముస్లిం సంస్థలు ఈ ఉగ్రవాద దాడిని ఖండించాయి.

ఒక ఉగ్రవాది.. పాకిస్థానీ అని ప్రచారం!



కాల్పులు జరుపుతున్న ఉగ్రవాది

హనుక్కా వేడుకపై జరిగినది ఉగ్రదాడేనని న్యూసౌత్‌వేల్స్ పోలీస్ కమిషనర్ మాల్ లన్యన్ ప్రకటించారు. దాడి ఘటన అనంతరం తనిఖీల్లో ఉగ్రవాదులకు చెందిన కారులో ఒక బాంబు, పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. పోలీసుల కాల్పుల్లో ఒక ఉగ్రవాది మరణించగా, తీవ్రంగా గాయపడిన మరో ఉగ్రవాది పరిస్థితి విషమంగా ఉందన్నారు. ఉగ్రవాదుల్లో ఒకరి ని సిడ్నీలోని బోనీరిగ్ ప్రాంతంలో ఉండే 24ఏళ్ల నవీద్ అక్రమ్‌గా గుర్తించినట్టు ఒక సీనియర్ అధికారి తెలిపారు. కాగా అతను పాకిస్థాన్‌లోని లాహోర్‌కు చెందినవాడని, సిడ్నీలోని అల్ మురాద్ ఇన్‌స్టిట్యూట్‌లో చదువుతున్నాడని అతడి పేరిట ఉన్న డ్రైవింగ్ లైసెన్సు, ఇతర ఆధారాలు సోషల్ మీడియాలో ప్రచారమవుతున్నాయి. ఈ ఏడాది అక్టోబరు 7న ఇజ్రాయెల్‌లో హమాస్ దాడిలో తృటిలో తప్పించుకున్న ఓ వ్యక్తి.. 2 వారాల క్రితమే ఆస్ట్రేలియా వచ్చి ఇప్పుడు బోండి బీచ్ ఉగ్రదాడిలో తీవ్రంగా గాయపడ్డారు.

దాడిని ఖండించిన ఇజ్రాయెల్

సిడ్నీలో హనుక్కా వేడుకపై దాడిని యూదు దేశమైన ఇజ్రాయెల్ తీవ్రంగా ఖండించింది. యూదులపై ద్వేషభావం ఆస్ట్రేలియా సమాజాన్ని కలుషితం చేస్తోందని.. ఆస్ట్రేలియా ప్రభుత్వ విధానాలు ఆ అగ్నికి ఆజ్యం పోస్తున్నాయని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ మండిపడ్డారు. 3నెలల కింద పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తిస్తున్నట్టుగా ఆస్ట్రేలియా ప్రకటించిన సమయంలోనే ఆ దేశ ప్రధాని ఆల్బనీస్‌కు లేఖ రాసినట్టు గుర్తు చేశారు. ఆస్ట్రేలియాలోని యూదులపై ఉగ్రవాదులు అత్యంత నీచంగా, క్రూరంగా దాడికి పాల్పడ్డారని ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐసాక్ హెర్జోగ్ అన్నారు.

ఉగ్రవాదాన్ని సహించే ప్రసక్తే లేదు: ప్రధాని మోదీ

ఆస్ట్రేలియాలో ఉగ్రదాడిపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితులకు భారత ప్రజల తరపున ప్రగాఢ సానుభూతి ప్రకటిస్తున్నానని 'ఎక్స్‌'లో తెలిపారు. ఉగ్రవాదాన్ని భారత్ ఏమాత్రం సహించే ప్రసక్తేలేదన్నారు. ఉగ్రవాదంపై పోరాటానికి భారత్ అన్ని రకాలుగా సహకరిస్తుందని పేర్కొన్నారు.

చీకటిపై వెలుగు విజయమే 'హనూకా'

భారతీయులకు దీపావళి తరహాలో యూదులు 'హనూకా' వేడుక జరుపుకొంటారు. యూదులు క్రీస్తుపూర్వం 141లో తాము ఎంతో పవిత్రంగా భావించే జెరుసలేం ఆలయాన్ని సెల్యూసిడ్ సామ్రాజ్యం నుంచి తిరిగి దక్కించుకున్నారు. అన్ని రోజులుగా చీకటిలో వదిలేసిన పవిత్ర ఆలయంలో దీపం వెలిగించారు. కానీ ఒక్క రోజుకు సరిపడా మాత్రమే నూనె ఉండటంతో ఆందోళన చెందారు. వారికి తిరుగుబాటు దళాల నుంచి సాయం అందేదాకా 8 రోజుల పాటు ఆ దీపం వెలుగుతూనే ఉంది. అది దైవ మహిమ అని.. చీకటిపై వెలుగు సాధించిన విజయమని తలచి ఏటా చలికాలంలో 8 రోజులు 'హనూకా' పండుగగా జరుపుకొంటారు. ఈ పండుగలో భాగంగా ఆదివారం బోండి బీచ్‌లో క్యాండిల్స్ వెలిగించేందుకు సిద్ధమైన యూదులపై ఉగ్రవాదులు దాడి చేశారు.

మెరుపులా వచ్చి.. తుపాకీ లాక్కుని..

బోండి బీచ్ ఘటనలో అహ్మద్ అల్ అహ్మద్ అనే వ్యక్తి చూపిన తెగువ ప్రశంసలు పొందుతోంది. కార్లు పార్క్ చేసిన ప్రాంతంలో నిలబడిన అహ్మద్.. ఒక ఉగ్రవాది కాల్పులు జరుపుతూ అటువైపు రావడంతో ఓ కారు వెనక నక్కారు. అతను తిరిగిన వెంటనే మెరుపులా దూసుకెళ్లి వెనుక నుంచి గట్టిగా పట్టుకున్నారు. ఉగ్రవాది నుంచి తుపాకీని లాక్కుని.. అతడిపై కాల్పులు జరిపేందుకు ప్రయత్నించారు. అంతలోనే మరో వ్యక్తి కూడా అహ్మద్‌కు సాయంగా వచ్చారు. కానీ దూరంగా ఉన్న మరో ఉగ్రవాది కాల్పులు జరపడంతో.. అహ్మద్, మరో వ్యక్తి పక్కనున్న చెట్టు వెనుక దాక్కున్నారు. ఇంతలో మొదటి ఉగ్రవాది రెండో ఉగ్రవాది వద్దకు వెళ్లిపోయాడు. అహ్మద్ తుపాకీ లాక్కుని ఉండకపోతే.. మరెందరో కాల్పులకు బలయ్యేవారు. ఉగ్రవాదుల దుశ్చర్యను ఓ వ్యక్తి వీడియో తీస్తుండగా.. సాహసం అందులో రికార్డయింది.

యువత ఆకస్మిక మరణాలు..
కొవిడ్ టీకాల వల్ల కాదు

▸▸ 45 ఏళ్ల లోపువారిలో 42% మంది ఆకస్మిక మరణాలకు గుండె జబ్బులే ప్రధాన కారణం

▸▸ 'ఎయిమ్స్' వైద్యుల అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): వయసు 45ఏళ్లలోపే ఉంటుంది. చూడటానికి చక్కగా ఆరోగ్యంగా కనిపిస్తారు. కానీ ఉన్నట్టుండి కుప్పకూలుతున్నారు. ఆస్పత్రికి తరలించేలోగానే కన్నుమూస్తున్నారు. ఇటీవల కాలంలో ఇటువంటి ఘటనలు ఎక్కువగా చూస్తున్నాం. ముఖ్యంగా.. మద్యపానం, పొగతాగడంలాంటి దురలవాట్లు, ఊబకాయం, తీవ్రమైన ఒత్తిడి, ఆందోళనవంటి సమస్యలేవీ లేకున్నా హఠాన్మరణానికి గురవుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. కరోనా వ్యాక్సిన్లు తీసుకోవడమే వారి మరణాలకు కారణమన్న అనుమానాలు చాలా మందిలో వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో.. ఢిల్లీలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) వైద్య నిపుణులు ఏడాదిపాటు అధ్యయనం నిర్వహించి.. కొవిడ్ టీకాల వల్లే యువతలో ఆకస్మిక మరణాల సంఖ్య పెరిగిందనడానికి ఎలాంటి ఆధారాలూ లేవని స్పష్టం చేశారు. 'బర్డెన్ ఆఫ్ సడెన్ డెత్ ఇన్ యంగ్ అడల్ట్స్: ఏ వన్ ఇయర్ అబ్జర్వేషనల్ స్టడీ ఎట్ ఏ టెర్షియరీ కేర్ సెంటర్ ఇన్ ఇండియా' పేరిట వారు నిర్వహించిన ఈ అధ్యయన ఫలితాలు 'ఇండియన్ జర్నల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ (ఐజేఎంఆర్)'లో ప్రచురితమయ్యాయి. ఈ అధ్యయనంలో భాగంగా ఎయిమ్స్ ఫోరెన్సిక్ మెడిసిన్, పాథాలజీ నిపుణులు.. 2023 మే నుంచి 2024 ఏప్రిల్ మధ్య 2,214 మృతదేహాలను పరీక్షించారు. వాటిలో 180.. ఆకస్మికంగా మరణించినవారి మృతదేహాలు. ఆ 180 మందిలోనూ 18-45 మధ్య వయసువారు 103 మంది. వారిలో 42.6 శాతం మంది మరణాలకు కారణం గుండె సంబంధిత సమస్యలే కారణమని వెల్లడైంది. ఆ తర్వాత అత్యధికంగా 21.3శాతం మరణాలు ఊపిరితిత్తుల (శ్వాసకోశ) సమస్యల వల్ల సంభవించినట్టు తేలింది. ఇలా హఠాన్మరణం పాలైన వారి సగటు వయసు 33.6 ఏళ్లే. అలాగే ఈ హఠాన్మరణాల సంఖ్య.. స్త్రీలతో పోలిస్తే పురుషుల్లో ఐదురెట్లు ఎక్కువగా ఉంది. అంతేకాదు వారం మధ్యలో (బుధ-గురువారాల్లో) కన్నా, వారాంతాల్లోనే (శుక్ర-శని-ఆదివారాల్లో) హఠాన్మరణాలు ఎక్కువగా నమోదవుతున్నట్టు గుర్తించారు. గుండె జబ్బుతో హఠాత్తుగా చనిపోయినవారిలో చాలా మందికి అథెరోస్క్లెరోటిక్ కరోనరీ ఆర్టరీ డిసీజ్ (ధమనుల్లో కొవ్వు పేరుకుపోవడం) ఉన్నట్లు మరణానంతరం నిర్వహించిన పరీక్షల్లో తేలింది. అలా చనిపోయినవారిలో అసలు గుండె జబ్బు ఉన్న లక్షణాలులేవని, ఆ సమస్య ఉన్న విషయమే వారికి తెలియదని వైద్యనిపుణులు పేర్కొన్నారు.



యువతను కోల్పోవడం దేశానికి నష్టం

యువతలో వచ్చే హృద్రోగాలను చాలా మంది ఆరోగ్యపరమైన అంశంగానే చూస్తారు. కానీ అది సరికాదు. ఉత్పాదక వయసులో.. అంటే 22-50 ఏళ్ల మధ్య ఉండేవారు అకస్మాత్తుగా గుండెజబ్బుతో చనిపోవడం వారి కుటుంబంపైనే కాక ఆర్థిక వ్యవస్థపైనా తీవ్ర ప్రభావం చూపుతుంది. వారిని ఇలా పెద్ద సంఖ్యలో కోల్పోతే ప్రభుత్వాలపై తీవ్ర భారం పడుతుంది. ఇతర దేశాల్లో ఈ విషయాన్ని చాలా తీవ్రంగా పరిగణిస్తారు. మనకు దాని తీవ్రత అర్థం కావట్లేదు. ఇప్పటికే మన దేశంలో ఫర్టిలిటీ రేటు తగ్గుతోంది. దానికితోడు ఈ వయసువారిని కోల్పోతే మరింత నష్టం జరుగుతుంది. వీటిపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి. ప్రాసెస్డ్ ఆహారపదార్థాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. గుండె జబ్బులపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

- డాక్టర్ రాయిడి గోపీకృష్ణ, సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు, యశోద ఆస్పత్రి, హైటెక్ సిటీ, హైదరాబాద్

ఉత్సాహంగా నేవీ మారథాన్

▸ విశాఖలో 17 వేల మందితో నిర్వహణ

విశాఖపట్నం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): విశాఖ సాగర తీరంలో పదో ఎడిషన్ నేవీ మారథాన్ ఉత్సాహంగా సాగింది. నేవీ డే వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం ఈస్టర్న్ నేవల్ కమాండ్ ఆధ్వర్యంలో ఈ మారథాన్‌ను నిర్వహించారు. తూర్పు నౌకాదళ ప్రధాన అధికారి, వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా, విశాఖ కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, నేవీ విభాగాల ఉద్యోగులు, నగరవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆర్‌కే బీచ్ కాళికామాత ఆలయం వద్ద ప్రారంభమైన ఈ మారథా న్‌లో 42కి, 21కి, 10కి, 5కి విభాగాల్లో దాదాపు 17 వేల మంది పాల్గొన్నారు. 17 దేశాల నుంచి ఔత్సాహికులు ఈ మారథా న్‌లో పాల్గొన్నారని, విశాఖ ఖ్యాతి ప్రపంచ స్థాయికి చేరిందని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు.



నేవీ మారథాన్‌కు హాజరైన విశాఖ నగర వాసులు, జెండా ఊపి ప్రారంభిస్తున్న విశాఖ సీపీ శంఖబ్రత బాగ్చి



మూడో రోజు బిజినెస్ ఎక్స్‌పోను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, చిత్రంలో ఏపీ చాంబర్స్ ప్రతినిధులు

పరిశ్రమల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

▸ మంత్రి కొల్లు రవీంద్ర

విజయవాడ సిటీ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పరిశ్రమల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, వ్యాపార వాతావరణాన్ని పెంపొందించి, తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రణాళికబద్ధంగా అడుగులు వేస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. విజయవాడ ఎస్ఎస్ కన్వెన్షన్ హాలులో జరుగుతున్న ఏపీ చాంబర్స్ బిజినెస్ ఎక్స్ పోను మంత్రి ఆదివారం సందర్శించారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ఈ ఎక్స్ పో ఎంతగానో దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ఆటోమొబైల్, టెక్స్‌టైల్స్, టూరిజం, ఫుడ్ ప్రాసెసింగ్, రాష్ట్ర ప్రభుత్వ ఎంఎస్ఎంఈలతో కలిపి 157 స్టాల్స్‌ను ఏర్పాటు చేసి [illegible] వేత్తల సందేహాలను తొలగించిన నిర్వాహకులను అభినందించారు. మచిలీపట్నం నియోజకవర్గంలోని ఇండస్ట్రియల్ పార్క్‌లో పరిశ్రమల స్థాపనకు తాను కృషి చేస్తున్నట్లు చెప్పారు. పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం పరంగా అందాల్సిన వసతులను కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఏపీ చాంబర్స్ అధ్యక్షులు పొట్లూరి భాస్కరరావు మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగిన ఈ ఎక్స్ పోను 30 వేల మంది సందర్శించినట్లు చెప్పారు.

19న వీఆర్వోల కీలక సమావేశం

విజయవాడ (గాంధీనగర్), డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవిన్యూ అధికారుల సంఘం కీలక సమావేశం ఈ నెల 19న విజయవాడలో నిర్వహించనున్నట్టు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూపతిరాజు రవీంద్రరాజు, ఎం.అప్పలనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో వీఆర్వోలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్టు పేర్కొన్నారు. వీఆర్‌ఏల డిమాండ్ల సాధనకు ఈ నెల 16న మంగళగిరిలోని సీసీఎల్‌ఏ కార్యాలయం వద్ద చేపట్టే మహాధర్నాకు మద్దతు ప్రకటించారు.

పురాతన వస్తువులపై ఆరా

▸ తవ్వకాలు ప్రారంభించిన పురావస్తుశాఖ

విడవలూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా విడవలూరు మండల పరిధిలోని రామతీర్థం గ్రామంలో ఉన్న 10 ఎకరాల బౌద్ధ క్షేత్రంలో ఇటీవల పురాతన కాలంనాటి వస్తువుల ఆనవాళ్లు లభించాయి. దీంతో ఆదివారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన పురావస్తుశాఖాధికారులు తవ్వకాలను ప్రారంభించారు. ఈమేరకు ముందుగా వారు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆశాఖ డైరెక్టరు దేబేంద్రనాథ్‌బోయ్, సహ డైరెక్టరు జీ. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ రామతీర్థంలో ఇటీవల జరిపిన ట్రయల్ తవ్వకాల్లో ఈ ప్రదేశ సామర్థ్యాన్ని సూచించే టెర్రకోట వలయం కనిపించిందని తెలిపారు. అలాగే ఎరుపు రంగు కలిగిన కొన్ని వస్తువులు, నలుపు, ఎరుపు రంగుల్లో పాలిష్ చేసిన వస్తువులు కనిపించాయని తెలిపారు. ఇక్కడ లభించిన ఇటుక పరిమాణాన్ని బట్టి శాతవాహన, ఇక్ష్వాకుల రాజవంశాల కాలంనాటిదిగా భావిస్తున్నామన్నారు. మరిన్ని వివరాలను తెలుసుకోవటానికి ఇక్కడున్న బోధిపతి దిబ్బలో తవ్వకాలను ప్రారంభించామని వివరించారు.



కుక్కకు సమాధి.. వైద్యానికి రూ.7 లక్షల ఖర్చు

ఆ శునకాన్ని కుటుంబంలో ఒకటిగా పెంచుకున్నారు. వయోభారం కారణంగా అనారోగ్యం పాలైతే రూ.7 లక్షలు ఖర్చు చేసి వైద్యం చేయించారు. మరణానంతరం సమాధి కట్టించి దానిపై ప్రేమను చాటుకున్నారు. చిత్తూరు సిద్ధార్థనగర్‌కు చెందిన డాక్టర్ సుదర్శన్... పదేళ్ల క్రితం జర్మన్ బ్రీడ్‌కు సంబంధించిన శునకాన్ని తెచ్చుకుని.. దానికి బాక్సీ రాట్‌విల్లర్ అని పేరు పెట్టి పెంచుకున్నారు. పగలూ రాత్రి ఇంటికి కాపలా కాస్తూ.. గతంలో రెండు సార్లు ఇంట్లో జరగబోయిన చోరీలను అడ్డుకుంది. ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో చెన్నై, బెంగళూరు ఆస్పత్రులకు తీసుకెళ్లి వైద్యం చేయించారు. నవంబరు 11న ఆ కుక్క మరణించడంతో కుటుంబసభ్యులు కుంగిపోయారు. దానికి ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. దానిపై ఉన్న ప్రేమతో రూ.2 లక్షలు ఖర్చుపెట్టి సమాధి కట్టించారు.

- చిత్తూరు అర్బన్, ఆంధ్రజ్యోతి

అభివృద్ధిలో ఏపీ పరుగులు

మోదీ, చంద్రబాబు, పవన్ సారథ్యంలో ముమ్ముందుకు

▸ ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామీ

▸ మదనపల్లె, రేణిగుంటల్లో మాజీ ప్రధాని వాజపేయి విగ్రహావిష్కరణ

మదనపల్లె/తిరుపతి(విద్య)/తిరుమల, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని వాజపేయి నిష్కళంక నేత, అభివృద్ధి ప్రదాత అని, ఆయన రాజకీయ జీవితం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకమని ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామీ అన్నారు. ఆదివారం రాష్ట్రానికి వచ్చిన ఆయన అన్నమయ్య జిల్లా మదనపల్లె, తిరుపతి జిల్లా రేణిగుంట మండలం మర్రిగుంట కూడళ్లలో ఏర్పాటు చేసిన దివంగత ప్రధాని వాజపేయి విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో ధామీ మాట్లాడుతూ ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సారథ్యంలో ఏపీ అన్ని విధాలా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. పోలవరం, అమరావతి నిర్మాణంతో పాటు గూగుల్ డేటా సెంటర్, తదితర పరిశ్రమలు వస్తున్నాయని, ఇందుకు కేంద్రం సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో పేదల సంక్షేమం, అభివృద్ధి దిశగా అడుగులు పడుతున్నాయని, దీంతో పేదల జీవన ప్రమాణాల పెంపుతో పాటు వారి ఆర్థిక స్థితిగతుల్లో మార్పు వస్తుందని చెప్పారు. 'దేవభూమి ఉత్తరాఖండ్ నుంచి విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ నడయాడిన పుణ్యభూమి మదనపల్లెకు రావడం నా అదృష్టంగా భావిస్తున్నా.. జాతీయ గీతం జనగణమనను బెంగాలీ నుంచి ఆంగ్లంలోకి అనువదించిన రవీంద్రునికి, అందుకు వేదికైన మదనపల్లెకు నమస్కారం చేస్తున్నా' అని వ్యాఖ్యానించారు. మాజీ సీఎం ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ దేశ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా వాజపేయి పనిచేశారని కొనియాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ వాజ్‌పేయి ఆశయాలకు మోదీ కార్యరూపం ఇస్తున్నారని అన్నారు. పాలన, అభివృద్ధిలో వాజపేయి స్ఫూర్తి, ప్రేరణను భవిష్యత్తు తరాలకు అందించడానికే అటల్-మోదీ సుపరిపాలన యాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు. అటల్ హయాంలో హైవేల నిర్మాణం, ఎయిర్‌పోర్టులు, టెలికాం, పోర్టుల కనెక్టివిటీతోనే దేశం అన్నివిధాలా అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఏర్పడిందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో శాసన మండలి వైస్ ఛైర్‌పర్సన్, రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ తదితరులు పాల్గొన్నారు.


మదనపల్లెలో వాజపేయి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామీ, చిత్రంలో మంత్రి సత్యకుమార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తదితరులు

తిరుమలలో పుష్కర్ సింగ్ ధామీ

మదనపల్లె, రేణిగుంట కార్యక్రమాల అనంతరం ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి ఆదివారం రాత్రి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం బయట ఆయన మీడియాతో మాట్లాడారు. స్వామిని దర్శించుకొని ఆనందానికి లోనయ్యానన్నారు. టీటీడీ వ్యవస్థ అద్భుతంగా ఉందని, కొన్ని లక్షల మంది భక్తులు స్వామి దర్శనానికి వస్తున్నప్పటికీ.. టీటీడీ మంచి ఏర్పాట్లు చేస్తోందని ప్రశంసించారు. భారతదేశం విశ్వ గురువుగా ఆవిర్భవించే సమయం ఆసన్నమైందని, ప్రధాని మోదీ నాయకత్వంలో వికసిత్ భారత్ సంకల్పాన్ని తామంతా స్వీకరించామని పేర్కొన్నారు.

ఉప్పాడ మత్స్యకారులకు ముగిసిన శిక్షణ

▸ కేరళ, తమిళనాడుల్లో వారం రోజులు నిర్వహణ

అమరావతి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపర్చేందుకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రకటించిన 100 రోజుల ప్రణాళికలో భాగంగా అధ్యయనం, అవగాహన, శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కేరళ, తమిళనాడుల్లో అవలంబిస్తున్న అధునాతన పద్ధతులపై అధ్యయనం చేసేందుకు ఈనెల 8న రెండు బృందాలుగా వెళ్లిన 60 మందికి స్థిరమైన ఆర్థికాభివృద్ధి సాధించడం ఎలా అనే అంశంపై శిక్షణ ఇప్పించారు. అధునాతన కేజ్ కల్చర్, రిఫ్‌కల్చర్, మార్కెటింగ్ వ్యవస్థల ఏర్పాటు, హార్బర్ల సందర్శన, హేచరీల్లో చేపల గుడ్లు పొదిగించడం, వలల తయారీ తదితరాలపై సెంట్రల్ సాల్ట్ అండ్ మెరైన కెమికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ సంస్థలతో వీరికి శిక్షణ ఇప్పించారు. తమిళనాడు వెళ్లిన బృందానికి చెన్నై సమీపంలోని మండపం వద్ద మెరైన్ నిపుణులు కృత్రిమ, సహజ పద్ధతుల్లో సాగు చేస్తున్న కేజ్‌కల్చర్, రిఫ్‌కల్చర్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. సముద్ర వనరుల దీర్ఘకాలిక సంరక్షణకు తీసుకోవాల్సిన శాస్త్రీయ విధానాలను తెలియజేశారు. విల్లుపురంలోని గోల్డెన్ మెరైన హార్వెస్ట్ హేచరీలో మత్స్య సంపద సృష్టిలో నూతన సాంకేతికతలను వివరించారు. చెన్నై సమీపం మెరీనా బీచ్‌లో ఆధునిక మౌలిక వసతులతో నిర్మించిన చేపల మార్కెట్‌లో చేపల నిల్వ, గ్రేడింగ్, వ్యర్థాల నిర్వహణ గురించి వివరించారు. కేరళలో పర్యటించిన బృందానికి అక్కడి ఎస్ఐఎఫ్‌టీలో వేటలో సాంకేతికత మేళవింపు, స్థిరమైన ఆదాయార్జన అంశాలపై శిక్షణ ఇచ్చారు. మునంబంలోని మోడల్ ఫిషింగ్ హార్బర్‌లో ఆధునిక పద్ధతుల్లో వలల తయారీ, నాణ్యత, మార్కెటింగ్ విధానాలపై అవగాహన కల్పించారు. రకరకాల చేప పిల్లల హేచరీలకు వీరిని తీసుకెళ్లి చేపల గుడ్లు పొదిగించడంపై శిక్షణ ఇచ్చారు.

మాతృభాషపై చిన్నచూపు తగదు

▸ ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ సుధామూర్తి

రాజాం/రూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): 'లక్ష్య సాధనలో మన మనసును ఇతర ప్రభావాల నుంచి దూరం చేసుకోవడానికి నిరంతరం కృషి, సాధన చేయాలని రాజ్యసభ సభ్యురాలు, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ సుధామూర్తి సూచించారు. విజయనగరం జిల్లా రాజాంలోని జీఎంఆర్ ఐటీ ప్రాంగణంలో ఆదివారం జీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో పట్టు సాధించాలంటే కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంగ్లీషుపై పట్టు సాధించాలన్నారు. అదే సమయంలో మాతృభాషపై చిన్నచూపు తగదని చెప్పారు. మాతృభాష, ఆంగ్లభాష శ్రీకృష్ణుడి ఇద్దరు తల్లులైన దేవకి, యశోద వంటివన్నారు. ఈ రెండు మనలోని వ్యక్తిత్వాన్ని తీర్చుదిద్దుతాయని తెలిపారు. కార్యక్రమంలో జీఎంఆర్ గ్రూపు సంస్థల ఛైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆదిత్యుడి సన్నిధిలో సుధామూర్తి

అరసవల్లి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా అరసవల్లిలో ఆదిత్యుడిని ఆదివారం ఇన్ఫోసిస్ వ్యవస్థాపక అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు సుధా నారాయణమూర్తి దర్శించుకున్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త గ్రంధి మల్లికార్జునరావు కుమార్తె బి.రమాదేవి, జీఎంఆర్ బిజినెస్ ఛైర్మన్ బి.వి.నాగేశ్వరరావుతో కలిసి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనివెట్టి మండపంలో పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. వారికి ఆదిత్యుడి స్వామి చిత్రపటం జ్ఞాపికను, ప్రసాదాన్ని ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ అందజేశారు. అలాగే శ్రీకూర్మంలోని కూర్మనాథుడ్ని కూడా సుధానారాయణమూర్తి దర్శించుకుని పూజలు చేశారు.

రిటైర్డ్ మునిసిపల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా గోగురాజు

భీమవరంటౌన్, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): రిటైర్డు మునిసిపల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా రేవూరి గోగురాజు (భీమవరం) ఎన్నికయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా డీవీఎస్ఎన్ మూర్తిమురళి (కాకినాడ), ఉపాధ్యక్షులు గా సీహెచ్. హరిబాబు(గుంటూరు), ఎంవీ నారాయణరెడ్డి(రాజమండ్రి), బి.మునుస్వామి(అనంతపురం), పీవీటీ రమణారావు (విశాఖపట్నం), కోశాధికారిగా జి.వేణుగోపాలస్వామి (తుని), ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కె. సత్యనారాయణ (కాకినాడ), జె.శ్యామ్‌రాజ్ (అనంతపురం), రీజినల్ సెక్రటరీలుగా ఎంవీ రామారావు (రాజమండ్రి), బి.వెంకటరామయ్య (అనంతపురం)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రిటైర్డు ప్రభుత్వ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పీఎస్ఎస్ఎన్ పీ శాస్త్రి వ్యవహరించారు.

ఇద్దరు హాస్టల్ విద్యార్థులకు తీవ్రగాయాలు.. ఒకరి పరిస్థితి విషమం

భోజన పాత్రలు ఇవ్వడానికి వెళుతుండగా రోడ్డు ప్రమాదం

▸ ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు.. ప్రమాదంపై మంత్రి సవిత సీరియస్


రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నరసింహ, భార్గవ్

కదిరి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో శ్రీసత్యసాయి జిల్లా ఓబుళదేవరచెరువు మండలం వడ్డివారిపల్లి సమీపంలోని ఎస్సీ వసతి గృహంలో చదువుతున్న ఇద్దరు హాస్టల్ విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఎస్సీ వసతి గృహంలో నరసింహ తొమ్మిదో తరగతి, భార్గవ్ ఎనిమిదో తరగతి చదువుతున్నారు. హాస్టల్ సమీపంలోని అయ్యప్ప స్వామి ఆలయం నుంచి ఆదివారం ద్యార్థులకు భోజనం పంపారు. భోజనం అనంతరం పాత్రలు ఇవ్వడానికి హాస్టల్ సిబ్బంది ద్విచక్రవాహనం తీసుకుని నరసింహ, భార్గవ్ బయల్దేరారు. కదిరి-హిందూపురం హైవేకి రాగానే కదిరి వైపు నుంచి ఓబుళదేవరచెరువు వైపు వెళ్తున్న కారు.. విద్యార్థుల ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ అంబులెన్స్‌లో కదిరికి తరలించారు. నరసింహ పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో హాస్టల్‌లో వార్డెన్ లేకపోవడం గమనార్హం. నరసింహది జిల్లాలోని గోరంట్ల మండలం కమ్మవారిపల్లి. భార్గవ్‌ది నల్లమాడ మండలం బొగ్గులవాండ్లపల్లి.

ప్రమాదంపై మంత్రి సీరియస్

రోడ్డు ప్రమాదంలో హాస్టల్ విద్యార్థులు గాయపడడంపై బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత సీరియస్ అయ్యారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు.

భార్యను చంపి.. శవాన్ని బైక్‌పై తీసుకెళ్లి..

▸ పోలీసు స్టేషన్‌లో లొంగిపోయిన భర్త

రొంపిచర్ల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విభేదాల కారణంగా పుట్టింట్లో ఉంటున్న భార్యను.. మాట్లాడాలని చెప్పి బయటకు తీసుకెళ్లిన భర్త.. ఆమెను కిరాతకంగా హతమార్చాడు. ఆ తర్వాత బైక్‌పై ఆమె శవాన్ని తీసుకుని వెళ్లి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. ఈ దారుణ ఘటన పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలంలో చోటుచేసుకుంది. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం, ఏల్చూరు గ్రామానికి చెదిన అల్లరి వెంకటేశ్‌తో రొంపిచర్ల మండలంలోని మాచవరం గ్రామానికి చెందిన మహాలక్ష్మి (26)కి తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. భర్తతో విభేదాల కారణంగా మహాలక్ష్మి కొంత కాలంగా పుట్టింట్లోనే ఉంటోంది. ఈ నేపథ్యంలో.. ఆదివారం మాచవరం వచ్చిన వెంకటేశ్.. మహాలక్ష్మితో మాట్లాడాలని చెప్పి ఆమెను ద్విచక్ర వాహనంపై బయటకు తీసుకెళ్లాడు. మాచవరం, బెహరావారి పాలెం మధ్యలో మహాలక్ష్మి చున్నీతోనే ఆమె మెడకు బిగించి హత్య చేశాడు. అనంతరం ఆమె మృతదేహాన్ని ద్విచక్ర వాహనంపై బాపట్ల జిల్లా సంతమాగులూరు పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి లొంగిపోయాడు. సంతమాగులూరు పోలీసులు, నరసరావుపేట రూరల్ సీఐ సుబ్బారావు మాచవరం గ్రామానికి చేరుకొని వివరాలు సేకరించారు. వివాహమైనప్పటి నుంచి తన కుమార్తెను.. ఆమె భర్త వెంకటేశ్, అతని సోదరుడు శ్రీను, అక్కలు రమణ, శబరి వేధించేవారని మృతురాలి తల్లి మరియమ్మ ఆరోపించారు. అనుమానంతోనే మహాలక్ష్మిని వెంకటేశ్ హత్య చేశాడని ఆమె రొంపిచర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. రొంపిచర్ల ఇన్‌చార్జి ఎస్ఐ ఫాతిమా కేసు దర్యాప్తు చేస్తున్నారు.


అల్లరి మహాలక్ష్మి, నిందితుడు వెంకటేశ్

చిలకలూరిపేట అర్బన్ ఎస్ఐపై వేటు

'బైపాస్' గ్యాంగ్‌కు అన్ని విధాలా రహంతుల్లా అండ

▸ సస్పెండ్ చేస్తూ పల్నాడు జిల్లా ఎస్పీ ఉత్తర్వులు

చిలకలూరిపేట, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట అర్బన్ ఎస్ఐ రహంతుల్లాను సస్పెండ్ చేస్తూ పల్నాడు జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. ఇటీవల చిలకలూరిపేట బైపాస్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో ఐదుగురు ఇంజనీరింగ్ విద్యార్థుల మృతికి కారణమైన ఏఎస్ఐ కుమారుడు, అతడి గ్యాంగ్ చేసే అక్రమ వసూళ్లకు అండగా ఉండడమే కాక, ఆ గ్యాంగ్‌కు పూర్తి స్థాయిలో సహకరించినట్టు తేలడంతో రహంతుల్లాపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ గ్యాంగ్ దొంగిలించిన నాలుగు కార్లను రహంతుల్లా కుటుంబసభ్యులు, సన్నిహితులు కొనుగోలు చేసినట్టు గుర్తించారు. వీటిలో రెండింటిని ఈ బైపాస్ గ్యాంగ్ నిత్యం వాడుతూ రోడ్లపై రవాణాశాఖ అధికారుల పేరుతో లారీ డ్రైవర్లను బెదిరించి డబ్బులు వసూలు చేసినట్లు దర్యాప్తులో తేలింది. గ్యాంగ్ సభ్యులతో నిత్యం సమాచారం పంచుకుంటూ, వారి ఆగడాలకు అడ్డు లేకుండా ఎస్ఐ రహంతుల్లా వ్యవహరించినట్టు గుర్తించారు. ఇంతకాలం ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయం రాకపోవడం చర్చనీయాంశంగా ఉంది. ప్రమాదంలో విద్యార్థులు మృతి చెందిన ఘటన తర్వాత మాత్రమే ఎస్ఐ రహంతుల్లా ప్రమేయం వెలుగులోకి వచ్చింది. కొందరు అధికారులు అక్రమాలకు పాల్పడుతూ, ఇష్టారాజ్యంగా వ్యవహరించడం పోలీసు శాఖలో అంతర్గత నిఘా వైఫల్యానికి అద్దం పడుతోంది.


చిలకలూరిపేట అర్బన్ ఎస్ఐ రహంతుల్లా



పోటెత్తిన ఇంద్రకీలాద్రి

భారీ సంఖ్యలో వచ్చిన భవానీలు

నేటితో దీక్షల విరమణ

విజయవాడ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రికి భవానీ భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఆదివారం సాయంత్రానికి లక్షా 20 వేల మందికిపైగా దుర్గమ్మను దర్శించుకున్నారని అంచనా. సోమవారం ఐదవరోజు దీక్షల విరమణ ముగియనుండటంతో రద్దీ పెరుగుతోంది. ఆదివారం కొండదిగువన కనకదుర్గానగర్, వన్‌టౌన్ రథం సెంటర్, కెనాల్ రోడ్డు, బ్రాహ్మణవీధి, ప్రకాశం బ్యారేజీ, వీఎంసీ కార్యాలయం, తదితర ప్రాంతాలలో భవానీలు, భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.



జీవించి ఉండటానికి నన్ను నేను ఒప్పించుకునే ప్రయత్నం నా కవిత్వం

మనుష్యులు తమతమ రోజువారీ యుద్ధాలను దాటడానికి పోరాటం ఎంత ముఖ్యమో పోనివ్వాలనే చూపూ అంతే ముఖ్యమని తెలిసిన కవి బివివి ప్రసాద్. అందుకే గెలుపు జ్వరం పట్టిన లోకంలో, ఓడిపోవడానికే ఎక్కువ ధైర్యం కావాలని ఇప్పటికి ఎన్నో యేళ్ళ క్రితమే తన కవిత్వంలో చెప్పగలిగారు. లోపలి ప్రపంచంతో నిజాయితీగా సాగే సంభాషణల్లో, కొంత ఆనందమూ, కొంత దిగులూ, కొంత ఆశా కొంత వెలితీ అన్నీ తెరలు తెరలుగా తనలోనే వచ్చిపోవడం మనిషికి తెలుస్తుంది.



ఆ ఉద్వేగాల ఉధృతిని అర్థం చేసుకునేందుకు ఉపకరించే తాత్విక అన్వేషణతోకూడిన కవిత్వం బివివి గారిది. లోపలి మనిషిపట్లా, లోకంపట్లా, దయాపూరితమైన చూపును, ఆలోచనను, మెలకువను ఈ కవిత్వంలో నేను చూశాను. సీతాకోక రెక్కల్లోని ఆశను, వర్షపు చినుకుల సంగీతాన్ని, వెన్నెలరాత్రుల నిశ్శబ్దంలోని గాఢమైన శాంతిని ఈ పదాల్లో నుండీ అందుకున్నాను. **బివివి ప్రసాద్** కొత్త కవిత్వ సంపుటి 'సృష్టి' విడుదలైన సందర్భంగా ఆయనతో ఇంటర్వ్యూ.

'ఆకాశం' సంపుటితో మొదలై మీ కవిత్వ సంపుటుల్లో మీదైన శైలి ప్రస్ఫుటంగా కనపడుతూ వస్తోంది. దీని వెనుక ఉన్న సాధన, ప్రభావాలను చెప్పండి.

'ఆకాశం' రాసేనాటికి, శిల్పపరమైన ఎలాంటి కండిషన్ లేకుండా, నన్ను నేను వాక్యాల్లోకి తెరుచుకోవటం కొంత చాతనైంది అనుకుంటాను. అయితే నా వాక్యం నేను కనుగొనడానికి సహాయపడినవారు ముఖ్యంగా టాగోర్, ఖలీల్ జిబ్రాన్. పరమ ఉదాత్తమైనదాన్నే కవితా సమయంలో తాకాలని నేర్పారు వారు. తర్వాత ఇస్మాయిల్. కవిత్వంలోకి అనుభవాన్ని అనువదించడం, ప్రధానంగా, ఆయన నుండి వచ్చిందనుకుంటాను.

మొదటి సంపుటి 'ఆరాధన'లోని కవితలలో ఏకరూపృత లేకపోవటం గమనిస్తే, నాదైన వాక్యం కోసం తపన పడటం తెలుస్తుంది. 'నేనే ఈ క్షణం' సంపుటిలోని కవితల కాలంలోనే, విస్తృతంగా సాధన చేసిన హైకూ ప్రక్రియ brevity, effect, ease లను నేర్పింది. గనుక జపనీయ కవుల ప్రభావం కూడా నా వాక్యాల్లో ఉండవచ్చును.

మీ కవిత్వం ప్రధానంగా తాత్విక అన్వేషణతో సాగుతుంది. మీపై ఉన్న తాత్విక ప్రభావాలేమిటి?

శ్రీ రమణమహర్షి బోధించిన ప్రశ్న 'నేనెవరు' నా తాత్విక అన్వేషణకి మూలం. ఆ 'నేను'ను గురించి విస్తృతంగా, లోతుగా వివరించిన నిసర్గదత్త మహారాజ్‌ని చదవటం స్పష్టతనిచ్చింది. 'నేను'ను మరింత సూక్ష్మంగా బోధించిన వారు శ్రీకాళహస్తిలోని సుబ్రహ్మణ్యంగారు. పూర్వ ఋషుల బోధలు, ఎకార్ట్ టోలీ వంటి ఆధునిక ద్రష్టల సూచనలు కూడా నా వెదుకులాటకి సహాయపడుతున్నాయి అనుకుంటాను. అయితే, అంతిమంగా ఎవరైనా తమదైన స్పష్టత, వెలుగు తామే పొందాల్సి ఉందనిపిస్తుంది.

రూమి, టాగోర్ లాంటి తాత్వికకవుల్లో దైవం కోసం, దైవానుగ్రహం కోసం, సన్నిధి కోసం వెదుకులాట ఉంటుంది. మీ అన్వేషణకు దైవం కేంద్రం కాదు. ఎందుకు?

పూర్వ తాత్వికకవులు సత్యాన్ని దైవంగా, object గా, చూడబడేదిగా తలచటం ఎక్కువ, కొన్ని మినహాయింపులున్నా. సత్యం subject అని, చూసేవాడు అని, నేనే సత్యమని జ్ఞానులు చెబుతారు. కనక, నా ప్రయత్నమంతా నన్ను నేను తెలుసుకోవటం వైపే, నేను నేనుగా ఉండటం వైపే ఉంటుంది. రమణమహర్షి తనలో తాను సంస్థితం కావటం అంటారు. తెలియటం కూడా కాదు, అదిగా ఉండటం. అది సర్వ దర్శనాల లక్ష్యంగా తోచింది.

ఒక ఆబ్జెక్ట్‌ని కవిత్వం చేయటంలో వెసులుబాటు ఉంటుంది. 'నేను'కీ ఆ వస్తువుకీ మధ్యనున్న ఖాళీలో ఎన్ని ఊహలైనా, నాటకీయత అయినా, ఎంత రసమైనా చొప్పించవచ్చును. కానీ 'నేను'ను కవిత్వం చేయటం దుస్సాధ్యం.

కానీ, ప్రసాద్ అనే నేను, ఏమీకాని నేనుగా ఉండాలనుకున్నపుడు ఆ ప్రయత్నం, వెదుకులాట, దుఃఖం, ఆనందం కవిత్వంగా మారే వీలు కలుగుతుంది. ఆ చలనాలు కేవలం బౌద్ధికం (intellectual) కాకుండా, హృదయగతమైనప్పుడు అది కవిత్వంగా పండుతుంది.

మీ కవితల్లో అధికభాగం 'నువ్వు' అని సంబోధిస్తూ రాస్తారు. దీనికేమైనా ప్రత్యేకమైన కారణం ఉందా?

నా కవిత్వం నాతో నేను జరిపే సంభాషణ. కవిగా ఉన్న తాను, ఒంటరి తనతో జరిపే సంభాషణలో కవి, ఒంటరి మనిషిని ఉద్దేశించి చెబుతుంటాడు. ఈ ధోరణి ఉద్దేశపూర్వకంగా కాకుండా, సహజంగా నాలో ఏర్పడిందనుకుంటాను.

> "కవిత్వం కానీ, మరే రచన, కళ గానీ మానవ చేతనని సున్నితపరచాలి, మానసిక ఆవరణలను విస్తరింప చేయాలి అని నమ్ముతాను. కేవల వినోద ప్రధానమైన కళ కాలక్షేపానికి మినహా, లోతైన ప్రయోజనమేదీ కలిగి ఉండదనిపిస్తుంది. కేవల సందేశ ప్రధానమైన కళ కూడా కొన్ని ఉపరితల ప్రయోజనాలు కలిగించవచ్చేమో కానీ, ఆంతరిక వికాసానికి అంతగా దోహదపడదు. సౌందర్యాన్నీ, ప్రయోజనాన్నీ కలుపుకొంటూ సత్య సీమలకి ప్రయాణించటం కళ లక్ష్యం."

గాఢమైన అనుభవంతో నిండిన ఒక మనిషి సాంత్వనగా పలుకుతున్న మాటల్లా వినపడుతుంది మీ కవిత్వం, అదే సమయంలో వాక్యాలు బోధ చేస్తున్నట్లు కూడా ఉండవు. ఇది ఎలా నిర్వహిస్తారు.

నా కవిత్వం, ముఖ్యంగా 'ఆకాశం'తో మొదలు పెట్టి, నన్ను నేను కన్విన్స్ చేసుకునే ప్రయత్నం, జీవితాన్నీ, మనుషుల్నీ, నన్నూ ప్రేమించటానికి, మరింత లోతుగా గ్రహించటానికి. చాలాసార్లు జీవించి ఉండటానికి నన్ను నేను ఒప్పించుకునే ప్రయత్నం కూడా. నాకు నేనే ఔట్‌సైడర్‌గా ఒక బోధకుడిలా, తండ్రిలా, మిత్రునిలా, కౌన్సిలర్‌లా ఉంటూ నాకు చెప్పుకోవటం. చెప్పే నేను, వినే నేను ఒకరే గనుక ఒకరు ఎక్కువా, ఒకరు తక్కువా కారు గనక, బోధ ఉన్నా అది ఆజ్ఞలా కాక, మృదువుగా, భుజం మీద చేయి వేసి మాట్లాడినట్లు వస్తుంది.

ఒక కవిత మీలో ఎలా తయారై, ఎలా వ్యక్తమవుతుంది?

కవిత్వం నా జీవితానుభవం నుండి, చూపు నుండి, ఆర్తి నుండి పుడుతుంది. అది ఆకాశంలో మేఘాలు పుట్టినట్టు, సాంద్రమైన భావాలుగా రూపు దిద్దుకొంటూ ఉంటుంది. మేఘం బరువెక్కినపుడు ఇక కురవబోతుంది అని మనకి తెలిసినట్లే, భావ సాంద్రత ఏదో ఒక సమయంలో ఒక ఊహ ద్వారానో, వాక్యం ద్వారానో, ఉపమ ద్వారానో పదాల్లోకి కురవబోతుంది అనిపిస్తుంది. మొదటివాక్యం పూర్తవుతూ ఉండగా, రెండవ వాక్యం తెరుచుకుంటుంది. ముగింపు వరకూ అలానే నడుస్తుంది. వాన వెలుస్తుంది. కవిత్వం రాయటం అయిదు, పదినిమిషాల పని. కానీ ఆ కవితకి తయారుకావటం వెనక జీవితమంతా ఉంటుంది అనుకుంటాను.

మీ కవిత్వం మొత్తం మానసిక ప్రపంచం చుట్టూ తిరుగుతుంది. నిర్దిష్ట వస్తువుల మీదా, సమస్యల మీదా కవితలు కనపడవు. ఎందువల్ల?

జీవితంలోని విషయాల కన్నా, అన్నిటినీ కలుపుకున్న జీవితమనే అనుభవం గురించి రాయటమే, కాలక్రమేణా నాకు ఇష్టంగా, సహజంగా మారింది. మారాల్సింది విషయాలు కాదు, చూపు అని జ్ఞానులు చెప్పటం వల్ల కూడా కావచ్చును, మొత్తం జీవితాన్ని చూసే చూపు మార్చుకొనే సాధనలోనే నా కవిత్వం భాగమవుతూ వచ్చింది. కనుకనే నిర్దిష్ట వస్తువులు, సమస్యలు నా కవితల్లో కనిపించవు. ఇది కాగితం మీది బొమ్మల గురించి గాక, బొమ్మలకు ఆధారమైన కాగితం గురించి మాట్లాడటం వంటిది.

మీ కవిత్వంలో కష్టమైన సంధులుండవు, పరుష పదాలుండవు. పొడుగైన పదబంధాలు కూడా ఉండవు. వత్తులు, ద్విత్వాక్షరాలూ కూడా అరుదు. ఎందుచేత మీ భాషను ఇట్లా నిర్మించుకున్నారు?

నేను అనుభవిస్తున్న, అర్థం చేసుకొంటున్న లోతైన, సున్నితమైన విషయాలు స్పష్టంగా, తేలికగా తెలియచేయటానికి చాలా సరళమైన మీడియం అవసరం అనిపించింది. అందు వలన భాష ఎక్కడా అడ్డు పడకుండా చూసుకుంటాను. నా కవిత్వంలో భాష, ఇదిగో నేనున్నాను అనదు. తానున్నానా, లేనా అన్నంత నిశ్శబ్దంగా, నిరాడంబరంగా భావాల్ని, కవి నుండి పాఠకుడికి చేరవేస్తుంది.

పూలు, సీతాకోకలు, వాన, ఆకాశం వంటివి తరచూ మీ కవిత్వంలో కనిపిస్తాయి. ప్రత్యేక కారణం ఏమైనా?

ప్రాకృతిక దృశ్యాలు మనం జీవితమని భ్రమపడుతున్న దాని నుండి జీవించటంలోకి మేల్కొలుపుతాయి. మానవుల్ని ఆశలూ, భయాలతో నిండిన మానసిక ఉద్వేగాల నుండి విముక్తం చేసి, సంతోషమూ, నిండుదనమూ, కనికరమూ వంటి హృదయ స్పందనలలోకి తీసుకువెళతాయి. ప్రాకృతిక పదాలు సహజంగానే కవిత్వ పరిమళాన్ని కలిగి ఉంటాయి గనుక, అవి ఉపయోగించటం ఇష్టంగా ఉంటుంది.

"ఈ లోకం చిటికెనవేలు పట్టుకుని ఇక్కడ ఉండటానికి భయమేమిటి, బాధేమిటి" అంటారు 'సృష్టి'లో. "చాలు అన్న మాట చివర ఏముందో ఎప్పుడన్నా చూసావా" అని 'ఊరికే జీవితమై'లో అంటారు. "నిశ్శబ్దంగా బ్రతికితే ఏమిటి? నిరాడంబరంగా వెళ్ళిపోతే ఏమిటి?" అంటారు 'ఆకాశం'లో. ఈ పరుగుల ప్రపంచంలో ఇంత నెమ్మదికి చోటెక్కడుంది? "పోనీలే" అన్న మీ మాటతో పక్కకు తప్పుకుంటే ఈ పోటీ ప్రపంచాన్ని ఎదుర్కోవడమెలా?

పరుగుల ప్రపంచం లోక మోహంలో మనసు కల్పించేది. తృప్తి మనసు తనతో తాను నిండినపుడు కలిగేది. మొదటి దానిలో పడి కొట్టుకుపోతున్నాం, గనకే రెండవది నొక్కి చెప్పటం. అనుభవాలా, శాంతా ఏది చివరిది అనే చూపు నివ్వటానికి ప్రయత్నమేమో, నా రాతలన్నీ.

జీవం నిండిన మెలకువతో పగలు గడపటానికి, రాత్రులు గాఢమైన నిద్ర అవసరం. పగటికి రాత్రి వ్యతిరేకం కాదు, పూరకం. అలానే, ఘర్షణతో నిండిన జీవితంలో ఉత్సాహంగా పాల్గొనటానికి శాంతి నిండిన మనసు అవసరం. ఆ శాంతిని కలిగించే మౌలిక విలువలలో, పోనివ్వు కూడా ఒకటి.

ఆశలలో కొట్టుకుపోయే మనసుకి, చాలు అనే భావన అమృత బిందువు. అది నిరాశని, చేతకానితనాన్ని ఇచ్చే చాలు కాదు, నిండుదనాన్ని, వివేకాన్ని ఇచ్చే చాలు.

ఇంటర్వ్యూ ■ **మానస చామర్తి**

© 79754 68091

గజ్జెల మల్లారెడ్డి శతజయంతి సదస్సు

సాహిత్య అకాడమీ – కడప యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో గజ్జెల మల్లారెడ్డి శతజయంతి సదస్సు డిసెంబరు 19 ఉ.10.30ని.లకు మొల్ల సమావేశ మందిరం, ఆర్ట్స్ బిల్డింగ్, యోగివేమన విశ్వవిద్యాలయం, కడపలో జరుగుతుంది. సభలో ఎం.ఎం. వినోదిని, రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, రాజశేఖర్ బెల్లంకొండ, టి. శ్రీనివాస్, జి. పార్వతి తదితరులు పాల్గొంటారు.

సాహిత్య అకాడమీ

90ఏళ్ళ అభ్యుదయ సాహిత్యం

సాహిత్య అకాడమీ - అభ్యుదయ రచయితల సంఘం, కర్నూలు ఆధ్వర్యంలో '90 ఏళ్ళ తెలుగు అభ్యుదయ సాహిత్యం' సదస్సు డిసెంబరు 21 ఉ.10గం.లకు సలాం ఖాన్ ఎస్టియు భవన్, ఉర్దూ పాఠశాల పక్కన, కర్నూలులో జరుగుతుంది. సభలో నవీన్ కుమార్, వల్లూరు శివప్రసాద్, కె. ప్రహ్లాద్, పెనుగొండ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొంటారు.

సాహిత్య అకాడమీ

రవ్వా శ్రీహరి సాహితీ పురస్కారం

ఆచార్య రవ్వా శ్రీహరి స్మారక సాహితీ పురస్కారాన్ని మల్లెతీగ సాహిత్యసేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కలిమిశ్రీ స్వీకరిస్తారు. అవార్డు ప్రదానం డిసెంబరు 21న విజయవాడలో జరుగుతుంది.

తుమ్మ సత్యనారాయణ

సోమవారం 15 డిసెంబరు 2025

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

మేరీ రాయ్ స్మారక ట్రస్ట్ సాహితీ పురస్కారం

శ్రీకాకుళపు జాయ్ అడియల్ మేరీ రాయ్ స్మారక ట్రస్ట్, ఉయ్యూరు ఇచ్చే ఉత్తమ సాహితీ పురస్కారానికి కవయిత్రి గంగవరపు సునీత ఎంపికయ్యారు. జనవరిలో విజయవాడలో M'3 (మాదిగ మిత్ర మండలి) ఆధ్వర్యంలో జరిగే సభలో రూ.25 వేల నగదు, షీల్డ్, శాలువాతో అవార్డు ప్రదానం అనిల్ డ్యాని నిర్వహణలో జరుగుతుంది.

శ్రీకాకుళపు రాజ్ కుమార్

'ఒక ఆకుపచ్చకల' కవిత్వ సంపుటి

కాసుల లింగారెడ్డి కవిత్వ సంపుటి 'ఒక ఆకుపచ్చకల' ఆవిష్కరణ డిసెంబరు 23 సా.6గం.లకు హైదరాబాద్ బుక్‌ఫెయిర్, తెలంగాణ కళాభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభలో కాసుల ప్రతాప్‌రెడ్డి, కె. శ్రీనివాస్, విమల మోర్తల, వి.ఆర్. తుమలూరి పాల్గొంటారు.

శ్రీధర్ గాజుల

యువ పురస్కారం

ఈశ్వర వరప్రసాద పరిషత్తు, గుంటూరు అందిస్తున్న యువ పురస్కారాన్ని 'ద్రావిడ మహాసముద్రం' కవితా సంపుటికి గూండ్ల వెంకటనారాయణ స్వీకరిస్తారు. పురస్కార ప్రదానం డిసెంబరు 21 ఉ.10గం.లకు కొరటాల మీటింగ్ హాల్, 2/7 బ్రాడీపేట, గుంటూరులో జరుగుతుంది. కె.జె.రమేష్, భూసురపల్లి వెంకటేశ్వర్లు, శెట్లం చంద్రమోహన్ తదితరులు పాల్గొంటారు.


ఎస్.యం. సుభాని

'తోవ ఎక్కడ' అన్న ప్రశ్నకు నాపై అప్రకటిత నిషేధం!

నా మొదటి పుస్తకం

సుంకిరెడ్డి నారాయణరెడ్డి

నా మొదటి పుస్తకం 'తోవ ఎక్కడ' అప్రకటిత నిషేధానికి గురైంది. విప్లవ వర్గం వారి అప్రకటిత నిషేధిత జాబితాలో ఉన్న నగ్నముని, అంబటి సురేంద్రరాజులు దీనికి ముందుమాటలు రాయడం ఒక కారణం. శివసాగర్ దీన్ని ఆవిష్కరించడం మరొక కారణం. విప్లవోద్యమ తాత్వికత మీద సంధించిన సంశయాల, ప్రశ్నల కవితలు, కొత్త మార్గ అన్వేషణాత్మక కవితలు ఈ సంపుటిలో ఉండడం అసలు కారణాల్లో ఒకటోది. దళిత, స్త్రీవాద అస్తిత్వ ఉద్యమాల్ని ఆహ్వానించడం, తెలంగాణ వాదాన్ని సూచన ప్రాయంగా చెప్పడం అసలు కారణాల్లో రెండోది. ఈ సంపుటిలోనే విప్లవోద్యమంతో మమేకమైన కవితల్ని, సామ్రాజ్యవాద వ్యతిరేక కవితల్ని మాత్రం వారు విస్మరించారు.



శివారెడ్డి గారు అందరికీ చెప్పినట్టే "ఇప్పుడే వద్దు నాన్న" అని చెప్పినందువల్ల, ఇతర కారణాల వల్ల, 1977 నుంచి రాస్తున్నప్పటికీ 1994 వరకు సంపుటి తేకుంట ఆగిన. ఆ ఏడాది గుడిహాళం రఘునాథం, గుంటూరు ఏసుపాదం, కె. నరసింహాచారి నేను కలిసి వడపోసి కొన్ని కవితలతో ఈ సంపుటిని తెచ్చిన. అప్పుడు అచ్చు పెద్ద యజ్ఞం. ఎందుకో తెనాలిలో అచ్చువేసిన. జుగాష్ విలీ, కె. శివకుమార్ అక్కడ ఉన్నందువల్ల కావచ్చు. హైదరాబాద్ నుంచి పేపర్ బండిల్స్ బస్సులో తెనాలి తీసుకెళ్ళి, పసుపులేటి వెంకటరమణ, పి. తిరుపతిరావుల ఆధ్వర్యంలో ముద్రించిన. 'దాసి' సినిమా కాస్ట్యూమ్స్ డిజైనర్ సుదర్శన్‌తో ముఖచిత్రం వేయించిన. ముద్రణ బైండింగ్ కూడా అయినంక ఆ ముఖచిత్రం నచ్చక విప్పేసి, వెంకటరమణ సూచించిన ముఖచిత్రంతో ఫైనల్‌గా అచ్చువేసిన. కవిత్వ సంపుటి పేరు, దాని ముఖచిత్రం, అప్పటి వాతావరణాల్ని బట్టి నన్ను ఆకాశానికి ఎత్తుతారన్న ఆశ నాకేమీ లేదు. ఊహించినట్టుగానే "తోక ఎక్కడ" అని ప్రశ్నించి అవహేళన చేసినారు. అధిక్షేప కవుల పక్కన చేర్చి ఎకసెక్కెం చేసినారు. నో రిగ్రెట్స్! నేనొక చారిత్రక కర్తవ్యాన్ని నిర్వర్తించిన అనే ఆత్మవిశ్వాసం నాకుంది.




> **కవిత్వ సంపుటి పేరు, దాని ముఖచిత్రం, అప్పటి వాతావరణాల్ని బట్టి నన్ను ఆకాశానికి ఎత్తుతారన్న ఆశ నాకేమీ లేదు. ఊహించినట్టుగానే "తోక ఎక్కడ" అని ప్రశ్నించి అవహేళన చేసినారు. అధిక్షేప కవుల పక్కన చేర్చి ఎకసెక్కెం చేసినారు. నో రిగ్రెట్స్! నేనొక చారిత్రక కర్తవ్యాన్ని నిర్వర్తించిన అనే ఆత్మవిశ్వాసం నాకుంది.**

నా కవితా సంపుటికి పేరును ఆలూరి బైరాగి కవిత్వం నుంచి తీసుకున్న. 'తోవ ఎక్కడ?' అన్నది ఆనాటి బైరాగి ఒక్కడి ప్రశ్న కాదు, నా ఒక్కడి ప్రశ్న కాదు, అప్పటి బాలగోపాల్ ప్రశ్న, దళితుల ప్రశ్న, స్త్రీల ప్రశ్న, సకల అస్తిత్వాల ప్రశ్న, రష్యా చైనా తూర్పు యూరోప్‌ల పరిణామాల మీద ప్రపంచవ్యాప్తంగా తలెత్తిన ప్రశ్న. ఈ ప్రశ్న ప్రాధాన్యాన్ని వివరిస్తూ నగ్నముని, అంబటి సురేంద్ర రాజులు అద్భుతమైన ముందుమాటలు రాసి నాలో ఆత్మవిశ్వాసాన్ని నింపినారు.

'గడియారంలో లేని కాలం' అనే శీర్షికతో నగ్నముని ఇలా రాసినాడు: "కవిగా ఆలోచనపరుడిగా తెలుగువాడిగా భారతీయుడిగా ప్రపంచ పౌరుడిగా చరిత్రలోని నాలుగు రోడ్ల మధ్య నిలబడి నేటి ఏకధ్రువ ప్రపంచ ప్రయాణ దిశ తెలుసుకోగోరి 'తోవ ఎక్కడ' అని అడుగుతున్నాడు. ఇది చిన్న ప్రశ్న కాదు, సాదాసీదా ప్రశ్న కాదు, ఇది ఈ పుస్తకానికి, ఇందులోని ఒక కవితకు పెట్టిన పేరు మాత్రమే కాదు, ఇది పెను ప్రశ్న, మానవ చరిత్రలోని ప్రధానమైన ప్రశ్న.... ఈ ప్రశ్నకు సమాధానం లభిస్తే దానిలో సామాజిక తాత్వికాంశం, రాజకీయ తాత్వికాంశం, వ్యవస్థ తాత్వికాంశం లభిస్తాయి.... సామాజిక తాత్విక వ్యవస్థ... మార్పుల మలుపులో ఉన్న సమయంలో 'తోవ ఎక్కడ' అని అందరి దృష్టికి గంభీరంగా తీసుక వస్తున్నాడు". నగ్నముని ఇలా నా ప్రశ్న సామంజస్యాన్ని తార్కికంగా నిరూపించారు. అలాగే దళిత స్త్రీవాదాలను ఆహ్వానించడాన్ని తాత్వికంగా సమర్థించినారు. 'కవిత్వంలో కొత్త తోవ' శీర్షికతో అంబటి సురేంద్రరాజు రాసిన ముందుమాటలో ఇలా అన్నారు: "(శ్రీశ్రీ) పదుగురిని ఆ తోవన నడిపించి తోవకు క్రెడిబిలిటీ తెచ్చిపోయాడు. సుంకిరెడ్డి ఆ తోవ క్రెడిబిలిటినే క్వశ్చన్ చేస్తున్నాడు... నిజమైన కవి గనుక మనం త్రోవ తప్పిన సంగతి కనిపెట్టి కొత్త తోవను గాలిస్తున్నాడు."

ఉదయం పత్రికలో 'కొత్త చూపు కోసం తపననే తోవ ఎక్కడ' శీర్షికతో కాసుల ప్రతాపరెడ్డి ఇలా రాసినాడు: "ప్రస్తుతం విప్లవ కవిత్వం 'నగిషీల' మధ్య 'నటన'ల మధ్య కొట్టుమిట్టాడుతున్నది. దీనికి విప్లవోద్యమాల తాత్విక వెనుకబాటే కారణం. ఈ వెనుకబాటుతనం నేపథ్యం నుంచే విప్లవోద్యమాలు విస్మరించిన అంశాల పునాదుల్లోంచే దళిత కవిత్వం స్త్రీవాద కవిత్వం గొంతు సారించాయి. 'ఊరి బయటి దుఃఖాలకు/ గొంతునిచ్చిందా మన సూర్య గీతం' అని ప్రశ్నిస్తూనే దళిత వాదాన్ని గుర్తించాల్సిన అవసరాన్ని గుర్తుచేశాడు కవి". ఆంధ్రజ్యోతి పత్రికలో 'ప్రత్యామ్నాయ విప్లవ కవిత్వం తోవ ఎక్కడ' అని శీర్షికతో గుంటూరు లక్ష్మీనరసయ్య సమీక్షించారు: "విప్లవోద్యమాలను గుడ్డిగా స్తుతించడం కాక విమర్శనాత్మకంగా ప్రశ్నించడం, ఉద్యమాల ఆర్థిక వాదాన్ని అప్రజాస్వామిక ఆచరణనూ ఎండకట్టడం, దళిత స్త్రీవాదాలను ప్రగతి వాదాలుగా గుర్తించి వాటిని విప్లవోద్యమాలు సొంతం చేసుకుని తమ అవగాహన ఆచరణలను విస్తృతం చేసుకోవాలని కోరుకోవడం స్థూలంగా ఈ మూడు లక్షణాలను ప్రత్యామ్నాయ విప్లవ లక్షణాలుగా చెప్పొచ్చు. ఇట్లా అంటే ఎక్కడ ప్రగతి వాద వ్యతిరేకులమని పేరు పడాల్సి వస్తుందో అన్న భయం ఈ కవికి లేదు." లక్ష్మీనరసయ్య ఊహించినట్లే నాకు పడిన శిక్ష దశాబ్ద కాలం. ప్రగతిశీల వేదికల నుంచి బహిష్కారం. పది క్యాలెండర్ల అనంతరం, తెలంగాణ అస్తిత్వ ఉద్యమంతోనే, ఆ సందర్భంగా నేను చేసిన రచనలతోనే, నేను చేసిన కార్యకలాపాలతోనే నాకు విముక్తి దొరికింది. నన్ను మళ్లీ లెక్కలోకి తీసుకున్నరు. ■



నవ్వు



అమాయకత్వమో, అజ్ఞానమోగాని
నాకామె తెలువదు
నేనామెను చదవలేదు

ఆమె నవ్వొక్కటే తెలుసు

అది వెంటాడే నవ్వు
వేల భరోసాల నవ్వు
కొండసిగలో పూసిన వెన్నెల నవ్వు
అంతుబట్టని అడవి రహస్యం
ఆకాశపుటూయలలో అర్ధరాత్రి నక్షత్రగానం

ఆ నవ్వు ఇప్పటిదేనా
ఇంతకుముందు కూడా ఉన్నదా
నాకది చిరపరిచితమైనదేనా

అవును
నేను తొలిసారి భూమ్మీద పడ్డపుడు
నన్నెత్తుకు ముద్దాడుతూ వికసించిన
మా అమ్మ నవ్వే అది
నేను బర్రెల్ని కాస్తున్నప్పుడు
ఎండాకాలపు సాయంకాలంలో
వరిపైరు మీదుగా వీచిన
చిరుగాలి సితార సంగీతమే అది

ఆ నవ్వు
తొలిసారిగా
రోమన్ సైన్యం మట్టి గరిచినప్పుడు
స్పార్టకస్ ముఖంలో
వెల్లివిరిసిన కాంతిపుంజం
భూస్వామి తలతెగిపడ్డప్పుడు
'బషాయిటుడు' కళ్ళలో
విప్పారిన వసంతాల సందోహం

అనేక స్థలకాలాలు దాటి
దుర్భేద్యపు కోటల్ని
నిశ్చలంగా ఎదుర్కొన్న నవ్వు
ఎందరో వీరులు
ఉరికంబాల మీద చేసిన
చివరి సంతకం ఆ నవ్వు

అది మంచు కడిగిన మల్లెపువ్వు
సముద్రం దాని ముందు దిగదుడుపు

అరే భాయ్
ఏ ఫంక్షన్ల కాడనో
స్నేహితుల, బంధువుల కబుర్లలోనో
ప్రేయసీప్రియుల స్వీట్ నథింగ్స్ లోనో
వొచ్చీ పోయే బాటల్లోనో
ఆడీపాడే అనుభవాలలోనో
విరబూసిన, అరవిరిసిన నవ్వుల్ని
నిర్వచించగలమేమో గాని
చుట్టూరా యుద్ధబీభత్సంలో
తొణకని చిరునవ్వును
ఎవడు నిర్వచించగలడు
యుద్ధం తెలిసినవాడు తప్ప
శాంతి తెలిసినవాడు తప్ప
యుద్ధమూ శాంతి మధ్య
వికసించిన మానవేతిహాసం చదివినవాడు తప్ప

ఎవడ్రా అన్నది
మనిషిని చంపి
పాలిథిన్ కవర్లో చుట్టబెడితే
ఆ నవ్వు ఆగిపోతుందనీ

దాన్ని ఎవరూ ఆపలేరు
భూమిలో నాటితే
చెట్టయి మొలుచుకొస్తది
సముద్రంలోకి విసిరేస్తే
పూల పడవలా సాగి వొస్తది
కొండలో దాస్తే
దాని గుండెని జీల్చుకు
జలపాతమై దూకుతూ వొస్తది

అది నూతన మానవుడి
అజేయ సంకేతం
పీడన ఉన్నంతవరకు
పీడకుని ముఖం మీద ఉమ్మేసే
ధిక్కార దరహాసం

ఆ నవ్వుకు నా సలాం

■ **ఉదయమిత్ర**

('బషాయిటుడు': మహాశ్వేతాదేవి నవలలో కథానాయకుడు)

మాట్లాడుకోకపోవడం అంటూ ఏమీ ఉండదు
మదిని దాటే పలుకులకేమీ కొదువలేదు
థర్మోకోల్ ముత్యాల్ని
గదిన రాశులుగా కొలుస్తూనే ఉంటావు

అనేకసార్లు
నన్నేనాని అడుగుతూ పొరబడుతూ
గొట్టె తల వేలాడేసుకుని
వెనుదిరుగుతూ ఉంటావు

అది గూగుల్ గుసగుసలేనని
కట్టుకున్నోళ్లతో కన్నోళ్ళతో కాదని
వేరే చెప్పక్కర్లేదనుకుంటా!

ప్రేమాన్విత సమయ సందర్భాలు
సీతాకోకచిలుకలై విహరిస్తాయి
మధ్యన
వెన్నెల–వెలుగు నక్షత్రాల–మెరుపు
రాత్రుల్ని నీలం చేస్తాయి

పైకప్పుకు అతికిన బొమ్మలు అవన్నీ
అని ఆశ్చర్యపోనక్కర్లేదనుకుంటా!

విడుదల దినాల్ని
జైలు గోడల మీద గీస్తున్న బందీలా
కలిసిన జతకూడిన
కరుగు కాలాన్ని లెక్కిస్తూ
బంధాల్లో ఉంటావు
+++
యుద్ధం ముగియదు
దేహాలు రక్తమోడవు అంగాలు తెగిపడవు
ఐనా
తీతువు సంగీతం పరీవ్యాప్తమై ఉంటుంది
నీ ఒంటిన ఇంటిన నిండారుగా
+++
అచట కాగే
పగటి రాత్రుల్ని రాత్రి పగళ్ళని చూసి
విరుద్ధ ప్రకృతికి విస్తుపోతారు
సూర్యచంద్రాదులు
+++
ఎడారి సంద్రాల ఒంటరివని
ఎరుక కలుగ వెచ్చించిన సమయం
ఓ జీవితయానమవడం
హెచ్చించిన పెనువిషాదం
ఇపుడు

■ **పిన్నంశెట్టి కిషన్**

© 97002 30310



లక్ష్యాలు ఘనం ఆచరణ అధమం

- విశ్వకర్మ పథకం అమలులో నిర్లక్ష్యం
- మొక్కుబడిగా లబ్ధిదారుల ఎంపిక
- దరఖాస్తులు లక్షల్లో.. ఎంపిక వందల్లో

చేతి వృత్తులపై ఆధారపడి జీవించే వారి అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రధాని విశ్వకర్మ యోజన అమలులో నీరుగారిపోతోంది. పథకం లక్ష్యాలు ఘనంగా ఉన్నా.. అమలు అధమంగా ఉంది. మొక్కుబడిగా లబ్ధిదారులను ఎంపిక చేసి... అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. లబ్ధి దారులకు పథకం చేరువ కాక నష్టపోతున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో విశ్వకర్మ పథకం కోసం రెండు లక్షల మందికి పైగా దరఖాస్తులు చేసుకున్నారు. అయితే వందల సంఖ్యలోనే లబ్ధిదారులను ఎంపికచేయడం గమనార్హం. బ్యాంకర్లు విశ్వకర్మ పథకం అమలుకు అసలు సహకరించడం లేదని లబ్ధిదా రులు విమర్శిస్తున్నారు. బ్యాంకర్లను రుణాలు ఇచ్చేందుకు ఒప్పించడంలో ప్రజాప్రతి నిధులు.. అధికారులు విఫలమవుతున్నారు.

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

పీఎం విశ్వకర్మ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం చేతి వృత్తులను ప్రోత్సహించేందుకు అమలు చేస్తోంది. చేతి వృత్తులు, కళాకారులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి, వారికి ఆర్థిక సాయం, పనిముట్లు అందించడం పథకం ముఖ్య ఉద్దేశం. ఆధునిక పనిముట్లు, మెటీరియల్ కొనుగోలులో రాయితీ అందించడం, చేతి వృత్తుల ఉత్పత్తులకు మార్కెట్ కల్పించడం తద్వారా.. సాంప్రదాయ కళలు, చేతి వృత్తులను ప్రోత్సహించడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. ఎంపిక చేసిన లబ్ధిదారులకు ప్రాథమిక, ఆధునిక నైపుణ్యాలపై శిక్షణ ఇస్తారు. ప్రోత్సాహకం కింద రూ.15,000 విలువైన టూల్ కిట్ అందజేస్తారు. శిక్షణ పొందిన వారికి బ్యాంకు నుంచి తొలి విడతలో తక్కువ వడ్డీకి రూ.లక్ష, అనంతరం

(మిగతా 6లో)

గుంటూరు జిల్లాలో 1,06,277 మంది దరఖాస్తు చేయగా.. 5,261 మందిని ఎంపిక చేశారు. వీరిలో 3,511 మందికి నైపుణ్య శిక్షణ ఇచ్చారు. అనంతరం 2,816 మంది రుణ దరఖాస్తులను బ్యాంకులకు పంపారు. వీటిలో 1,140 మందికి మాత్రమే రుణాలు అందజేశారు. జిల్లాలో రూ.8.04 కోట్లు రుణాలు మంజూరయ్యాయి. ఇక టూల్ కిట్‌లు 1,076 మందికి అందజేశారు.





- బిల్లు కంటే అదనంగా నగదు డిమాండ్
- దీపం-2 ఐవీఆర్ఎస్ సర్వేలో 40 శాతం ప్రజాభిప్రాయం
- 6, 11, 12 స్థానాల్లో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలు

గ్యాస్ డెలివరీకి.. అధనం

గుంటూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సరఫరాలో డెలివరీ బాయ్స్ బిల్లు కంటే అదనంగా నగదును డిమాండ్ చేస్తున్నారు.. ప్రాంతాన్ని బట్టి బిల్లు కంటే అదనంగా రూ.35 నుంచి రూ.40 వరకు డిమాండ్ చేస్తున్నారు.. ప్రశ్నిస్తే తమకు డిస్ట్రిబ్యూటర్ చాలా తక్కువ మొత్తంలో వేతనం ఇస్తున్నారు.. మీరు ఇవ్వకపోతే ఎలా అంటూ గ్యాస్ వినియోగదారులు దీపం-2 ఐవీఆర్ఎస్(ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్) ఫీడ్‌బ్యాక్ సర్వేలో తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దీపం-2పై ప్రజల్లో సంతృప్తి శాతం తెలుసుకునేందుకు నిర్వహించిన ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ గణాంకాలను మూడు జిల్లాల జాయింట్ కలెక్టర్లకు పంపించింది. తక్షణమే దీనిపై దృష్టి పెట్టి ఎక్కువ ఫిర్యాదులు అందిన డిస్ట్రిబ్యూటర్లపై తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించింది. గుంటూరు జిల్లాలో 38.7 శాతం, బాపట్లలో 38, పల్నాడులో 40.9 శాతం మంది వంట గ్యాస్ వినియోగదారులు తమ వద్ద రశీదులో ఉన్న రూ.877.50 కాకుండా రూ.920 వసూలు చేస్తున్నారని చెప్పారు. గుంటూరు జిల్లాలో 10 మంది డిస్ట్రిబ్యూటర్ల పనితీరు ఏమాత్రం బాగోలేదని చెప్పారు. దీంతో వారితో పాటు ఇంధన కంపెనీల ప్రతినిధులను పిలిపించి జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ హెచ్చరించారు. పనితీరు మార్చుకోకుంటే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. గ్యాస్ డెలివరీ బాయ్స్ ప్రవర్తన విషయంలో పల్నాడులో 83.5 శాతం, బాపట్లలో 80.7 శాతం, గుంటూరులో 84.5 శాతం మంది వినియోగదారులు బాగానే ఉందని చెప్పారు. ఓవరాల్‌గా గుంటూరు ర్యాంకు 72.9 సంతృప్తి శాతంతో 6వ స్థానంలో నిలిచింది. బాపట్ల జిల్లా 71.4 శాతంతో 11వ ర్యాంకు, 71.3 శాతంతో పల్నాడు మూడో స్థానంలో నిలిచాయి.

రేషన్ సరుకులపై కూడా అభిప్రాయ సేకరణ

రేషన్ సరుకులపై కూడా ప్రభుత్వం ఐవీఆర్ఎస్ ద్వారా ఫీడ్‌బ్యాక్ తీసుకున్నది. గుంటూరులో 82.2 శాతం, పల్నాడులో 81.8 శాతం, బాపట్లలో 82.3 శాతం మంది రేషన్ సరుకులు తీసుకుంటున్నట్లు చెప్పారు. తీసుకున్న రేషన్ సరుకుల నాణ్యత విషయంలో గుంటూరు జిల్లాలో 80, బాపట్లలో 81.6, పల్నాడులో 81.6 శాతం మంది బావుందని చెప్పారు. ఓవరాల్‌గా 81.9 శాతంతో బాపట్ల 10వ స్థానం, 81.7 శాతంతో పల్నాడు 12వ ర్యాంకు, 81.1 శాతంతో గుంటూరు 16వ ర్యాంకులో నిలిచాయి. ఈ నేపథ్యంలో పౌరసరఫరాల అధికారులు, రేషన్ డీలర్లు తగిన చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

రౌడీషీటర్లపై ఉక్కుపాదం

- ఇద్దరిపై పీడీ యాక్ట్.. మరొకరి అరెస్టు
- హింసాత్మక చర్యలను ఉపేక్షించేదిలేదు : ఎస్పీ



అరెస్టయిన రౌడీషీటర్ జక్కా నాగేశ్వరరావు

గుంటూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు పోలీసులు రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపారు. హింసాత్మక ఘటనలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న ఇద్దరిపై పీడీ యాక్ట్ ప్రయోగించారు. మరొకరిని అరెస్టు చేశారు. ఎస్పీ వకుల్‌జిందాల్ సిఫార్సుల మేరకు బాజీ, ఫైజల్‌లపై పీడీ యాక్ట్ అమలు పరుస్తూ కలెక్టర్ తమీమ్‌అన్సారియా ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో వారిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. అడవితక్కెళ్ళపాడు పరిధిలోని సుందరయ్య కాలనీ ఐదో లైనుకు చెందిన రౌడీషీటర్లు షేక్ బాజీ అలియాస్ సిరిపురం బాజీ(42)పై నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఏ కేటగిరి రౌడీషీట్ ఉంది. బాజీ ఐదు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. రామిరెడ్డితోట 1వలైనుకు చెందిన షేక్ సమీర్ అలియాస్ ఫైజల్(19)పై కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏ ప్లస్ రౌడీషీట్ ఉంది. సమీర్ రెండు హత్యలు సహా పది కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. రౌడీషీటర్ షేక్ సమీర్ బాల్యం నుంచే నేర జీవితానికి అలవాటు పడి దోపిడీలు, దొంగతనాలు, హత్యలతో సంఘ విద్రోహ కార్యకలాపాలు వంటి తీవ్రమైన నేరాల్లో పాల్గొంటున్నాడు. పలు కేసుల్లో నిందితులుగా ఉంటూ, జైలుకు వెళ్లి శిక్ష అనుభవించినా వారిలో ఎటువంటి మార్పు రాకపోగా వారు తమ కార్యకలాపాలను తీవ్రంగా కొనసాగిస్తున్నారని ఎస్పీ తెలిపారు. వారి ప్రవర్తనలో మార్పు రానందున పీడీ చట్టం ప్రయోగించినట్లు తెలిపారు. జిల్లాలో రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీట్లు, హిస్టరీ షీట్లు ఉన్నవారిపై నిరంతరం నిఘా పెట్టామన్నారు.

జైలుకు రౌడీషీటర్..

నగరంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీనివాసరావు తోటకు చెందిన రౌడీషీటర్ జక్కా నాగేశ్వరరావును పోలీసులు అరెస్టు చేసారు. కత్తితో బెదిరించడం,మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించడం, స్థానికులను భయ భ్రాంతులకు గురి చేయడం వంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు స్థానికులు శనివారం నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో అతడ్ని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచారు. మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు నిందితుడైన రౌడీషీటర్‌ను రిమాండ్ నిమిత్తం జైలుకు తరలించారు.

కానిస్టేబుళ్లకు రేపు నియామకపత్రాలు

- బెటాలియన్‌లో అందజేయనున్న ముఖ్యమంత్రి
- చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



వేదికను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్,అధికారులు

మంగళగిరి సిటీ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన పోస్టుల భర్తీలో ఎంపికైన 6,100 మంది కానిస్టేబుల్ అభ్యర్థులకు మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంగళగిరిలోని ఏపీఎస్పీ బెటాలియన్‌లో నియామక పత్రాలను అందించనున్నారు. సీఎం పర్యటనకు సంబంధించి చేస్తున్న ఏర్పాట్లను ఆదివారం గుంటూరు కలెక్టర్ తమీమ్ అన్సారియా, ట్రైనింగ్ డీఐజీ బి.సత్యయేసుబాబు, ఎస్పీ వకుల్‌జిందాల్ పరిశీలించారు. వేదిక నిర్మాణం, బారికేడింగ్, రాకపోకల మార్గాలు, అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులకు కల్పిస్తున్న వసతులపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమ ఏర్పాట్లను నిర్దేశిత ప్రణాళిక ప్రకారం త్వరిత గతిన పూర్తి చేయాలని సూచించారు. హాజరయ్యే అభ్యర్థులకు వసతి, భోజన సదుపాయాలు కల్పించాలని, పారిశుధ్య లోపం తలెత్తకుండా ఎంటీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సభా ప్రాంగణంలో నాలుగు అంబులెన్సులు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్యఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. వాహనాలకు తగినంత పార్కింగ్ సౌకర్యం కల్పించాలని, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నియామక పత్రాలు స్వీకరించేందుకు వచ్చే అభ్యర్థులను ఎయిమ్స్ బ్లాక్ వన్, టూ ఎదురుగా ఉన్న గేటు నుంచి వేదిక వద్దకు ప్రవేశ మార్గం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, ఎస్ఎస్‌జీ అదనపు సంచాలకులు మల్లికార్జున, ఏఎస్పీలు హనుమంతు, రమణమూర్తి, రవికుమార్, డీఎస్పీలు శ్రీనివాసులు, మురళీకృష్ణ, జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, ఆర్అండ్‌బీ పర్యవేక్షక ఇంజనీరు కే కల్యాణ చక్రవర్తి, జిల్లా పౌర సరఫరాల అధికారి పీ.కోమలి పద్మ, వైద్య ఆరోగ్యశాఖ అధికారి సునీత, తదితరులు పాల్గొన్నారు.

రూ.50 వేల కోట్లతో అమరావతి అభివృద్ధి

- రాజధానికి చట్టబద్ధతపై త్వరలో పార్లమెంట్‌లో గెజిట్
- మోతడకలో రూ.5 కోట్లతో పికిల్ క్లస్టర్ ఏర్పాటు
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



మోతడకలో సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

తాడికొండ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణానికి రైతులు ఇచ్చిన భూముల్లో రూ.50 వేల కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని మోతడక గ్రామంలో రూ.2.3 కోట్లతో నిర్మించిన బీసీ, ఎస్సీ, ఓసీ కమ్యూనిటీ హాళ్లను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ అమరావతిని చట్టబద్ధం చేసేందుకు త్వరలోనే పార్లమెంట్‌లో గెజిట్ ప్రవేశ పెడతామన్నారు. మోతడకలో రూ.5 కోట్లతో పికిల్ క్లస్టర్‌ను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. టీడీపీ హయాంలో గ్రామాల్లో సిమెంట్ రోడ్లు నిర్మించక పోయి ఉంటే ఈ రోజు మనం ఇలా ప్రశాంతంగా నడవగలిగే వాళ్లమే కాదన్నారు. హైదరాబాద్‌లో హైటెక్ సిటీ ప్రారంభించడానికి ముందు ఒక ఎకరం రూ.2 లక్షలు ఉండగా, నేడు హైటెక్ సిటీకి 50 కిలోల మీటర్ల దూరంలో ఉన్న ప్రాంతంలోను ఒక్కో ఎకరం రూ.2 నుంచి 3 కోట్లు పలుకుతుందన్నారు. రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు, శ్మశాన వాటికలు, యూజీడీ వంటి మౌలిక సదుపాయాలు పూలింగ్‌కు ఇచ్చిన 29 గ్రామాల్లో ఏర్పాటుకానున్నాయన్నారు. విశాఖలో ఈరోజు ఎన్నో ఇండస్ట్రీలతో పాటు గూగుల్ డేటా సెంటర్ కూడా ఆవిర్భవించనున్నదని తెలిపారు. అమరావతిలో కొందరు రైతులు పడుతున్న ఇబ్బందులకు కిందిస్థాయి ఉద్యోగులు చేసిన కొన్ని పొరపాట్లు కూడా ఒక కారణం కావచ్చని తెలిపారు. అవాస్తవ కథనాలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ నిధులు ఏ మార్గంలో తీసుకురావాలి, ప్రజలకు ఎలాంటి సౌకర్యాలు కల్పించాలి అని ఆలోచించే నాయకత్వం ఈ గ్రామానికి ఉందన్నారు. మోతడకలో ప్రారంభించిన కైలాసనత్రం, కమ్యూనిటీ హాళ్లే ఇందుకు నిదర్శనమని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ యడ్లపల్లి పార్వతి, జనసేన నాయకులు బేతపూడి రాజశేఖర్, బీజేపీ నాయకులు కంతేటి బ్రహ్మయ్య, మండల పార్టీ అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, మార్కెట్‌యార్డు ఛైర్మన్ నీలాల కృష్ణారావు, ఖాదీ బోర్డు డైరెక్టర్ యడ్లపల్లి సాంబశివరావు, కంచర్ల శివరామయ్య, కంచర్ల సాంబశివరావు, డాక్టర్ శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐపై మందుబాబుల దాడి

కేసు నమోదు.. నిందితుల్లో వాణిజ్యపన్నులశాఖ ఉద్యోగి

గుంటూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న అరండల్‌పేట ఎస్ఐ కే ఏడుకొండలుపై మందుబాబులు దాడి చేశారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. ఎస్ఐ కే ఏడుకొండలు ఈ నెల 12న నైట్ చెకింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ 12.50 గంటల సమయంలో శ్రీనగర్ ఐదో లైను డొంక రోడ్డు ప్రాంతానికి వెళ్లారు. అక్కడ వాణిజ్యపన్నుల శాఖలో అటెండర్‌గా పని చేసే రెడ్డి రాజుతో పాటు మల్లెబోయిన కిరణ్, గండికోట అక్కేశ్వరరావులు బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్నట్లు ఎస్ఐ గుర్తించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుంటుండగా వారు ఎస్ఐపై దాడి చేశారు. ఈ దాడిలో ఎస్ఐ చేతికి గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అరండల్‌పేట పోలీసులు తెలిపారు.

నేడు ఎస్పీ గ్రీవెన్స్ రద్దు

గుంటూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అనివార్య కారణాల వల్ల సోమవారం పోలీస్ కార్యాలయంలో జరగాల్సిన గ్రీవెన్స్‌ను రద్దు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ప్రజలు ఏదైనా సమస్య ఉంటే స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.

బాలికకు డ్రగ్స్‌పై లోతుగా దర్యాప్తు

- ఫోరెన్సిక్ ల్యాబ్‌కు రక్త నమూనాలు
- పోలీసుల అదుపులో నిందితుడు

గుంటూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలికకు డ్రగ్స్ అలవాటు చేసి ఆపై అత్యాచారం చేసినట్లు నమోదైన కేసులో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. బాలిక డ్రగ్స్ తీసుకుందా లేదా అనే కోణంలో విచారణ ప్రారంభించారు. నిందితుడితో పాటు బాలిక రక్త నమూనాలను ఫోరెన్సిక్ సైన్స్ లాబ్‌కు పంపారు. నాలుగైదు రోజుల్లో ఆయా పరీక్షలకు సంబంధించిన నివేదిక రానున్నది. బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటనపై లాలాపేట పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. అమరావతి రోడ్డులోని కొండయ్య కాలనీకి చెందిన కౌశిక్ అనే యువకుడ్ని, అతడి స్నేహితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. తన కుమార్తెను ప్రేమ పేరుతో డ్రగ్స్‌కు బానిసను చేశాడంటూ మనస్థాపంతో ఆత్మహత్యాయత్నం చేసిన బాలిక తల్లి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని జీజీహెచ్ వైద్య వర్గాలు వెల్లడించాయి. కౌశిక్ గతంలో ఏబీవీపీ విభాగంలో పనిచేశాడని సమాచారం. తనకు డ్రగ్స్ అలవాటు లేదని, ఆమెకు డ్రగ్స్ అలవాటు చేయలేదని నిందితుడు కౌసిక్ పోలీసులకు చెప్పినట్లు తెలిసింది.

పోలీసుల అదుపులో.. ద్విచక్ర వాహనాల దొంగలు

- 15 బైకులు స్వాధీనం

ద్విచక్ర వాహనాలు అపహరిస్తున్న దొంగలను లాలాపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సుమారు 15 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

6

ఎల్‌వీఆర్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటేశ్వరరావు, రామకృష్ణ

- నేడు నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

చోర్ గ్యాంగ్ కేసులో చిలకలూరిపేట అర్బన్ ఎస్ఐ రహంతుల్లా సస్పెన్షన్

భార్యను చంపి.. శవాన్ని బైక్‌పై తీసుకెళ్లి..

- పోలీసు స్టేషన్‌లో లొంగిపోయిన భర్త

మెయిన్‌లో

ఆర్వోబీ తొలగింపుపై అధ్యయనం

- సంక్లిష్టంగా శంకర్‌విలాస్ మిగిలిన వంతెన కూల్చివేత
- 35 రోజుల వ్యవధి కోరిన ఓ సంస్థ.. కుదరదన్న రైల్వేశాఖ
- రైళ్ల రాకపోకలకు ఇబ్బంది లేకుండా తొలగింపుపై చర్చలు

గుంటూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): శంకర్ విలాస్ ఆర్‌వోబీ నిర్మాణంలో రైల్వే భాగంలో మిగిలి ఉన్న పాత బ్రిడ్జి కూల్చివేతపై అధ్యయనం జరుగుతోంది. రైల్వే అనుమతి తీసుకోకపోవడం వల్లే పాత బ్రిడ్జిని ఇంకా తొలగించలేదని పలువురు చెబుతున్నారు. అంతేకాకుండా రైల్వే అనుమతి తీసుకోకుండా బ్రిడ్జి నిర్మాణ పనులు ఎలా ప్రారంభించారని ప్రశ్నిస్తున్నారు. అయితే రైల్వే యార్డు పైభాగంలో ఉన్న పాత వంతెనని తొలగించడం ఎంతో సంక్లిష్టంతో కూడుకున్న వ్యవహారం. ఇందుకు కారణం గుంటూరు నుంచి నడికుడి, నంద్యాల మార్గంలో తరచుగా రైళ్ల రాకపోకలు సాగిస్తుండటమే. వాటి కదలికలకు ఎలాంటి ఆటంకం లేకుండా పాత బ్రిడ్జిని తొలగించాలి. అయితే ఈ క్లిష్టమైన పనిని చేసే అనుభవం దేశంలో రెండు, మూడు సంస్థలకు మాత్రమే ఉన్నది. ఇదే సమస్యకు ప్రధానకారణంగా మారింది. శంకర్‌విలాస్ ఆర్‌వోబీ గుంటూరు రైల్వేస్టేషన్ యార్డు మీదగా నిర్మించాలి. ఈ నేపథ్యంలో ఎలా పడితే అలా పాత బ్రిడ్జిని తొలగించే పరిస్థితి లేదు. ఇందుకు కారణం బ్రిడ్జి కింద 25 వేల కేవీఏ విద్యుత్ తీగెలున్నాయి. వీటికి ఏమాత్రం ఆటంకం కలిగినా పవర్ గ్రిడ్‌కు సమస్య తలెత్తి రైళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోతాయి. అలానే బ్రిడ్జి శిథిలాలు నేరుగా యార్డు భాగంలో పడితే అది ఛిద్రమైపోతుంది. మళ్లీ కొత్తగా రైల్వేయార్డు నిర్మాణం చేయాలంటే రూ.కోట్లలో ఖర్చు అవుతుంది. ఎంతో క్లిష్టమైన ఈ పనిని చేపట్టడానికి అనుభవం ఉన్న సంస్థల్లో ఇప్పటికే ఒక ఏజెన్సీ వచ్చి చూసింది. పాత వంతెనని తొలగించడానికి 35 రోజులు వ్యవధి కావాలని కోరింది. అంత సమయాన్ని ఇవ్వలేమని రైల్వే శాఖ చెప్పి వేరే ఏజెన్సీని పిలిపించి అధ్యయనం చేయిస్తోన్నది. ఈ సంస్థ వారం వ్యవధిలో నివేదిక సమర్పించనున్నది. ఆ నివేదిక ఆధారంగా పాత వంతెన తొలగించే విషయంలో రైల్వే శాఖ నిర్ణయం తీసుకోనుంది.

జాప్యం లేకుండా...

రైల్వే భాగంలో ఉన్న పాత బ్రిడ్జి నూతన ఆర్‌వోబీ పనులకు ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం జీజీహెచ్ వైపున పిల్లర్ల నిర్మాణం జరుగుతున్నది. వీటిని మరో మూడు, నాలుగు రోజుల వ్యవధిలో పూర్తి చేసి అరండల్‌పేట వైపున పిల్లర్ల నిర్మాణాన్ని చేపడతారు. ఈ పిల్లర్ల నిర్మాణం పూర్తి అయ్యేనాటికి రైల్వేభాగం లోని వంతెనని తొలగిస్తామని ఏజెన్సీ చెబుతున్నది.



రైల్వే యార్డుపై ఉన్న శంకర్‌విలాస్ ఆర్‌వోబీ పాత వంతెన

చలపతిలో హిల్ వ్యూ స్టేడియం ప్రారంభం



హిల్ వ్యూ స్టేడియంను ప్రారంభిస్తున్న మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

తాడికొండ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో చలపతి హిల్ వ్యూ స్టేడియంను కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలపతి విద్యా సంస్థలు క్రీడలను, క్రీడాకారులను ఎంతో ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు ఇవ్వడంతో పాటు ఉద్యోగాలు ఇస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు, సెక్రటరి వైసుజిత్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ నాగ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెమ్మసాని పేరెత్తే అర్హత అవినీతి అంబటికి లేదు

● టీడీపీ నేతలు కనపర్తి, మన్నవ

గుంటూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా అభివృద్ధిపై వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు శవరాజకీయాలు చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శులు కనపర్తి శ్రీనివాసరావు, మద్దిరాల మ్యాని, కార్పొరేటర్లు యల్లావుల అశోక్, కొమ్మినేని కోటేశ్వరరావు, స్నిత పద్మజ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వందనాదేవి తదితర నేతలు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. శంకర్ విలాస్ సెంటర్ వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మాణం గురించి కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌పై అంబటి చేసిన వ్యాఖ్యలను టీడీపీ నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ మరుగుదొడ్ల కుంభకోణం చేసిన ప్రమాదవశాత్తు మరణించిన బీసీ వర్గానికి చెందిన సిరువేద కార్మికుడికి ప్రభుత్వం ఇచ్చిన రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాలో రెండున్నర లక్షల రూపాయలు లంచం అడిగిన అతి దారుణమైన నీచుడు అంబటి రాంబాబు అని మండిపడ్డారు. ఆయన మంత్రిగా వెలగబెట్టిన హయాంలో గుంటూరు నగరాన్ని గంజాయి కేంద్రంగా మార్చాడని, మాజీ ఎమ్మెల్యే ముస్తఫా, మద్దాలి గిరిధర్ వద్ద వాటాలు తీసుకొని నగరంలో యువతని నాశనం చేసేవాడని ఆరోపించారు. పెమ్మసాని మంత్రి కాగానే నగర ప్రజల చిరకాల వాంఛ ఓవర్ బ్రిడ్జికు మంజూరు చేయించి పనులు కూడా ప్రారంభించారని తెలిపారు. శంకర్ విలాస్ సెంటర్ వద్ద పడగొట్టిన పాత బ్రిడ్జి 490 మీటర్ల పొడవు, పదకొండున్న మీటర్ల వెడల్పుతో రెండు లైన్లు మాత్రమే ఉండగా, నూతనంగా నిర్మించే వంతెన 990 మీటర్ల పొడవు, 21.5 మీటర్ల వెడల్పుతో నాలుగు లైన్లతో అత్యాధునికంగా నిర్మిస్తున్నారన్నారు. అరండల్ పేట 9వ లైన్ వద్ద డబుల్ వెహికల్ అండర్ పాస్‌తో పాటు జేకేసీ వద్ద మరో అండర్ పాస్ కూడా నిర్మిస్తున్నారని అన్నారు. గత ఎన్నికల్లో పెమ్మసానిపై పోటీ చేయటానికి దీటైన వరకు వైసీపీకి అభ్యర్థి దొరక్క నానా తంటాలు పడ్డారని, వచ్చే ఎన్నికల్లో అభ్యర్థిని కూడా పోటీ పెట్టే పరిస్థితి ఉండదని అన్నారు. తెలుగుదేశం పార్టీ నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మలి వయస్సులో.. మది చెదిరే ఉత్సాహంతో

● ముగిసిన వెటరన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు

● నెల్లూరు జిల్లాకు ఓవరాల్ చాంపియన్ షిప్



ఓవరాల్ ఛాంపియన్‌షిప్ షీల్డు అందజేస్తున్న నిర్వాహకులు

పెదనందిపాడు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): వెటరన్ క్రీడాకారులు పోటీలలో పాల్గొన్న తీరు యువతకు ఆదర్శంగా నిలిచింది. మండల పరిధిలోని పాలపర్రు ఎస్ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వపు విద్యార్థుల సహకారంతో జరుగుతున్న 45వ ఏపీ స్టేట్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ - 2025 పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీలకు సంబంధించిన వివరాలను ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్స్ జనరల్ సెక్రటరీ మంగా వరప్రసాద్ వివరించారు. రెండు రోజు 5కే వాక్, 5000, 1000, 400, 200, 4-100 మీటర్ల రిలే డిస్కస్‌త్రో, హెమర్‌త్రో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 26 జిల్లాలకు చెందిన సుమారు 450మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఓవరాల్ చాంపియన్ షిప్‌ను 481 పాయింట్లతో నెల్లూరు జిల్లా సాధించింది, 431 పాయింట్లతో విశాఖ జిల్లా రన్నర్‌గా నిలిచింది. 5కే రన్నింగ్ పురుషుల 65 ప్లస్ విభాగంలో వి.సుదాకర్(కృష్ణా), 70 ప్లస్ విభాగంలో ఎం.శంకరరావు(విశాఖపట్నం) విజేతలుగా నిలిచారు. మహిళల విభాగంలో 5కే రన్నింగ్ 60 ప్లస్‌లో పి.కోటేశ్వరమ్మ(కృష్ణా), కె.శారద ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. 1 కే వాక్ 90 ప్లస్ విభాగంలో గుంటూరుకు చెందిన కె.శేషగిరిరావు, 3కే వాక్ 70 ప్లస్‌లో బి.వెంకటలక్ష్మి ప్రథమ స్థానంలో నిలిచారు. విజేతలకు ముఖ్య అతిథులు ఆల్ ఇండియా పోస్టల్ అండ్ ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ నిమ్మగడ్డ నాగేశ్వరరావు, శ్రీ హాస్పిటల్ అధినేత డెంటిస్ట్ పవన్ కుమార్ మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కొమ్మినేని శ్రీనివాసరావు, ఇస్మాయిల్, గురునాథ్, ప్రవీణ్, ముద్దన సత్యనారాయణ వ్యవహరించారు. వాఖ్యాతగా అమ్మయ్య ఉన్నారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, ఏఎన్‌యూ బీపీఈడీ సభ్యులు క్రీడాకారులకు సేవలందించారు. అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ గణేశన్ రాంబాబు, జాయింట్ సెక్రటరీ చెన్నుపాటి శివనాగేశ్వరరావు, పారిశ్రామికవేత్త పంగులూరి రామకృష్ణ, జంపని రామారావు, హెచ్ఎం ముద్దన శ్రీనివాస రావు, గోపీనాథ్, పూర్వపు విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఎల్‌వీఆర్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటేశ్వరరావు, రామకృష్ణ

● నేడు నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



వెంకటేశ్వరరావు, రామకృష్ణ

గుంటూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎల్‌వీఆర్ అండ్ సన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా నూకవరపు వెంకటేశ్వరరావు, యర్రమనేని రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం సోమవారం ప్రమాణ స్వీకారం చేయనుంది. ఈ నెల 7న క్లబ్ పాలకవర్గంలో 18 పదవులకు గాను 16 పదవులకు ఎన్నికలు ఏకగ్రీవంగా య్యాయి. రెండు పదవులకు మాత్రం ఎనిమిది మంది అభ్యర్థులు బరిలో నిలవడంతో ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఆదివారం క్లబ్‌లో వైద్యశాల, క్యారమ్స్ విభాగాలకు ఎన్నికలు నిర్వహించారు. వైద్యశాలకు డాక్టర్ పెద్ది వెంకటరావు, కూనిశెట్టి వెంకటరమణ ప్రసాద్ మధ్య పోటీ జరిగింది. కూనిశెట్టి వెంకట రమణ ప్రసాద్ విజయం సాధించారు. మొత్తం 755 ఓట్లు పోల్ కాగ ప్రసాద్‌కు 607, వెంకటరావుకు కేవలం 111 ఓట్లు మాత్రమే వచ్చాయి. అదేవిధంగా క్యారమ్స్, చెస్ విభాగానికి జువ్వా ధర్మారావు, తోటబోయిన సాంబయ్య, తాడిబోయిన సంపత్ కుమార్, కాకుమాను పున్నారావు బరిలో నిలవగా పోటీ మాత్రం సాంబయ్య, సంపత్‌కుమార్ మధ్యే జరిగింది. మొత్తం 755 ఓట్లు పోల్ కాగ అందులో సాంబయ్యకు 451, సంపత్‌కుమార్‌కు 262 ఓట్లు వచ్చాయి. పున్నారావుకు 18, ధర్మారావుకు 17 ఓట్లు వచ్చాయి. సాంబయ్య విజయం సాధించారు. ఎన్నికల అధికారిగా నార్నె బాబూజీరావు వ్యవహరించారు.

నూతన కమిటీ వివరాలు...

క్లబ్ అధ్యక్షుడిగా నూకవరపు వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా పఠంగి జనార్ధన్‌రావు, కార్యదర్శిగా యర్రమనేని రామకృష్ణ, కోశాధికారిగా వక్కలగడ్డ రామకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా కొండగుంట బుచ్చిబాబు, టెన్నిస్ - కొమ్మినేని నాగేశ్వర రావు, బిలియర్డ్స్ - వల్లెపాటి బాలాజీ ప్రసాద్, ఐపీటెక్ - నెల్లూరి శ్రీనివాసరావు, ఇండోర్ గేమ్స్ - వట్టిగుంట నాగిరెడ్డి, రీడింగ్ రూమ్, లైబ్రరీ - పాలడుగు సుబ్బారావు, కళలు, సాంస్కృతిక, వైజ్ఞానిక కార్యక్రమాలు - డాక్టర్ చిట్టినేని శివ కోటేశ్వరరావు, బార్ - కృష్ణమనేని లలిత బాబు, విశ్రాంతి గదులు - తిరువీధి వెంకటరమణయ్య, స్పోర్ట్స్ హౌస్ కీపింగ్ - వజ్రాల సాంబిరెడ్డి, జిమ్, సూపర్ బజార్ - కొలిపాకుల చంద్రశేఖర్, సాంఘిక సంక్షేమ, క్రీడా కార్యక్రమాలు - కుర్రా ఏసుబాబు, క్యారమ్స్, చెస్ - సాంబయ్య, వైద్యశాల - కూనిశెట్టి వెంకట రమణ ప్రసాద్ సభ్యులుగా ఎన్నికయ్యారు. సోమవారం ఉదయం క్లబ్‌లో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగనుంది.

95 శాతం ఆపరేషన్లు గుండెకు సంబంధం లేనివే

● డాక్టర్ పోతినేని రమేష్‌బాబు



మాట్లాడుతున్న డాక్టర్ రమేష్

తాడేపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏడాది భారతదేశంలో మూడు నుంచి నాలుగు కోట్ల శస్త్రచికిత్సలు జరుగుతుండగా, వాటిలో 95 శాతం ఆపరేషన్లు గుండెకు సంబంధం లేనివే ఉంటున్నాయని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఎండీ, చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో ఆదివారం నాన్ కార్డియాక్ సర్జరీలలో గుండె ప్రమాదాలపై హార్ట్ ఇన్ ది ఓఆర్ సీఎంఈ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పోతినేని రమేష్‌బాబు మాట్లాడుతూ.. భారతదేశంలో ప్రతి సంవత్సరం 15 లక్షల మంది రోగులకు ఇతర శస్త్రచికిత్స సమయంలో గుండె సమస్యలు వస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో శస్త్ర చికిత్సల సమయంలో గుండె ప్రమాదాలను ముందుగానే గుర్తించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలు, ఆధునిక వైద్య విధానాలపై హై ఇంపాక్ట్ కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. శస్త్ర చికిత్సల సమయంలో సంభవించే గుండెపోట్లలో ఎక్కువ శాతం నాన్ అబ్‌స్ట్రక్టివ్ వల్నరబుల్ ప్లాక్స్ వల్లనే జరుగుతాయని చెప్పారు. ఇవి రక్తనాళాలలో పెద్దగా అడ్డంకి కలిగించకపోయినా, ఒత్తిడి, ఇన్‌ఫ్లమేషన్, రక్తపోటు మార్పులు, గుండె వేగం పెరగడం వంటి పరిస్థితుల్లో సులభంగా చిట్లిపోతాయన్నారు. అయితే ఆధునిక కార్డియాక్ రిస్క్ అసెస్‌మెంట్ టెక్నాలజీ ఈ ప్రమాదాన్ని ముందుగానే గుర్తించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. ఏఐ ఆధారిత ఈసీజీ ఎకో వేర్‌బుల్ డివైజెస్ కనిపించని గుండె సమస్యలను కూడా ముందుగానే గుర్తిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వాన్స్‌డ్ హీమో డైనమిక్స్ పెరి ఆపరేటివ్ ఏఐ పరికరాల వినియోగం, టెలి ఐసీయూ విధానం, తదితర అంశాలపై చర్చలు జరిగాయి. తొలుత కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి డాక్టర్ రమేష్‌బాబు, వైద్యనిపుణులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన వైద్య నిపుణులు, ఏపీ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి వీరపాండ్యన్ తదితరులు హాజరయ్యారు.

కోటప్పకొండ పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక కృషి

● ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



ఆవిష్కరణలో చీఫ్‌విప్ జీవీ, ఎమ్మెల్సీ ఆలపాటి, ఎమ్మెల్యే ఆనందబాబు

నరసరావుపేట రూరల్, డిసెంబరు 14 (ఆంధ్ర జ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. నరసరావుపేట మండలంలోని కోటప్పకొండ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ త్రికోటేశ్వర ఫామ్ ల్యాండ్ వెంచర్‌ను ఆయన అట్టహాసంగా ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జీవీతో పాటు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పంచుమర్తి నాగ సుశీల కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్ మాట్లాడుతూ చుట్టూ పచ్చదనంతో ఎత్తయిన కొండల మధ్య కోటప్పకొండ శివయ్య సన్నిధిలో మంచి ఫార్మ్ ల్యాండ్ వెంచర్‌ను అన్ని సౌకర్యాలతో ప్రారంభించడం గొప్ప విషయమన్నారు. కోటప్పకొండ గతం కంటే ఇప్పుడు మరింత అభివృద్ధి చెందిందన్నారు. మాజీ సభాపతి స్వర్గీయ డాక్టర్ కోడెల శివప్రసాద్ హయాంలో అభివృద్ధి పనులు బాగా జరిగాయన్నారు. ముఖ్యంగా త్రికోటేశ్వర ఫామ్ ల్యాండ్ వెంచర్‌లో గెస్ట్ హౌస్, స్విమ్మింగ్ పూల్, చిల్డ్రన్స్ పార్క్ లాంటి సౌకర్యాలు కల్పించడం వల్ల కస్టమర్లకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ.. ఇక్కడి పర్యావరణం చూస్తే ఇక్కడే ఒక మంచి ఫామ్ హౌస్ కట్టుకొని ఉండాలని ఉందన్నారు. ఆక్స్ ఫర్డ్ విద్యా సంస్థల అధినేత రాజారెడ్డి, స్థానిక టీడీపీ నాయకులు జాగర్లమూడి హనుమంతరావు, ప్రాజెక్టు సిబ్బంది మార్కెటింగ్ ఏజెంట్లు ఉన్నారు.

గిరిజనుల అభివృద్ధే కూటమి లక్ష్యం

టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారూ నాయక్

గుంటూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారూ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో జగన్‌రెడ్డి విదేశీ విద్య పథకాన్ని రద్దు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని తిరిగి కొనసాగిస్తూ పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలకు అమలు చేస్తుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మాదకద్రవ్యాలతో గిరిజన యువత జీవితాలు నిర్వీర్యం అయితే కూటమి ప్రభుత్వం పర్యాటక అభివృద్ధి, కాఫీ తోటల ప్రోత్సహించడం ద్వారా గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి భరోసా కల్పించిందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో గిరిజనుల 16 సంక్షేమ పథకాలు రద్దు చేసి, కేంద్రం నిధులనూ దారి మళ్లించి జగన్‌రెడ్డి గిరిజన ద్రోహిగా మిగిలారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన గిరిజన ప్రాంతాల్లో కూటమి ప్రభుత్వం అభివృద్ధి బాటలు వేసిందన్నారు.

లక్ష్యాలు ఘనం.. ఆచరణ అధమం

(5వ పేజీ తరువాయి)

రూ.మూడు లక్షల వరకు రుణం పొందే అవకాశం ఉంది. వడ్రంగి, కమ్మరి, కుమ్మరి, శిల్పి, స్వర్ణకారుడు, ధోబీ, పూలమాలలు అల్లేవారు, చేపలు పట్టేవారు ఇలా 18 రకాల వృత్తుల వారికి విశ్వకర్మ పథకం వర్తిస్తుంది. చేతి వృత్తుల వారు విశ్మకర్మ పథకం కోసంమూడు జిల్లాల్లో 2,00,986 మంది దరఖాస్తులు అందజేశారు. అయితే మొక్కుబడిగా 2,589 మందికి మాత్రమే.. రుణాలు మంజూరు చేయడం గమనార్హం.

కొరవడిన చిత్తశుద్ధి

పథకం అమలు తీరును పరిశీలిస్తే విశ్వకర్మ అమలుపై అధికారులు, ప్రజా ప్రతినిధులకు చిత్తశుద్ధి కొరవడిందని అర్థమవుతుంది. దరఖాస్తుదారులకు.. లబ్ధిదారుల ఎంపికకు అసలు పొంతన లేదు. చేతి వృత్తులు, కళలను కాపాడేందుకు ప్రవేశ పెట్టిన విశ్వకర్మ లక్ష్యాలు నీరుగారి పోకుండా ప్రజా ప్రతినిధులు ఇప్పటికైనా కృషి చేయాలి.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

పెమ్మసానిపై వైసీపీ దిగజారుడు రాజకీయం

● ఏపీ వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావు



మాట్లాడుతున్న మల్లె ఈశ్వరరావు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌పై వైసీపీ దిగుజారుడు రాజకీయం చేస్తోందని ఏపీ వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావు మండిపడ్డారు. గుంటూరు హౌసింగ్ బోర్డు కాలనీలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలో ఎంపీ అనేక అభివృద్ధి పనులు చేపట్టారని గుర్తుచేసుకున్నారు. శంకర్‌విలాస్, నందివెలుగు, మిర్చియార్డుల వద్ద ఫ్లైవర్ల నిర్మాణం వెనుక పెమ్మసాని కృషి ఎంతోగానో ఉందన్నారు. అభివృద్ధి ఓర్వలేక అంబటి వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు.

విభిన్న ప్రతిభావంతులే సమాజానికి స్ఫూర్తి

● సక్షం ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులు సమాజానికి నిజమైన స్ఫూర్తి అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కొనియాడారు. గుంటూరు రెవెన్యూ కల్యాణ మండపంలో సక్షం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన విభిన్న ప్రతిభావంతుల ఆత్మీయ సమ్మేళనానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సమస్యలు ఎదురైనప్పుడు వెనక్కి తగ్గకుండా, అవకాశాలను వెతుక్కుంటూ సమాజంలో వారికంటూ ప్రత్యేక ముద్ర వేసుకుంటూ ముందుకు సాగుతున్న విభిన్న ప్రతిభావంతులే నేటి సమాజానికి నిజమైన ఆదర్శప్రాయులని కొనియాడారు. సదరం సర్టిఫికెట్ల విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ, రానున్న రోజుల్లో ప్రభుత్వం తరపున మరింత సౌకర్యవంతమైన, ఉపయోగకరమైన విధానాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తామని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహక బృందానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గుంటూరు పశ్చిమ కార్యాలయంలో ఆమె 20వ డివిజన్ కమిటీ సభ్యులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీని బలోపేతం చేయడమే ప్రతి ఒక్కరి ప్రధాన బాధ్యతగా ఉండాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



విభిన్న ప్రతిభావంతులకు పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ అయిన గుంటూరుజిల్లా, పెద నందిపాడు(మం), రావిపాడు గ్రామ కాపురస్తులు లేటు మొవ్వా అప్పయ్య గారి కుమారుడు శివరామారావు మేనేజింగ్ పార్ట్‌నర్ ఆఫ్ శివ కాటన్ జిన్నింగ్ మిల్లు వారి సూచనలమేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా, దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి శివ కాటన్ జిన్నింగ్ మిల్ ప్రత్తిపాడు నందు పార్ట్‌నర్స్ అయినటువంటి 1) మొవ్వా అప్పయ్య గారి కుమారుడు మొవ్వా శివ రామారావు, 2)మొవ్వా తిరుపతయ్య గారి కుమారుడు లేటు అప్పయ్య, 3)పొన్నం ఆదియ్య గారి కుమారుడు సుబ్రహ్మణ్యం, 4)లేటు మొవ్వా తిరుపతయ్య గారి కుమారుడు లేటు మొవ్వా రామారావు గార్లకు సంబందించిన ఆస్తి శివ కాటన్ జిన్నింగ్‌మిల్లు ఆస్తులను తరిగోపుల రంగారావు గారి ద్వారా కొనుగోలు చేయబడిన ఆస్తులకు సంబంధించి 1995వ సం॥లో పరస్పర ఒక అంగీకార పత్రము వ్రాసుకోబడినది. దానికి విరుద్ధంగా లేటు మొవ్వా రామారావు గారి కుమారుడు మొవ్వా శ్రీనివాసరావు గారు ఒరిజినల్ డాక్యుమెంట్లు పోయినవని పేపరులో ప్రకన ఇచ్చి సంబందిత పోలీసు వారి నుండి సర్టిఫికేట్ పొంది ఆ సర్టిఫికేట్ ఆధారంగా తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి అక్రమంగా లబ్ధిపొందాలనే దురుద్దేశ్యముతో ది.06-10-2025న దఖలు దస్తావేజు నెం.14070/2025 యస్.ఆర్.ఓ. గుంటూరు ద్వారా తన పిల్లలైన కుమార్తె మొవ్వా @ మానం శ్రీలేఖ మరియు కుమారుడు మొవ్వా శ్రీహర్ష గార్లకు దఖలుచేసినారని తెలియవచ్చినది. కావున ఎవరైనా అట్టి తప్పుడు డాక్యుమెంట్ ఆధారంగా ఏమైనా లావాదేవీలు జరిపిన యెడల అవి నా క్లయింటును బైండుచేయజాలవు. అట్టి వ్యవహారములపై నా క్లయింటు చట్టపరమైన సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకొనెదరని ఈ ప్రకటన ద్వారా యావన్మందికీ తెలియ జేయడమైనది.

షెడ్యూలు:గుంటూరు డి॥, ప్రత్తిపాడు సబ్.డి॥ & గ్రామం, డి.నెం.163లో య.8-03 శెంట్లు మింజుమలె య.1-50శెంట్లు రీ సర్వే దాఖలా యల్.పి.యం.నెం.1461లో య.1-49శెంట్ల భూమికి **హద్దులు. తూర్పు:** శివ కాటన్ జిన్నింగ్ మిల్లు హద్దు, **దక్షిణం:** రోడ్డు హద్దు, **పడమర:** సర్కారు డొంక హద్దు, **ఉత్తరం:** కాకాని ముత్యాలు వగైరాల భూమి హద్దు.

వనుకూరి వెంకట సుబ్బారెడ్డి, అడ్వకేట్
విద్యానగర్, 1వ లైను, గుంటూరు. సెల్ : 9177646766

ధైర్యంగా పోరాడటమే ధూళిపాళ్ల ప్రత్యేకత

● మేయర్ కోవెలమూడి రవీంద్ర ● ఘనంగా ధూళిపాళ్ల జన్మదినోత్సవం



ధూళిపాళ్ల జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎంతటి సమస్య ఎదురైనా ధైర్యంగా పోరాడగలిగే సమర్థుడు పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అని గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర (నాని) కొనియాడారు. మేయర్ ఆధ్వర్యంలో ధూళిపాళ్ల జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వ హించారు. నిర్మల్ హృదయ్‌లో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం జిల్లా టీడీపీ కార్యాలయంలో జరిగిన వేడుకలలో పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కసుకుర్తి హనుమంతరావు, సుఖవాసి శ్రీనివాసరావు, కంచర్ల శివరామయ్య, ఈరంటి వరప్రసాద్ బాబు పాల్గొన్నారు.

గుంటూరులోని పొన్నూరు కార్యాలయంలో..

గుంటూరులోని పొన్నూరు నియోజకవర్గ కార్యాలయంలో ధూళిపాళ్ళ మిత్రమండలి ఎమ్మెల్యే ధూళిపాళ్ళ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించింది. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దాసరి రాజా మాస్టారు, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హాజీ హాసన్ బాష, జీడీసీఎంఎస్ సొసైటీ మార్కెటింగ్ చైర్మన్ వడ్రాణం హరిబాబు, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి సుఖవాసి శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బొల్లెద్దు సుశీలరావు, రాష్ట్ర తెలుగు రైతు ప్రచార కార్యదర్శి గింజుపల్లి వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు, ముత్తినేని రాజేష్, కల్లూరి శ్రీనివాసరావు, కూచిపూడి రవి శేఖర్, మారం కిషోర్, వలివేటి మురళీకృష్ణ, పెద్ది విక్రమ్, మేదరమెట్ల కృష్ణ సోమిరెడ్డి శ్రీనివాసరావు, పులివర్తి వెంకటేశ్వరరావు (అజార్), తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా ఉర్దూ అకాడమీ వ్యవస్థాపక వేడుకలు

గుంటూరు (విద్య) డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉర్దూ అకాడమీ ఏర్పాటు చేసి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎండీ ఖాసీం తెలిపారు. ఈ మేరకు ఆదివారం గుంటూరు చౌత్ర సెంటర్లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉర్దూ అకాడమీ సిబ్బందితో కలిసి ఆయన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, ఉర్దూ పాఠశాలలో సురూర్ ఏ ఉర్దూ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈ నెల 16వ తేదీ నుంచి 18 వరకు పలు పోటీలు, రాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 20న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఉర్దూ అకాడమీ చైర్మన్ షేక్ మొహమ్మద్ ఫరూక్ సుబ్లి ఆధ్వర్యంలో బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లాలోని ఉర్దూ ప్రధానోపాధ్యాయులు, ఉర్దూ ఉపాధ్యాయులు వారి పరిధిలో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ సిబ్బంది, ఉపాధ్యాయులు షేక్ అక్బర్, షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్ అయిదేళ్ళ ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే కెమిస్ట్రీ నుంచి మాత్రమే సులువైన ప్రశ్నలు వస్తున్నాయి. సగటు విద్యార్థి కూడా కెమిస్ట్రీలో సాధించిన మార్కులతో మంచి పర్సంటైల్‌ను పొందుతున్నాడని చెప్పవచ్చు.

గత ఏడాది ఏప్రిల్ సెషన్‌లో దాదాపుగా అన్ని షిఫ్టుల్లో ఫిజికల్ కెమిస్ట్రీ నుంచి న్యూమరికల్స్ రావడంతో ప్రశ్నపత్రం కష్టంగా అనిపించింది. అలాగే ఎలక్ట్రో కెమిస్ట్రీ, ఈక్విలిబ్రియమ్ చాప్టర్ల నుంచి వచ్చిన ప్రశ్నలు ఎక్కువ సమయం తీసుకున్నాయి. అయితే ఈ ఏడాది జనవరి సెషన్‌లో మాత్రం ఇనార్గానిక్ కెమిస్ట్రీ నుంచి ఎక్కువగా అంటే ప్రతి షిఫ్ట్‌లో దాదాపుగా 8-10 ప్రశ్నలు కనిపించాయి. ఇక్కడ విద్యార్థులు గమనించాల్సిన విషయం ఒకటి ఉంది. మిగతావాటితో పోలిస్తే ఇనార్గానిక్ కెమిస్ట్రీ సిలబస్ తక్కువ. ఇందులోని చాలా పాఠాలను డిలీట్ చేశారు. ఫలితంగా కెమిస్ట్రీలో బాగా స్కోర్ చేయగలిగారు. అప్పటికీ మెకానిజమ్ ఆధారిత ప్రశ్నలు విద్యార్థులను కొద్దిగా ఇబ్బంది పెట్టాయి.

అప్రమత్తంగా వ్యవహరిస్తే అధిక స్కోర్



జేఈఈ మెయిన్ కెమిస్ట్రీ ప్రిపరేషన్

మంచి స్కోర్‌కు చిట్కాలు

- పరీక్షలో 50 నుంచి 60 శాతం ప్రశ్నలను ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల నుంచే అడుగుతున్నారు. అందువల్ల ఆ పుస్తకాల్లోని ప్రతి లైన్ చదవాలి. ప్రత్యేకించి ఇనార్గానిక్ కెమిస్ట్రీని పరీక్షకు కొన్ని రోజుల ముందు నుంచి బాగా రివైజ్ చేయాలి.
- ఎక్కువ వెయిటేజ్ ఉన్న కోఆర్డినేషన్ కాంపౌండ్స్, పీరియాడిక్ క్లాసిఫికేషన్ అండ్ ప్రోపర్టీస్, క్వాడ్రేటివ్ ఇనార్గానిక్ అనలిటిక్స్, కెమికల్ బాండింగ్ చాప్టర్లపై అధికంగా దృష్టి సారించాలి.
- ఇనార్గానిక్ కెమిస్ట్రీ నుంచి ఎక్కువ ప్రశ్నలు స్టేట్‌మెంట్ ఆధారంగా ఉండే అవకాశాలు అధికం. అందువల్ల ఆ తరహా ప్రశ్నలను ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి.
- ఫిజికల్ కెమిస్ట్రీలో సాధారణంగా న్యూమరికల్ ప్రశ్నలు ఎక్కువగా అడుగుతారు. అయితే ఫిజిక్స్, కెమిస్ట్రీలో కామన్‌గా ఉండే థెర్మోడైనమిక్స్, ఆటమిక్ స్ట్రక్చర్(మోడ్రన్ ఫిజిక్స్)పై ఎక్కువ దృష్టి పెట్టడం ద్వారా రెండు సబ్జెక్టుల్లో ఎక్కువ స్కోర్ సాధించవచ్చు. కఠినంగా అనిపించే స్టాయికెమిస్ట్రీ, అయానిక్ ఈక్విలిబ్రియమ్ లాంటి చాప్టర్లలో కాన్సెప్టులను బాగా రివైజ్ చేయాలి. ఫిజికల్ కెమిస్ట్రీలో ఫార్ములా షీట్లను రెడీ చేసుకుని రివైజ్ చేసుకోవాలి. మోడరేట్‌గా అంటే సొల్యూషన్స్, కైనెటిక్స్ లాంటి చాప్టర్లపై కూడా దృష్టిపెట్టి మంచి స్కోర్ సాధించవచ్చు.
- ముందే అనుకున్నట్టు ఫిజికల్ కెమిస్ట్రీలో న్యూమరికల్స్ ఎక్కువగా ఉన్నందున టైమ్ మేనేజ్‌మెంట్ ముఖ్యం. కాలిక్యులేషన్స్‌తో ఎక్కువ సమయం వృథా కాకుండా చూసుకోవాలి.
- ఆర్గానిక్ కెమిస్ట్రీలో నేమ్డ్ రియాక్షన్స్, రీఏజెంట్స్‌పై దృష్టి పెట్టడం ద్వారా కూడా మంచి స్కోర్‌ని సాధించవచ్చు. ఈ విభాగంలో ఎక్కువగా కాన్సెప్ట్, రియాక్షన్ ఆధారిత ప్రశ్నలు, మేట్రిక్స్ మేచింగ్‌కు సంబంధించిన ప్రశ్నలు అడుగుతారు.

జనరల్‌గా

- 2020 నుంచి ఈ అయిదేళ్ళ ప్రశ్నపత్రాల్లో అడిగిన వాటిని తప్పనిసరిగా రివైజ్ చేయాలి.
- ప్రతి వారం ఒక పార్ట్ టెస్ట్, ఒక ఫుల్ సిలబస్‌పై టెస్ట్ రాయాలి.
- మాక్ రాసిన తరవాత జరిగిన తప్పులకు సంబంధించి లోతైన విశ్లేషణ చేసుకోవాలి. కాన్సెప్ట్, సిల్లీ, కాలిక్యులేషన్ అని తప్పులను మూడు రకాలుగా విభజించుకోవాలి. ఎక్కడ, ఎలా తప్పులు దొర్లుతున్నాయో తెలుసుకుని, వాటి నుంచి బైటపడే ప్రయత్నాన్ని గట్టిగా చేయాలి.
- జవాబులుగా ఇచ్చిన ఆప్షన్స్‌ను ఒకటికి రెండు సార్లు చూసుకోవాలి. తప్పుగా అనిపించే వాటిని ఎలిమినేట్ చేయడం ద్వారా కూడా కరెక్ట్ అన్సర్‌ను పొందవచ్చు. అవగాహన లేకుండా ఏదో ఒకటి గుర్తించి మాత్రం మైనస్ మార్కులు పొందకూడదు.
- చివరిగా, కెమిస్ట్రీ సులువైన సబ్జెక్టు. స్కోరింగ్ సబ్జెక్ట్. ఇందులో మంచి మార్కులను పొందే యత్నం గట్టిగా చేయాలి.

- డాక్టర్ పవన్ కుమార్ కాసు, ఎక్సలెన్సియా, హైదరాబాద్.

స్వాగతిస్తున్న సైన్యం

ఎన్‌డీఏ అండ్ ఎన్‌ఏ, సీడీఎస్ నోటిఫికేషన్స్



సాహసికులకు సైన్యం స్వాగతం పలుకుతోంది. ఈ క్రమంలో త్రివిధ దళాల్లోని అధికారిక హోదాలోని ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ఉద్దేశించిన ఎన్‌డీఏ అండ్ ఎన్‌ఏ అలాగే సీడీఎస్ నోటిఫికేషన్లను యూపీఎస్సీ విడుదల చేసింది.

ఎన్‌డీఏ అండ్ ఎన్‌ఏ

ఈ పరీక్షతో 394 ఖాళీలను యూపీఎస్సీ నింపనుంది. ఎంపికైన వారికి నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్‌డీఏ) 157వ కోర్సు, ఇండియన్ నేవల్ అకాడమీ 119వ కోర్సులోకి ప్రవేశం కల్పిస్తారు.

ఖాళీల వివరాలు: మొత్తం ఖాళీలు 394(పురుషులు 370, మహిళలు 24)

- ఆర్మీ 208(పురుషులు 198, మహిళలు 10)
- నేవీ 42(పురుషులు 37, మహిళలు 5)

ఎయిర్‌ఫోర్స్‌లో...

- ఫ్లయింగ్ 92(పురుషులు 90, మహిళలు 2)
- గ్రౌండ్ డ్యూటీస్(టెక్) 18(పురుషులు 16, మహిళలు 2)
- గ్రౌండ్ డ్యూటీస్(నాన్ టెక్) 10(పురుషులు 8, మహిళలు 2)
- నేవల్ అకాడమీ(10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్) 24(పురుషులు 21, మహిళలు 3)

అర్హత: పోస్టులను అనుసరించి మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులతో ఇంటర్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. నిర్దేశిత ఎత్తుకు తోడు వయో పరిమితి నిబంధనలను కూడా పాటించాలి.

ఎంపిక: రాత పరీక్ష, ఎస్ఎస్‌బి టెస్ట్/ ఇంటర్వ్యూ ఆధారంగా రాత పరీక్షలో చెరి రెండున్నర గంటల కాలవ్యవధితో రెండు పేపర్లు.... మ్యాథమెటిక్స్ 300 మార్కులకు, జనరల్ ఎబిలిటీ టెస్ట్ 600 మార్కులకు ఉంటాయి. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటాయి. దీనిలో ఎంపికైన అభ్యర్థులకు 900 మార్కులకు ఎస్ఎస్‌బీ/ఇంటర్వ్యూ ఉంటుంది.

సీడీఎస్

కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్(సీడీఎస్) ఎగ్జామినేషన్ 2026కి సంబంధించిన మొదటి నోటిఫికేషన్ ఇది. దీని ద్వారా వివిధ సైనిక అకాడమీల్లో 451 ఖాళీలను యూపీఎస్సీ భర్తీ చేయనుంది.

ఖాళీల వివరాలు: ఇండియన్ మిలటరీ అకాడమీ, డెహ్రాడూన్ 100, ఇండియన్ నేవల్ అకాడమీ, ఎజిమెలా 26, ఎయిర్ ఫోర్స్ అకాడమీ, హైదరాబాద్ 32, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ(మెన్), చెన్నై 275, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ, చెన్నై(ఉమన్) 18

అర్హత: ఆకాడమీ/ ట్రైనింగ్ సెంటర్‌ను అనుసరించి డిగ్రీ/ ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. నిర్దేశిత వయస్సు తదితర అర్హతలు కూడా ఉండాలి.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ, ఎస్ఎస్‌బీ, వైద్య పరీక్షల ఆధారంగా

రాతపరీక్ష: ఒక్కోటి రెండు గంటలు కాలవ్యవధి, 100 మార్కులకు మొత్తం మూడు పేపర్లు ఇంగ్లీష్, జనరల్ నాలెడ్జ్, ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్ ఉంటాయి. ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో చేరేందుకు మొదటి రెండు పేపర్లు మాత్రమే ఉంటాయి. ఇంటర్వ్యూకు కేటాయించిన మార్కులు సైతం మొదటి మూడు అకాడమీలకు 300 మార్కులకు, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో చేరేందుకు 200 మార్కులకు ఉంటుంది.

రెండు నోటిఫికేషన్లకూ

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 30

వెబ్‌సైట్: upsconline.nic.in

సీడాక్ పీజీ సర్టిఫికెట్స్

కేంద్ర కమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్(సీడాక్) వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఐసీటీ డొమైన్‌లో వివిధ పీజీ సర్టిఫికెట్ కోర్సులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా ఉన్న సీడాక్ సెంటర్లు ఈ కోర్సులను అందిస్తున్నాయి.

కోర్సులు: అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్, బిగ్ డేటా అనలిటిక్స్, ఎంబెడెడ్ సిస్టమ్స్ డిజైన్, ఐటి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సిస్టమ్ అండ్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వీఎల్ఎస్ఐ డిజైన్, మొబైల్ కంప్యూటింగ్, అడ్వాన్స్‌డ్ సెక్యూర్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, హెచ్‌పీసీ సిస్టమ్ అడ్మినిస్ట్రేషన్, రోబోటిక్స్ అండ్ అలైడ్ టెక్నాలజీస్, ఫిన్‌టెక్ అండ్ బ్లాక్‌చెయిన్ డెవలప్‌మెంట్, సైబర్ సెక్యూరిటీ అండ్ ఫోరెన్సిక్స్(ఇవన్నీ 24 వారాల కోర్సులు)

అర్హత: ఇంజనీరింగ్‌లో ఎంపిక చేసిన స్ట్రీమ్స్ లేదా సైన్స్‌లోనూ ఎంపిక చేసిన పీజీ స్ట్రీమ్స్, ఎంసీఏ ఉత్తీర్ణత

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 29

కామన్ అడ్మిషన్ టెస్ట్ తేదీ: వచ్చే ఏడాది జనవరి 10, 11

మరిన్ని వివరాలకు వెబ్‌సైట్స్: www.cdac.in, acts.cdac.in

దిక్సూచి

జాబ్ కార్నర్

రైట్స్‌లో అసిస్టెంట్ మేనేజర్లు

గుర్‌గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్(రైట్స్)కు చెందిన నాలుగు జోన్లలో 400 అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది.

విభాగాలు: సివిల్, ఎలక్ట్రికల్, సిగ్నల్ అండ్ టెలీకమ్యూనికేషన్, మెకానికల్, మెటలర్జీ, కెమికల్, ఐటీ, ఫుడ్ టెక్నాలజీ, ఫార్మా

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీకి తోడు పనిచేసిన అనుభవం ఉండాలి.

ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా(రాత పరీక్ష వచ్చే ఏడాది జనవరి 11న జరుగుతుంది.)

పరీక్ష కేంద్రం: హైదరాబాద్ సహా దేశంలోని పలు ప్రాంతాల్లో పరీక్షను నిర్వహించనున్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 25

సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్స్

రైట్స్ - మరో 150 సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్స్(మెకానికల్) పోస్టులకు కూడా మరో నోటిఫికేషన్ విడుదల చేసింది.

అర్హత: మెకానికల్ ప్రొడక్షన్/ ప్రొడక్షన్ అండ్ ఇండస్ట్రియల్/ మాన్యుఫాక్చరింగ్, మెకానికల్ అండ్ ఆటోమొబైల్ డిప్లొమా ఇంజనీరింగ్‌లో ఉత్తీర్ణతకు తోడు రెండేళ్ళ పాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక: రాతపరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబర్ 30

వెబ్‌సైట్: http://www.rites.com.

సీబీఎస్ఈలో ఉద్యోగాలు

కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ పరిదిలోని స్వయం ప్రతిపత్తి సంస్థ - సీబీఎస్ఈ 124 పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

పోస్టులు: అసిస్టెంట్ సెక్రటరీ 8, అసిస్టెంట్ ప్రొఫెసర్ అండ్ అసిస్టెంట్ డైరెక్టర్(అకడమిక్స్/ ట్రైనింగ్/ స్కిల్ ఎడ్యుకేషన్) 27, అకౌంట్స్ ఆఫీసర్ 2, సూపరింటెండెంట్ 27, జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్ 9, జూనియర్ అకౌంటెంట్ 16, జూనియర్ అసిస్టెంట్ 35

అర్హత: పోస్టును అనుసరించి ఇంటర్, డిగ్రీ, పీజీ, ఎంబీఏ, ఎంఏ, ఐసీడబ్ల్యూఏఐ ఉత్తీర్ణులై ఉండాలి. కంప్యూటర్ నాలెడ్జ్ కూడా ఉండాలి.

ఎంపిక: రెండు దశల్లో(ఎంసీక్యూ, డిస్క్రిప్టివ్) పరీక్షలు, ఇంటర్వ్యూ/ ఇతర టెస్టుల ఆధారంగా

పరీక్ష కేంద్రం: తెలుగు రాష్ట్రాల్లో విజయవాడ(మొదటి దశకు)

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబర్ 22.

వెబ్‌సైట్: https://www.cbse.gov.in/cbsenew/cbse.html

యూసీఐఎల్

ఝార్ఖండ్‌లోని యూరేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యూసీఐఎల్) - వివిధ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.

పోస్టులు: మైనింగ్ మేట్(సి) 95, వైండింగ్ ఇంజిన్ డ్రైవర్(బి) 9, బాయిలర్-కమ్-కంప్రెసర్ అటెండెంట్(ఎ) 3

అర్హత: పదోతరగతి ఉత్తీర్ణతకు తోడు డీజీఎంఎస్ జారీ చేసిన సంబంధిత సర్టిఫికెట్ ఉండాలి. ఉద్యోగానుభవం కూడా ఉండాలి.

ఎంపిక: రాతపరీక్ష/ ట్రేడ్ టెస్ట్/ సైకోమెట్రిక్ టెస్ట్/ గ్రూప్ ఎక్సర్‌సైజ్/ పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా

దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 31 **వెబ్‌సైట్:** www.uraniumcorp.in

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు

అశ్వినీ దత్



టాలీవుడ్ చలనచిత్రాల నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ 50 ఏళ్లను పూర్తిచేసుకుంది. ఈ సందర్భంగా సంస్థ ప్రయాణాన్ని విజయవంతం చేసిన వారందరిని గుర్తు చేసుకుంటూ కృతజ్ఞతలు తెలిపారు ఆ సంస్థ అధినేత, నిర్మాత చలసాని అశ్వినీదత్. 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ.. 'మా సంస్థకు నామకరణం చేసి, ఎనలేని సహకారం అందించిన నందమూరి తారకరామారావుకు కృతజ్ఞతలు. మా తొలి చిత్రాన్ని రూపొందించిన దర్శకులు కే విశ్వనాథ్, బాపయ్య, కే రాఘవేంద్ర రావుతో పాటు మా బేనర్‌లో పనిచేసిన డైరెక్టర్స్ అందరికీ ధన్యవాదాలు. సంస్థ ప్రయాణంలో భాగమైన హీరోలు ఎన్టీఆర్, ఏయన్నార్, కృష్ణ, శోభన్‌బాబు, కృష్ణం రాజు, చిరంజీవి, వెంకటేశ్, బాలకృష్ణ, నాగార్జునతో పాటు ఈతరానికి చెందిన పవన్‌కల్యాణ్, మహేశ్‌బాబు, ఎన్టీఆర్, అల్లు అర్జున్, రామ్‌చరణ్, నాని, విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్ తదితరులకు హృదయపూర్వక కృతజ్ఞతలు. అమితాబ్ బచ్చన్, రజనీకాంత్, కమల్ హాసన్ వంటి లెజెండ్స్‌తో పనిచేయడం సంస్థ సినీ ప్రయాణాన్ని మరింత ప్రత్యేకం చేసింది. నిర్మాణ సంస్థ బాధ్యతలను ముందుకు తీసుకువెళ్తున్న స్వప్న, ప్రియాంక, స్రవంతి, నాగ్ అశ్విన్‌లను చూస్తుంటే గర్వంగా ఉంది' అని అన్నారు.



వినోదాత్మక చిత్రం

'మత్తు వదలరా' ఫేమ్ నరేశ్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా మురళీ మనోహర్ తెరకెక్కించిన చిత్రం 'గుర్రం పాపిరెడ్డి'. డా.సంధ్య గోలీ సమర్పణలో వేణుసద్ది, అమర్ బురా, జయకాంత్ (బాబీ) నిర్మించారు. బ్రహ్మానందం, యోగిబాబు, ప్రభాస్ శ్రీను, మొట్ట రాజేంద్రన్ కీలక పాత్రలు పోషించారు. ఈ నెల 19న చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేశారు. సినిమా ఆద్యంతం వినోదాత్మకంగా ఉండబోతోందని ట్రైలర్‌ను చూస్తే తెలుస్తోంది.

ప్రధాని కోసం 'అఖండ 2' ప్రత్యేక ప్రదర్శన



బోయపాటి శ్రీను

'ప్రధాని మోదీ కోసం త్వరలో ఢిల్లీలో 'అఖండ 2' సినిమాను ప్రత్యేకంగా ప్రదర్శించబోతున్నాం. మనిషి అనుకుంటే గెలవవచ్చు ఓడవచ్చు. కానీ, దేవుడు తలచుకుంటే గెలుపు మాత్రమే ఉంటుంది. అలా దేవుడు గెలిపించిన సినిమా ఇది' అని అన్నారు దర్శకుడు బోయపాటి శ్రీను. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా ఆయన తెరకెక్కించిన చిత్రం 'అఖండ 2:తాండవం' ఇటీవలె విడుదలైంది. ఈ సందర్భంగా ఆదివారం ప్రత్యేక వేడుకను నిర్వహించారు. కార్యక్రమంలో నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ ' శివుడి ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు. ఒక పని కోసం కొందరిని ఆ పరమశివుడే ఎంచుకుంటాడు. మనిషి పుట్టుకకు ఏదో ఒక కారణం ఉంటుంది. 'అఖండ 2' సినిమా చూసిన ప్రేక్షకులు సనాతన హైందవ ధర్మం మీసం మెలేసిందని చెబుతున్నారు. మన ధర్మం, మన గర్వం, మన తేజస్సు కలగలసిన ఈ సినిమా ఆబాల గోపాలాన్ని అలరించిందని యావత్ ప్రపంచం కొనియాడుతోంది. ఇంతటి అఖండ విజయాన్ని ఇచ్చిన వారందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ సినిమాలో ఒక్కొక్క డైలాగు ఒక్కొక్క ఆణిముత్యం. ప్రతి సన్నివేశం ఒక ఉద్వేగ ప్రకంపనం. చరిత్రలో చాలా మంది ఉంటారు. సృష్టించిన చరిత్రను మళ్లీ మళ్లీ తిరగరాసి తిరిగి చరిత్ర సృష్టించేవాడు ఒక్కడే..అది ఒక తెలియని శక్తి. 'ఎవరిని చూసుకొని రా బాలకృష్ణకు అంత పొగరు' అని చాలా మంది అంటుంటారు. నన్ను చూసుకొనే నాకు పదునైన పొగరు. నా వ్యక్తిత్వమే నన్ను ఉసిగొల్పే విప్లవం. నన్ను నేను తెలుసుకోవడమే. నా వృత్తే నా దైవం. ఈ సినిమా కేవలం భాగవతానికి సంబంధించినది కాదు. ఒక బైబిల్, ఒక ఖురాన్‌కి కూడా సంబంధించిన సినిమా' అని అన్నారు. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ 'మహిళలు, పిల్లలు ఈ చిత్రాన్ని అద్భుతంగా ఆదరిస్తున్నారు' అని చెప్పారు. కార్యక్రమంలో సంగీత దర్శకుడు థమన్, గంగాధర శాస్త్రి, ఫైట్ మాస్టర్స్ రామ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రీ కొడుకుల అనుబంధం



మలయాళ కథానాయకుడు మోహన్ లాల్ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'వృషభ'. నందకిశోర్ తెరకెక్కించిన ఈ చిత్రాన్ని కనెక్ట్ మీడియా, బాలాజీ టెలీఫిల్మ్స్, అభిషేక్ ఎస్ వ్యాస్ స్టూడియోస్ బేనర్లపై శోభా కపూర్, ఏక్తా ఆర్ కపూర్, సీకే పద్మకుమార్, వరుణ్ మాథుర్, సౌరభ్ మిశ్రా, అభిషేక్ ఎస్ వ్యాస్, ప్రవీర్ సింగ్, విశాల్ గుర్నాని, జూహి పరేఖ్ మెహతా నిర్మించారు. ఈ నెల 25న పాన్ ఇండియా స్థాయిలో చిత్రం విడుదలవుతోంది. తాజాగా ఈ చిత్రం నుంచి 'అప్పా' అనే పాటను విడుదల చేశారు. తండ్రీ కొడుకుల మధ్యనున్న అనుబంధాన్ని తెలిపే విధంగా ఉన్న ఈ పాట అందర్నీ ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా నందకిశోర్ మాట్లాడుతూ 'కుటుంబం కోసం, పిల్లల కోసం తపన పడే తండ్రి కథాంశంతో వచ్చిన చిత్రాలు చాలా తక్కువ. ఆ లోటును ఈ సినిమా భర్తీ చేస్తుంది' అని అన్నారు.

నాగార్జున వాయిస్ ఓవర్‌తో అర్జునుడి పరిచయం



'ఛలో', 'భీష్మ', 'రాబిన్‌హుడ్' చిత్రాల దర్శకుడు వెంకీ కుడుముల నిర్మాతగా మారారు. వాట్ నెక్స్ట్ ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్‌పై నిర్మాత మహేశ్ రెడ్డి తనయుడు అనీశ్‌ను హీరోగా పరిచయం చేస్తున్నారు. మహేశ్ ఉప్పాల దర్శకుడు. మలయాళ నటి అనస్వర రాజన్ కథానాయిక. ఆదివారం ఈ సినిమా టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. అక్కినేని నాగార్జున వాయిస్ ఓవర్‌తో 'సోల్ ఆఫ్ అర్జున' పేరుతో హీరో హీరోయిన్లను పరిచయం చేశారు. నాగ్ వాయిస్ ఓవర్, సంభాషణలు, విజువల్స్, నేపథ్య సంగీతం ఆకట్టుకున్నాయి. ఓ అద్భుతమైన ప్రేమకథగా సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.


పాటలకు మంచి స్పందన వస్తోంది

- మిక్కీ జే మేయర్



"ఛాంపియన్' లాంటి సినిమాకు సంగీతం అందించే అవకాశం చాలా అరుదుగా వస్తుంది. ఇందులో ప్రతీ సన్నివేశం చాలా యూనిక్‌గా ఉంటుంది. విజువల్‌గా కూడా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని కలిగిస్తుంది. ఇప్పటికే విడుదల చేసిన రెండు పాటలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది' అని చెప్పారు మిక్కీ జే మేయర్. రోషన్, అనస్వర రాజన్ జంటగా ప్రదీప్ అద్వైతం రూపొందించిన చిత్రం 'ఛాంపియన్'కు మిక్కీ జే మేయర్ సంగీతం సమకూర్చారు. ఈ చిత్రాన్ని జీ స్టూడియోస్ సమర్పణలో స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈనెల 25న ప్రపంచ వ్యాప్తంగా విడుదల అవుతోంది. ఈ సందర్భంగా మిక్కీ జే మేయర్ మీడియాతో మాట్లాడుతూ..' స్వాతంత్ర్యోద్యమ కాలంలో జరిగే కథలు ఇప్పటి వరకు చాలానే వచ్చాయి. ఆ చిత్రాల్లో బ్రిటిషర్స్‌తో జరిగిన పోరాటాన్ని చూపించారు. కానీ 'ఛాంపియన్' చాలా ప్రత్యేకమైనది. ఇందులో ఎక్కువగా నిజాం బ్యాక్‌డ్రాప్ ఉంటుంది. నిజాం కాలంనాటి గ్రామాలు, ప్రజలు, వారి భావోద్వేగాలను విభిన్నంగా చూపించారు. క్రీడా నేపథ్యమున్న సినిమానే అయినప్పటికీ కథ పరంగా భిన్నంగా ఉంటుంది. ఇందులో హీరోది సికింద్రాబాద్. ఆయన మాట్లాడే భాష కూడా డిఫరెంట్‌గా ఉంటుంది. గిర గిర పాట సూపర్ హిట్ అయింది' అని తెలిపారు.

రాజాసాబ్ ప్రేమ గీతం



ప్రభాస్ కథానాయకుడిగా మారుతి తెరకెక్కిస్తున్న హారర్ థ్రిల్లర్ 'ద రాజాసాబ్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. నిధి అగర్వాల్, మాళవికా మోహనన్, రిద్ధి కుమార్ కథానాయికలు. సంజయ్ దత్ కీలక పాత్రలో కనిపించనున్నారు. వచ్చే ఏడాది జనవరి 9న సంక్రాంతి సందర్భంగా చిత్రం విడుదలవుతోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదల చేసిన తొలి పాట 'రెబల్ సాబ్' ఫ్యాన్స్‌ను ఖుషీ చేసి, వింటేజ్ ప్రభాస్‌ను గుర్తుచేసింది. ఆదివారం ఈ సినిమా నుంచి రెండో పాట ప్రోమోను విడుదల చేశారు మేకర్స్. 'సహనా సహనా' అంటూ అందమైన లోకేషన్లలో ప్రభాస్, నిధి అగర్వాల్‌పై చిత్రీకరించిన ఈ డ్యూయెట్ ప్రస్తుతం అందర్నీ ఆకట్టుకుంటోంది. పూర్తి పాటను ఈ నెల 17న విడుదల చేయనున్నారు. ఈ సాంగ్ ప్రేక్షకులకు వింటేజ్ డార్లింగ్‌ను గుర్తుకుతెస్తుందని మేకర్స్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: కోటగిరి వేంకటేశ్వర రావు, సినిమాటోగ్రఫీ: కార్తీక్ పళని, సంగీతం: థమన్.

శోభన్ బాబుది ఓ ప్రత్యేక స్థానం

మురళీమోహన్



నటుడిగా, వ్యక్తిగా నటభూషణ శోభన్ బాబుకు ఓ ప్రత్యేక స్థానం ఉందని సీనియర్ నటుడు మురళీమోహన్ అన్నారు. శోభన్ బాబు కథానాయకుడిగా నటించిన 'సోగ్గాడు' చిత్రం 50 సంవత్సరాలు పూర్తిచేసుకుంటున్న సందర్భంగా సురేశ్ ప్రొడక్షన్స్, అఖిల భారత శోభన్ బాబు సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 19న హైదరాబాద్‌లో స్వర్ణోత్సవ వేడుకను నిర్వహించనున్నారు. అదే రోజు ఈ చిత్రాన్ని రీ రిలీజ్ చేయనున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో నిర్వహించిన స్వర్ణోత్సవ ఆరంభ వేడుకలో మురళీమోహన్ పాల్గొన్నారు. కార్యక్రమంలో సురేశ్ ప్రొడక్షన్స్ అధినేత, నిర్మాత డి.సురేశ్ బాబు మాట్లాడుతూ '1975లో విడుదలైన 'సోగ్గాడు' చిత్రం తమ సంస్థకు మంచి పేరును, డబ్బును తెచ్చిపెట్టింది' అని తెలిపారు. కార్యక్రమంలో కైకాల నాగేశ్వర రావు, అట్లూరి పూర్ణచంద్రరావు, బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, రేలంగి నర్సింహారావు, రాశీ మూవీస్ నర్సింహారావు, కె.మురళీమోహన్‌రావు, అఖిల భారత శోభన్ బాబు సేవా సమితి చైర్మన్ సుధాకర్ బాబు, కన్వీనర్ సాయి కామరాజు, పూడి శ్రీనివాస్, బి.బాలసుబ్రహ్మణ్యం, భట్టిప్రోలు శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

అసమానతలను ప్రశ్నించే 'దండోరా'



శివాజీ, నవదీప్, నందు ప్రధాన పాత్రధారులుగా మురళీకాంత్ తెరకెక్కించిన చిత్రం 'దండోరా'. లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై రవీంద్ర బెనర్జీ ముప్పనేని నిర్మించారు. సినిమా ఈనెల 25న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో 'నిన్ను మోసినా.. నన్ను మోసినా అమ్మ పేగు ఒకటేనన్నా...' అంటూ సాగే టైటిల్ సాంగ్‌ని రిలీజ్ చేశారు. సమాజంలో అట్టడుగు వర్గాల ప్రజల బాధలను తెలియజేసేలా ఈ పాట సాగుతుంది. చంద్రుడిపైకి మనిషి అడుగు పెట్టి ఎన్నో ఏళ్లు అవుతున్నా, ఈ అసమానతలు మాత్రం తగ్గడం లేదనేది ఈ పాటలోని భావం. ఈ సందర్భంగా నటుడు శివాజీ మాట్లాడుతూ 'తెలంగాణ గ్రామీణ నేపథ్యమున్న చిత్రమిది. అన్ని కమర్షియల్ అంశాలూ ఇందులో ఉన్నాయి. కామెడీ ఉన్నా అది దండోరా వేసినట్టే ఉంటుంది' అని అన్నారు. దర్శకుడు మురళీకాంత్ మాట్లాడుతూ 'మార్క్ అద్భుతమైన సంగీతం అందించారు. సినిమాలో ఏం చెప్పాలనుకుంటున్నామో థియేటర్స్‌కు వస్తే తెలుస్తుంది' అని అన్నారు. నిర్మాత రవీంద్ర బెనర్జీ ముప్పనేని మాట్లాడుతూ 'మంచి కంటెంట్ ఉన్న చిత్రాన్ని ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకంతో ముందడుగు వేశాం' అని తెలిపారు.

స్పోర్ట్స్

గుంటూరు ● సోమవారం 15 డిసెంబరు 2025

అవలీలగా ఆడేశారు

7 వికెట్లతో భారత్ ఘనవిజయం

బౌలర్ల విజృంభణ ● అభిషేక్ జోరు

మూడో టీ20లో దక్షిణాఫ్రికా చిత్తు



హర్షిత్ (2/34)

అర్షదీప్ (2/13)

ధర్మశాల: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌లో టీమిండియా మరోసారి ఆధిపత్యం ప్రదర్శించింది. ఆదివారం జరిగిన మూడో టీ20లో బౌలర్లు విశేషంగా రాణించడంతో 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. దీంతో ఈ సిరీస్‌లో 2-1తో ముందంజ వేసింది. నాలుగో టీ20 బుధవారం లఖ్‌నవూలో జరుగుతుంది. ముందుగా దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 117 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ మార్‌క్రమ్ (46 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 61) అర్ధసెంచరీ సాధించగా.. ఫెరీరా (20), నోకియా (12) రెండంకెల స్కోర్లు సాధించిన మరో ఇద్దరు ఆటగాళ్లు. ఇక, ఛేదనలో భారత్ 15.5 ఓవర్లలో 3 వికెట్లకు 120 పరుగులు చేసి నెగ్గింది. అభిషేక్ (18 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 35), గిల్ (28), తిలక్ (25 నాటౌట్) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా అర్షదీప్ (2/13) నిలిచాడు. మరోవైపు పేసర్ బుమ్రా వ్యక్తిగత కారణాలరీత్యా ముంబైకి వెళ్లగా, స్పిన్నర్ అక్షర్ అనారోగ్యంతో మ్యాచ్‌కు దూరమయ్యాడు. వీరి స్థానాల్లో హర్షిత్, కుల్దీప్ జట్టులోకి వచ్చారు.

ఓపెనర్ల జోరు: స్వల్ప ఛేదన.. పైగా మంచు ప్రభావం. దీంతో భారత ఓపెనర్లు కసిదీరా బంతిని బాదేస్తూ చకచకా లక్ష్యాన్ని కరిగించారు. మధ్య ఓవర్లలో సఫారీ బౌలర్లు ప్రభావం చూపినా ఫలితం లేకపోయింది. తొలి బంతినే సిక్సర్‌గా మలిచిన అభిషేక్ తన ఉద్దేశాన్ని చాటగా.. అటు ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడిన గిల్ సైతం ధాటిని కనబర్చాడు. అయితే ఖాతా తెరువకముందే అతడిని అంపైర్ ఎల్బీగా ప్రకటించగా.. రివ్యూ కోరి బతికిపోయాడు. యాన్సెన్ వేసిన బంతి ముందుగా బ్యాట్‌కు టచ్ అయినట్టు తేలింది. ఈ అవకాశాన్ని సొమ్ము చేసుకుంటూ ఆ తర్వాత బౌండరీలతో చెలరేగాడు. అటు అభిషేక్ ప్రతీ బంతిని బాదడమే లక్ష్యంగా దూసుకెళ్లాడు. అయితే ఆరో ఓవర్‌లో అతడి క్యాచ్‌ను కవర్స్ నుంచి వెనక్కి పరిగెడుతూ మార్‌క్రమ్ అద్భుతంగా పట్టేశాడు. దీంతో తొలి వికెట్‌కు 60 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. వచ్చీ రావడంతోనే తిలక్ రెండు ఫోర్లు బాదడంతో పవర్‌ప్లేలో జట్టు 68/1 స్కోరుతో నిలిచింది. అయితే ఆ తర్వాత సఫారీ బౌలర్లు కట్టడి చేయడంతో పరుగులు నెమ్మదించాయి. షాట్లు ఆడేందుకు ఇబ్బందిపడిన గిల్‌ను 12వ ఓవర్‌లో యాన్సెన్ బౌల్డ్ చేశాడు. దీంతో రెండో వికెట్‌కు 32 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక కెప్టెన్ సూర్య (12) రెండు వరుస ఫోర్లతో ఊపు చూపినా మరో భారీ షాట్‌కు వెళ్లి బార్ట్‌మన్‌కు దొరికిపోయాడు. అప్పటికి 32 బంతుల్లో 9 రన్స్ కావాల్సి ఉండడంతో దూబే (10 నాటౌట్) 6,4తో మరో 25 బంతులుండగానే భారత్ మ్యాచ్‌ను ముగించింది.

వికెట్ల టపటపా: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికాకు తొలి ఓవర్ నుంచే కష్టాలు ఆరంభమయ్యాయి. కొత్త బంతితో ఇరువైపులా స్వింగ్‌ను రాబట్టిన పేసర్లు అర్షదీప్, హర్షిత్ అదరగొట్టారు. అటు స్పిన్నర్లు సైతం విశేషంగా రాణించడంతో 8 మంది బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. అయితే కెప్టెన్ మార్‌క్రమ్ ఒక్కడే నిలబడి కాస్త పరువు కాపాడాడు. కానీ మరో ఎండ్‌లో సఫారీ బ్యాటర్లు ఇలా వచ్చి అలా వెళ్లడం జరిగింది. ఓపెనర్ హెన్‌డ్రిక్స్ (0)ను తొలి ఓవర్‌లోనే పేసర్ అర్షదీప్ అవుట్ చేశాడు. ఇక హర్షిత్ తన వరుస ఓవర్లలో మరో ఓపెనర్ డికాక్ (1), బ్రెవిస్ (2)ను అవుట్ చేయడంతో 7 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. అటు మార్‌క్రమ్ ఓపిగ్గా క్రీజులో నిలిచి బౌలర్లను ఎదుర్కొంటున్నా అతడికి సహకారమే కరువైంది. నాలుగో వికెట్‌కు 23 పరుగులు జత చేశాక స్టబ్స్ (9) వెనుదిరిగాడు. ఆ తర్వాత బాష్ (4) కూడా నిరాశపర్చగా.. ఫెరీరా కాసేపు మార్‌క్రమ్‌కు అండగా నిలిచాడు. ఒక ఫోర్, ఒక సిక్సర్‌తో ఆకట్టుకున్న తనను వరుణ్ బౌల్డ్ చేయడంతో ఆరో వికెట్‌కు 25 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. తన తర్వాతి ఓవర్‌లోనే యాన్సెన్ (2)ను కూడా వరుణ్ బౌల్డ్ చేశాడు. చివర్లో జోరు పెంచిన మార్‌క్రమ్ 4,6,6తో 18వ ఓవర్‌లో 19 పరుగులతో జట్టు స్కోరును వంద దాటించాడు. అలాగే 41 బంతుల్లో తన ఫిఫ్టీని కూడా పూర్తి చేశాడు. కానీ తర్వాతి ఓవర్‌లోనే మార్‌క్రమ్‌ను అర్షదీప్ అవుట్ చేయడంతో ఆ కాస్త జోష్ కూడా ముగిసినట్టయ్యింది. చివరి ఓవర్‌లో స్పిన్నర్ కుల్దీప్ రెండు వికెట్లతో ప్రత్యర్థిని ఆలౌట్ చేశాడు.

స్కోరుబోర్డు

దక్షిణాఫ్రికా: డికాక్ (ఎల్బీ) హర్షిత్ 1, హెన్‌డ్రిక్స్ (ఎల్బీ) అర్షదీప్ 0, మార్‌క్రమ్ (సి) జితేశ్ (బి) అర్షదీప్ 61, బ్రెవిస్ (బి) హర్షిత్ 2, స్టబ్స్ (సి) జితేశ్ (బి) హార్దిక్ 9, బాష్ (బి) దూబే 4, ఫెరీరా (బి) వరుణ్ 20, యాన్సెన్ (బి) వరుణ్ 2, నోకియా (స్టంప్) జితేశ్ (బి) కుల్దీప్ 12, ఎన్‌గిడి (నాటౌట్) 2, బార్ట్‌మన్ (సి) సూర్యకుమార్ (బి) కుల్దీప్ 1; **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 20 ఓవర్లలో 117 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-1, 2-1, 3-7, 4-30, 5-44, 6-69, 7-77, 8-113, 9-115, 10-117; **బౌలింగ్:** అర్షదీప్ 4-0-13-2, హర్షిత్ 4-0-34-2, హార్దిక్ 3-0-23-1, వరుణ్ 4-0-11-2, దూబే 3-0-21-1, కుల్దీప్ 2-0-12-2.

భారత్: అభిషేక్ (సి) మార్‌క్రమ్ (బి) బాష్ 35, గిల్ (బి) యాన్సెన్ 28, తిలక్ (నాటౌట్) 26, సూర్య (సి) బార్ట్‌మన్ (బి) ఎన్‌గిడి 12, దూబే (నాటౌట్) 10; **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 15.5 ఓవర్లలో 120/3. వికెట్ల పతనం:** 1-60, 2-92, 3-109; **బౌలింగ్:** ఎన్‌గిడి 3-0-23-1, యాన్సెన్ 3-0-24-1, బార్ట్‌మన్ 3.5-0-34-0, బాష్ 3-0-18-1, నోకియా 3-0-14-0.

మట్టికరిచిన పాక్

- యువ భారత్ ఘన విజయం
- అండర్-19 ఆసియా కప్

దుబాయ్: భారత బౌలర్లు దీపేష్ దేవేంద్రన్ (3/16), కనిష్క్ చౌహాన్ (3/33) కట్టుదిట్టమైన బౌలింగ్‌తో.. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను యువ భారత్ మట్టికరిపించింది. అండర్-19 ఆసియాకప్ గ్రూప్-ఎలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 90 పరుగుల తేడాతో పాక్‌ను చిత్తు చేసింది. వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. భారత్, పాక్ ఆటగాళ్లు ఈ మ్యాచ్‌లో కూడా పరస్పరం కరచాలనం చేసుకోలేదు. వర్షం కారణంగా మ్యాచ్‌ను 49 ఓవర్లకు కుదించగా.. తొలుత భారత్ 46.1 ఓవర్లలో 240 పరుగులకు ఆలౌటైంది. ఆరోన్ జార్జ్ (85) అర్ధ శతకం నమోదు చేయగా.. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కనిష్క్ (46) బ్యాట్‌తోనూ రాణించాడు. మహ్మద్ సయ్యామ్, అబ్దుల్ సుభాన్ చెరో మూడు వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఛేదనలో పాక్ 41.2 ఓవర్లలో 150 పరుగులకే కుప్పకూలింది. హుజైఫా ఎహ్‌సాన్ (70) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. కిషన్ సింగ్ రెండు వికెట్లు పడగొట్టాడు. దీపేష్ దెబ్బకు 30/4తో పీకల్లోతు కష్టాల్లో పడ్డ పాక్‌ను కెప్టెన్ యూసుఫ్ (23), హుజైఫా ఐదో వికెట్‌కు 47 భాగస్వామ్యంతో గాడిలో పెట్టేందుకు యత్నించారు. అయితే, యూసుఫ్‌ను వైభవ్ క్యాచవుట్ చేయడంతో.. పాక్ పతనం వేగంగా జరిగిపోయింది. అర్ధ శతకం పూర్తి చేసుకొన్న హుజైఫాను కనిష్క్ పెవిలియన్ చేర్చాడు.

నిరాశపర్చిన వైభవ్..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలోనే గట్టిదెబ్బ తగిలింది. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (5)ని సయ్యామ్ రిటర్న్ క్యాచ్‌తో వెనక్కిపంపాడు. అయితే, కెప్టెన్ ఆయుష్ మాత్రే (38), ఆరోన్ రెండో వికెట్‌కు 49 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. ఆయుష్‌ను సయ్యామ్ అవుట్ చేయగా.. విహాన్ మల్హోత్రా (12), వేదాంత్ త్రివేది (7) స్వల్ప స్కోరుకే వెనుదిరిగారు. కానీ, అభిజ్ఞాన్ కుందూ (22)తో కలసి ఆరోన్ ఐదో వికెట్‌కు 60 పరుగులు జోడించాడు. కుందూ, ఆరోన్‌ను సుభాన్ అవుట్ చేసినా.. ఖిలన్ (6), హనిల్ (12) అండతో కనిష్క్ టీమ్‌కు పోరాడగలిగే స్కోరును అందించాడు.

సంక్షిప్త స్కోర్లు: భారత్: 46.1 ఓవర్లలో 240 ఆలౌట్ (ఆరోన్ జార్జ్ 85, కనిష్క్ 46, సయ్యామ్ 3/67; సుభాన్ 3/42). **పాకిస్థాన్:** 41.2 ఓవర్లలో 150 ఆలౌట్ (ఎహ్‌సాన్ 70, దీపేశ్ 3/16, కనిష్క్ 3/33, కిషన్ 2/33).

మెస్సీ మెరిసె.. ముంబై మురిసె

- ప్రత్యేక ఆకర్షణగా సచిన్
- పోటెత్తిన అభిమానులు



అపురూప క్షణం..

లియోనెల్ ఇక్కడకు రావడం అపురూపమైన సందర్భమని సచిన్ పేర్కొన్నాడు. 2011 వరల్డ్‌కప్‌లోని తన నెం.10 జెర్సీపై సంతకం చేసి మెస్సీకి బహూకరించాడు. మెస్సీ కూడా ఫిఫా వరల్డ్‌కప్ (2026) బంతిని సచిన్‌కు ఇచ్చాడు. సినీ నటి కరీనా కపూర్ కూడా తన కుమారులతో కలసి లియోనెల్‌ను కలుసుకొంది.

ముంబై: అర్జెంటీనా సూపర్ స్టార్ లియోనెల్ మెస్సీ ఫీవర్ కలల నగరాన్ని కుదిపేసింది. మెస్సీ.. మెస్సీ నామస్మరణతో సిటీ మొత్తం సందడి వాతావరణం నెలకొంది. 'గోట్' ఇండియా టూర్‌లో భాగంగా మూడో అంచె అయిన ముంబైలో మెస్సీ ఆదివారం పర్యటించాడు. అయితే, దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, మెస్సీ వాంఖడేలో కలవడం ఈ పర్యటనకే హైలైట్‌గా చెప్పుకోవచ్చు. అతడి రాక కోసం ఎదురుచూస్తున్న ఫ్యాన్స్ స్టేడియానికి పోటెత్తారు. ఆదివారం మధ్యాహ్నం మెస్సీ ఇక్కడకు చేరుకొన్నాడు. ప్రముఖ ఫుట్‌బాలర్లు లూయిస్ సువారెజ్, రోడ్రిగో డి పాల్ కూడా అతడి వెంటే వచ్చారు. గంట పాటు వాంఖడేలో మెస్సీ అండ్ కో సందడి చేశారు. భారత మాజీ ఫుట్‌బాలర్ సునీల్ ఛెత్రి, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా యువ ఫుట్‌బాలర్లలోని ప్రతిభను వెలికితీయడానికి 'ప్రాజెక్ట్ మహాదేవ'ను ప్రారంభిస్తున్నట్టు ఫడణవీస్ ప్రకటించారు. మెస్సీని మెమెంటోతో సత్కరించారు. లియోకు ఛెత్రి జెర్సీని బహూకరించగా.. అతడు కూడా సునీల్‌కు అదే గిఫ్ట్‌ను ఇచ్చాడు. సోమవారం ఢిల్లీ లెగ్‌తో లియోనెల్ భారత పర్యటన ముగియనుంది.

కూల్‌గా.. హుషారుగా: మెస్సీ ఎంతో కూల్‌గా కనిపించాడు. రెడ్ కార్పెట్‌పై నడుచుకుంటూ వస్తూనే ఫ్యాన్స్‌కు చేతులు ఊపుతూ పలకరించాడు. ఫడణవీస్, సచిన్‌తోపాటు బాలీవుడ్ నటులు అజయ్ దేవగన్, టైగర్ ష్రాఫ్ తదితరులు కూడా మెస్సీతో కలిశారు. ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో ఆడే ప్లేయర్లను పలకరించిన అనంతరం.. హైదరాబాద్ తరహాలో ఫుట్‌బాల్‌ను స్టాండ్స్‌లోకి కొట్టిన లియోనెల్, సువారెజ్, డి పాల్ ఆ తర్వాత మైదానం అంతా కలియదిరిగారు. ఆ తర్వాత 7-7 ఎగ్జిబిషన్ మ్యాచ్ జరిగింది. యువ ఆటగాళ్లతో ప్రాక్టీస్ చేయించారు. వాంఖడే కంటే ముందు పడేల్ కప్ ఈవెంట్ కోసం బ్రబౌర్న్ స్టేడియాన్ని మెస్సీ సందర్శించాడు.

పంజాబ్‌పై ఆంధ్ర గెలుపు

పుణె: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో భాగంగా ఆదివారం జరిగిన గ్రూప్ 'ఎ' సూపర్ లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర 5 వికెట్లతో పంజాబ్‌పై గెలిచింది. ముందుగా పంజాబ్ 20 ఓవర్లలో 205/5 స్కోరు చేసింది. ఛేదనలో ఆంధ్ర 19.5 ఓవర్లలో 211/5 స్కోరు చేసి విజయాన్నందుకుంది. హేమంత్ రెడ్డి (109 నాటౌట్) అజేయ శతకంతో అదరగొట్టాడు. హేమంత్-ప్రసాద్ (53 నాటౌట్) ఆరో వికెట్‌కు అజేయంగా 155 రన్స్ జోడించారు.



జాతీయ ఆర్చరీలో ఆంధ్రకు స్వర్ణం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ ఆర్చరీ పోటీల్లో ఆంధ్ర పురుషుల జట్టు స్వర్ణం సాధించింది. బేగంపేట హెచ్‌పీఎస్‌లో జరుగుతున్న ఈ పోటీల్లోని ఇండియన్ రౌండ్ విభాగం ఫైనల్‌లో ఎస్. సాంబశివ, జి. వెంకట లోకేష్, సి.హెచ్ మోహిత్ సాయి, యస్.దేశయ్యతో కూడిన బృందం 5-3తో ఉత్తరప్రదేశ్‌ను ఓడించి పసిడి పతకం గెలుచుకుంది. అంతకుముందు జరిగిన సెమీస్‌లో ఆంధ్ర జట్టు 5-3తో లదాఖ్‌పై నెగ్గి, ఫైనల్లో ప్రవేశించింది. కాంపౌండ్ వ్యక్తిగత ర్యాంకింగ్ రౌండ్‌లో ఓజాస్ ప్రవీణ్, అభిజోత్ సింగ్, అభిషేక్ శర్మ, మహిళల కేటగిరీలో అదితి గోపీచంద్, మధుర, మందిర తొలి మూడు స్థానాల్లో నిలిచారు.



స్క్వాష్ వరల్డ్ కప్ మనదే

చెన్నై: స్క్వాష్ వరల్డ్‌లో భారత్ చరిత్ర సృష్టించింది. ఆదివారం జరిగిన ఫైనల్లో భారత్ 3-0తో హాంకాంగ్‌ను చిత్తు చేసింది. తద్వారా స్క్వాష్ ప్రపంచ టైటిల్ అందుకున్న ఆసియా తొలి దేశంగా రికార్డు నెలకొల్పింది. 2023లో కాంస్యమే ఈ టోర్నీ చరిత్రలో మనోళ్ల అత్యుత్తమ ప్రదర్శన.

బిజినెస్

అమ్మకాల బాటలో ఎఫ్‌పీఐలు

- రెండు వారాల్లో రూ.17,955 కోట్లు వెనక్కు..

న్యూఢిల్లీ: విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ).. ఈ నెల 1-12 తేదీల మధ్య కాలంలో దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి రూ.17,955 కోట్ల (200 కోట్ల డాలర్లు) నిధులను వెనక్కు తీసుకున్నారు. దీంతో 2025 సంవత్సరంలో ఈక్విటీ మార్కెట్ల నుంచి వారు ఉపసంహరించిన నిధుల విలువ రూ.1.6 లక్షల కోట్లకు (1,840 కోట్ల డాలర్లు) చేరింది. నవంబరు నెలలో ఎఫ్‌పీఐలు రూ.3,725 కోట్ల విలువ గల నిధులు వెనక్కు తీసుకున్నారు. రూపాయి విలువ భారీ క్షీణతతో పాటు భారత ఈక్విటీల విలువలు అధికంగా ఉండడం కూడా ఎఫ్‌పీఐల నిధుల ఉపసంహరణకు ప్రధాన కారణమని మార్కెట్ నిపుణులు అంటున్నారు. అయితే భారత్ సాధిస్తున్న బలమైన వృద్ధిని, రాబడి అంచనాలను పరిగణనలోకి తీసుకుంటే అమ్మకాల ఒత్తిడి త్వరలో తగ్గవచ్చని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వీకే విజయకుమార్ అన్నారు.

భారత మార్కెట్లోకి ప్రవేశించి 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సామ్‌సంగ్ సరికొత్త విజన్‌ను ఆవిష్కరించింది. ఇందులో భాగంగా వచ్చే దశాబ్దంలో ప్రపంచం కోసం భారత్‌లోనే మరిన్ని ఉత్పత్తుల డిజైన్, అభివృద్ధిని చేపట్టనున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే భారత్ నుంచి 14,000 పైగా పేటెంట్లను కంపెనీ దాఖలు చేసిందని వివరించింది. స్మార్ట్‌ఫోన్స్, టీవీలు, రిఫ్రిజిరేటర్లు, ఏసీలు సహా పూర్తి స్థాయి కృత్రిమ మేధ (ఏఐ) ఉత్పత్తులను కంపెనీ అందిస్తోంది. అంతేకాకుండా రూ.1.11 లక్షల కోట్ల టర్నోవర్‌తో భారత్‌లోనే అతిపెద్ద బహుళజాతి సంస్థగా సామ్‌సంగ్ ఉందని వెల్లడించింది.

జనవరి నుంచి పెరగనున్న టీవీల ధరలు!

- 3 నుంచి 4 శాతం వరకు పెరిగే చాన్స్
- ఇటు చిప్‌ల కొరత, అటు రూపాయి క్షీణత

న్యూఢిల్లీ: కొత్త ఏడాదిలో టీవీల ధరలు పెరిగే అవకాశం కనిపిస్తోంది. మెమరీ చిప్‌ల కొరత, ఫారెక్స్ మార్కెట్లో రూపాయి పతనం ఇందుకు కారణంగా ఉండనుంది. ఇప్పటికే మెమరీ చిప్‌ల కొరతగా కారణంగా వాటి ధరల్లో పెరుగుదల, రూపాయి క్షీణత ప్రభావం టీవీల తయారీపై ప్రభావం చూపిస్తోందని పరిశ్రమ వర్గాలంటున్నాయి. దీంతో 2026 జనవరి నుంచి టీవీల ధరలు 3 నుంచి 4 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని వెల్లడించాయి. ఇటీవల డాలర్ మారకంలో రూపాయి విలువ తొలిసారిగా 90 దాటింది. మరోవైపు టీవీల తయారీలో ఉపయోగించే ఓపెన్‌సెల్, సెమీ కండక్టర్ చిప్‌లు, మదర్‌బోర్డు వంటివి విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. ఏఐ సర్వర్లకు హై బ్యాండ్ విడ్త్ మెమరీ (హెచ్‌బీఎం) చిప్‌ల డిమాండ్ భారీగా ఉంది. ఫలితంగా అన్ని రకాల మెమరీ చిప్‌ల ధరలు గణనీయంగా పెరిగాయి. మరోవైపు చిప్ తయారీదారులు అధిక లాభాలందించే ఏఐ చిప్‌ల తయారీపై మొగ్గు చూపుతున్నందు వల్ల టీవీల వంటి లెగసీ డివైస్‌ల సరఫరా తగ్గిపోయిందని పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. దీంతో ఎల్‌ఈడీ టీవీల ధర 3 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని హాయర్ అప్లయెన్సెస్ ఇండియా ప్రెసిడెంట్ ఎన్ఎస్ సతీశ్ అన్నారు.



మూడేళ్లలో 500% పెరిగిన మెమరీ చిప్‌ల ధర

కాగా కొన్ని టీవీ తయారీ కంపెనీలు ఇప్పటికే టీవీల ధర పెరిగే అవకాశం ఉన్నట్టు డీలర్లకు తెలియచేశాయి. గత మూడేళ్ల కాలంలో మెమరీ చిప్‌ల ధర 500% మేరకు పెరిగిందని థామ్సన్, కోడక్ వంటి టీవీల తయారీ లైసెన్సు గల సూపర్ ప్లాస్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ తెలిపింది. దీంతో టీవీల ధరలు 7-10 శాతం పెరిగే ఆస్కారం ఉన్నదని ఆ కంపెనీ సీఈఓ అవనీత్ సింగ్ మార్వా అన్నారు. రాబోయే రెండు త్రైమాసికాల్లోనూ కూడా చిప్‌ల ధర పెరుగుతూనే ఉండవచ్చని, అదే జరిగితే ధరలు మరింత పెంచక తప్పదని ఆయన హెచ్చరించారు. సొంత బ్రాండ్ వైవాతో పాటు అనేక టీవీలకు ఒరిజినల్ డిజైన్ తయారీదారుగా (ఓడీఎం) ఉన్న వీడియోటెక్స్.. మెమరీ చిప్‌ల లభ్యత పెద్ద సవాల్‌గా ఉండనుందని తెలిపింది.

వచ్చే ఏడాది రెండో త్రైమాసికం వరకు ఇంతే..

సోర్సింగ్ స్థాయిలో ఫ్లాష్ మెమరీ, డీడీఆర్4 ధరలు వెయ్యి శాతం మేరకు పెరిగాయని, వాటిని ఏఐ డేటా సెంటర్లకు సరఫరా చేయడమే ఇందుకు కారణమని వీడియోటెక్స్ డైరెక్టర్ అర్జున్ బజాజ్ అన్నారు. వచ్చే ఏడాది రెండో త్రైమాసికం వరకు పరిస్థితి ఇలాగే ఉండవచ్చని. ఆ తర్వాత చిప్‌ల తయారీ పరిస్థితి కొంత మెరుగుపడవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. రూపాయి విలువలో క్షీణత పరిస్థితిని మరింత సంక్లిష్టం చేసిందని, దీనివల్ల దిగుమతి వ్యయాలు పెరిగిపోయాయని చెప్పారు. రాబోయే వారాల్లో మార్కెట్లో పాత ఇన్వెంటరీ పూర్తయిన తర్వాత నుంచి వీటి ప్రభావం క్రమంగా వినియోగదారులపై కనిపిస్తుందని బజాజ్ అన్నారు.

ఐసీఐసీఐ ప్రు వాల్యూ ఫండ్‌తో మెరుగైన రిటర్నులు

భారత మ్యూచువల్ ఫండ్ రంగంలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ వాల్యూ ఫండ్ తనకంటూ ఒక ప్రత్యేకత గుర్తింపును తెచ్చుకుంది. మదుపరులకు అత్యుత్తమ లాభాలు అందించే విధంగా నాణ్యమైన స్టాక్స్‌ను ఎంపిక చేయటంతో పాటు దీర్ఘకాలం పాటు వాటిపై దృష్టి సారించటం ఈ ఫండ్ ప్రత్యేకత. 2004 ఆగస్టు 16న ప్రారంభమైన ఈ ఫండ్ సగటున ఏటా 20.1 శాతం వృద్ధిని నమోదు చేయటం విశేషం. ఈ ఫండ్ ప్రారంభించిన సమయంలో రూ.10 లక్షలు పెట్టుబడిగా పెడితే ప్రస్తుతం అది ఏకంగా రూ.4.85 కోట్లకు చేరుకుంది. ఇదే సమయంలో నిఫ్టీ 50 టీఆర్ఐలో ఇంత మొత్తం పెట్టుబడిగా పెట్టి ఉంటే అది కేవలం రూ.2.1 కోట్లకు మాత్రమే పెరిగింది. సిప్ రూపంలో అయితే ప్రతి నెలా రూ.10,000 ఇన్వెస్ట్ చేసినా ఆ మొత్తం రూ.25.5 లక్షలకు చేరుకోగా విలువ రూ.2.4 కోట్లకు చేరుకుంది. ఈ ఫండ్ ఎప్పటికప్పుడు పెట్టుబడి అవకాశాలను పరిశీలిస్తూ మార్కెట్ క్యాపిటలైజేషన్‌కు అనుగుణంగా ఇన్వెస్ట్ చేస్తూ వస్తోంది.

- ఐటీసీ సన్‌ఫీస్ట్.. మామ్స్ మ్యాజిక్‌లో నెయ్యితో వేయించిన నట్స్ కుకీస్‌ను తీసుకువచ్చింది. భారతీయ వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా అత్యంత రుచికరంగా ఈ రోస్టెడ్ నట్స్ బిస్కెట్స్‌ను తీసుకువచ్చినట్లు ప్రకటించింది. ఈ కుకీస్ కోసం ప్రత్యేకంగా ఒక ప్రకటనను కూడా కంపెనీ రూపొందించింది.
- ఆదిత్య బిర్లా గ్రూప్ సంస్థ ఆద్యం హ్యాండ్‌వోవెన్.. టాలీవుడ్ నటి శోభితా ధూళిపాలను ప్రచారకర్తగా నియమించుకుంది. భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకు అనుగుణంగా చేనేత కళాకారులు రూపొందించిన వస్త్రాలకు శోభిత ప్రచారం మరింత తోడ్పాటునందిస్తుందని సంస్థ బిజినెస్ లీడ్ మనీశ్ సక్సేనా అన్నారు.

26,400 పైన బుల్లిష్

(డిసెంబరు 15-19 తేదీల మధ్య వారానికి)

ఆస్ట్రో ట్రెండ్



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 26,056 -25,693 పాయింట్ల మధ్యన కదలాడి 139 పాయింట్ల నష్టంతో 26,047 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 26,400 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.


- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 26,031, 25,746, 25,297, 24,720 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి : 26,400 బ్రేక్‌డౌన్ స్థాయి : 25,700

నిరోధ స్థాయిలు : 26,250, 26,350, 26,450 (26,150 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 25,850, 25,750, 25,650 (25,950 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



15వ తేదీ			
హైదరాబాద్	666	విజయవాడ	700
వరంగల్	668	గోదావరి	675
చిత్తూరు	683	విశాఖపట్నం	675
		డజను గుడ్లు రూ.	96

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	119	విజయవాడ	120
వరంగల్	119	గుంటూరు	125
కరీంనగర్	119	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	119	చిత్తూరు	122
కర్నూలు	119	నెల్లూరు	127
విశాఖపట్నం	111	అనంతపురం	127
గోదావరి	120		

మదుపరులు జర జాగ్రత్త..!

ఇన్వెస్టర్లు ఈ వారం అత్యంత అప్రమత్తంగా ఉండాలి. జియో పొలిటికల్ సమీకరణాలు వేగంగా మారుతుండటంతో పాటు అమెరికా టెక్ కంపెనీల షేర్లు కుప్పకూలటంతో మదుపరులు జాగ్రత్తగా వ్యవహరించటం మంచిది. ఆటమిక్ బిల్లుకు ఆమోదం లభించిన నేపథ్యంలో ఆ రంగంలోని కంపెనీల షేర్లను పరిశీలించవచ్చు.

స్టాక్ రికమండేషన్స్

స్విగ్గీ: జీవితకాల కనిష్ఠం నుంచి రూ.465 స్థాయికి చేరిన ఈ షేరు సెప్టెంబరు నుంచి దిద్దుబాటుకు లోనవుతోంది. చివరి నాలుగు సెషన్లలో కాస్త బలం ప్రదర్శించింది. స్వల్పకాలిక నిరోధాన్ని బ్రేక్ చేసేందుకు సిద్ధమవుతోంది. గత శుక్రవారం రూ.416 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.410 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.475 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.395 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

టాటా స్టీల్: పదిహేను నెలల గరిష్ఠాన్ని బ్రేక్ చేసిన తర్వాత ఈ షేరు మళ్లీ దిద్దుబాటుకు లోనైంది. ప్రస్తుతం మెటల్స్‌కు డిమాండ్ పెరగటంతో పుంజుకుంటోంది. రిలేటివ్ స్ట్రెంత్, బైయింగ్ వాల్యూమ్ పెరుగుతున్నాయి. గత శుక్రవారం రూ.171.89 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.170 పై శ్రేణిలో ప్రవేశించి రూ.185 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.167 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

ఎన్ఎండీసీ: నాలుగు నెలలుగా ఈ షేరు రూ.75 జోన్‌లో సైడ్‌వేస్‌లో చలిస్తోంది. మూమెంటమ్ పెరిగే అవకాశం కనిపిస్తోంది. గత శుక్రవారం రూ.77.94 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.75 ఎగువన ప్రవేశించి రూ.81 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.73 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

పీఎన్‌బీ హౌసింగ్: డివిడెండ్ ప్రకటించిన తర్వాత ఒక్కసారిగా పతనమైన ఈ కౌంటర్ ఆగస్టు నుంచి ఏకంగా 25 శాతం పెరిగింది. రిలేటివ్ స్ట్రెంత్ క్రమంగా పుంజుకుంటోంది. గత శుక్రవారం రూ.937 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.925 శ్రేణిలో ప్రవేశించి రూ.1,050 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.910 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

నేషనల్ అల్యూమినియం (నాల్కో): ఈ ఏడాది మార్చి నుంచి వంద శాతానికి పైగా రాబడిని అందించిన ఈ షేరు ప్రస్తుతం జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో కొనసాగుతోంది. నిఫ్టీతో పోల్చితే భారీగా జోరు ప్రదర్శిస్తోంది. డిమాండ్ ఉన్న రంగం కావటంతో ఇన్వెస్టర్లు ఆసక్తి చూపిస్తున్నారు. గత శుక్రవారం రూ.278 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.270 శ్రేణిలో ప్రవేశించి రూ.320 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.255 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

కొనసాగిన అనిశ్చిత ధోరణి

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

గత వారం నిఫ్టీ తీవ్ర ఆటుపోట్ల ధోరణిలో ట్రేడయింది. 26,200 వద్ద తీవ్రమైన రియాక్షన్‌లో పడినా 25,700 స్థాయిలో బలమైన పునరుజ్జీవం సాధించి చివరికి ముందు వారంతో పోల్చితే 140 పాయింట్ల నష్టంతో ముగిసింది. గత ఎనిమిది వారాలుగా మార్కెట్ 26,000 స్థాయిలో సైడ్‌వేస్, ఆటుపోట్ల ధోరణి ప్రదర్శిస్తూనే ఉంది. ఈ స్థాయిలో ఎన్ని రియాక్షన్లు ఎదురవుతున్నా కనిష్ఠస్థాయిల్లో అదేవిధంగా పునరుజ్జీవం కూడా సాధిస్తూ వస్తోంది. అప్‌ట్రెండ్‌ను మరింతగా కొనసాగించాలంటే మరో వారం నిలకడగాముగియడం అవసరం. గత శుక్రవారం అమెరికన్ స్టాక్ మార్కెట్ల ధోరణిని బట్టి చూస్తే ఈ వారంలో మరింత అప్రమత్త ట్రెండ్ ప్రదర్శించే ఆస్కారం కనిపిస్తోంది. ఈ కారణంగా 26,000 వద్ద మరోసారి పరీక్షకు గురి కావచ్చు.

బుల్లిష్ స్థాయిలు: సానుకూలత కోసం 26,000 వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి. ఆ పైన మైనర్ నిరోధం 26,160, ప్రధాన నిరోధం 26,300. ఇదే కొద్ది కాలం క్రితం ఏర్పడిన జీవితకాల గరిష్ఠ స్థాయి, స్వల్పకాలిక అవరోధం. గత కొద్ది వారాలుగా ఇక్కడ మూడు మేజర్ టాప్‌లు ఏర్పడ్డాయి.

బేరిష్ స్థాయి: 26,000 వద్ద పరీక్షలో విఫలమైనా ప్రధాన మద్దతు స్థాయి 25,800 వద్ద నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే స్వల్పకాలిక బలహీనతగా భావించి స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తం కావాలి. ప్రధాన మద్దతు స్థాయి 25,450.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం పరిమిత పరిధిలోనే కదలాడిన ఈ సూచీ 59,390 వద్ద ముగిసింది. సానుకూల ధోరణి సాధించినట్టయితే ప్రధాన నిరోధం 59,600 వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి. మరో ప్రధాన నిరోధం 60,100. ఇదే జీవితకాల గరిష్ఠ స్థాయి. రియాక్షన్‌లో పడితే ప్రధాన మద్దతు స్థాయి 58,800 వద్ద నిలదొక్కుకోవాలి. విఫలమైతే మరింత బలహీన పడుతుంది.

పాటర్న్: మార్కెట్ అనిశ్చిత ధోరణిలో ఉన్నందు వల్ల ట్రెండ్‌లో స్పష్టతకోసం మరో వారం వేచి ఉండాలి. మరింత అప్‌ట్రెండ్ కోసం 26,300 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" కన్నా పైన నిలదొక్కుకోవాలి. 25,800 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత తప్పదు.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	26,160, 26,300
మద్దతు	25,860, 25,800



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

మెకానిక్‌లకు అన్ని వసతులు కల్పిస్తాం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తూర్పు నియోజకవర్గంలోని మెకానిక్‌లకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే నసీర్ హమీ ఇచ్చారు. ఆటోనగర్‌లో త్వరలో స్కిల్ కమ్యూనికేషన్ సెంటర్ ఏర్పాటు చేయబోతున్నామని ఆయన తెలిపారు. గుంటూరు టూ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో నిర్వహించిన 21వ వార్షికోత్సవ కార్యక్రమానికి అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు మక్కపల్లి రమేష్‌తో కలిసి ఎమ్మెల్యే నసీర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, మెకానిక్‌లు ఎప్పటికప్పుడు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ వృత్తిలో పట్టు సాధించాలని సూచించారు. కొన్ని రోజుల క్రితం కోయంబత్తూర్‌లో పర్యటించానని, అక్కడ అత్యంత పోటీతత్వ బ్రిడ్జికి ఒక మెకానిక్ పేరు పెట్టారని తెలిపారు. తూర్పు నియోజకవర్గంలో మెకానిక్‌ల కోసం ఒక కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే నసీర్ హామీ ఇచ్చారు. గుంటూరు టూ వీలర్స్ మెకానిక్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికల అభివృద్ధికి చర్యలు

శ్మశానవాటికల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే నసీర్ చెప్పారు. పాత గుంటూరు హిందూ శ్మశాన వాటికకు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ, జాయ్ ఎన్‌జాయ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మార్చురీ ఏసీ బాక్స్‌ను అందించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ, సమాజ సేవలో ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు.

బాపు తెలుగును వెలిగించిన మహనీయుడు

● డాక్టర్ గజల్ శ్రీనివాస్

గుంటూరు (తూర్పు), డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తన సినిమాల ద్వారా, చిత్రాల ద్వారా, బొమ్మల ద్వారా తెలుగును వెలిగించిన మహనీయుడు బాపు అని గజల్ గాయకుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ కొనియాడారు. స్థానిక బెల్లెక్రెట్ బంగ్లా రోడ్డులో కళాదీపిక విద్యాభవన్‌లో ఆదివారం బాపు-రమణ-బాలు కళాపీఠం, మల్లెతీగ సంయుక్త ఆధ్వర్యంలో బాపు జయంతి, బాపు స్మారక పురస్కారాల సభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన గజల్ శ్రీనివాస్ మాట్లాడారు. తెలుగు సంస్కృతి ఉన్నంత వరకు బాపు సినిమాలు, చిత్రాలు, కార్టూన్లు సజీవంగా ఉంటాయన్నారు. తెలుగును అధికార భాష కంటే ముందు మమకార భాషగా గుర్తించాలన్నారు. బాపు-రమణ-బాలు కళాపీఠం వ్యవస్థాపకుడు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, ఆత్మీయ అతిథిగా సుప్రసిద్ధ రచయిత డాక్టర్ ఎం.ప్రభాకర్, సమాఖ్య గుంటూరు కార్యదర్శి ఎన్వీఎస్ లక్ష్మీనారాయణ, మల్లెతీగ కలిమిశ్రీ బాపు ప్రతిభను గుర్తు చేసుకున్నారు. అనంతరం సినీ దర్శకుడు వర ముళ్ళపూడి, చిత్రకారుడు అనకపల్లి గిరిధర్, కార్టూనిస్టు హరి వెంకటరమణకు బాపు స్మారక పురస్కారాలను అందజేశారు. సాహితీవేత్తలు, కవులు పాల్గొన్నారు.



సినీ దర్శకుడు ముళ్లపూడికి బాపు స్మారక పురస్కారం అందజేస్తున్న గజల్ శ్రీనివాస్, రమణ యశస్వి తదితరులు

దేహమే.. దేవాలయ భావనతో జీవితాన్ని కొనసాగించాలి

● ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దేహమే దేవాలయం అన్న భావనతో జీవితాన్ని కొనసాగించడమే రాజనీతికి అంతిమ ప్రస్థానమని ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అన్నమయ్య కళా వేదికపై గుళ్లపల్లి సేవా సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న గరికపాటి ప్రవచనాలు ఆదివారంతో ముగిసాయి. చివరి రోజున ఆముక్తమాల్యద రాజనీతి అంశంపై డాక్టర్ గరికపాటి ప్రవచిస్తూ.. రాజైనవాడు తన పాలనలో ఆశ్రిత పక్షపాతాలకు తావీవ్వకుండా ఆత్మసిద్ధితో నిర్ణయాలు తీసుకోవడంలో రాజు రాజర్షిగా వ్యవహరించాలని అన్నారు. విమర్శలను తట్టుకొని సమస్యలకు పరిష్కారం కోసం ధర్మ మార్గాన్ని ఎంచుకోవాలని ఆముక్తమాల్యద ద్వారా రాజనీతిజ్ఞత శ్రీకృష్ణదేవరాయలు ఆచరణలో చూపాడన్నారు. అవిశ్వాస తీర్మానం కుట్రతో టంగుటూరి ప్రకాశం, ఒక్క ఓటు తేడాతో మాజీ ప్రధాని వాజ్‌పేయి రాజీనామాలు చేసి రాజనీతిజ్ఞతను చాటుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షుడు మస్తానయ్య, సేవా సంస్థ కన్వీనర్ గుళ్లపల్లి రాఘవేంద్రరావు శ్రీలక్ష్మి దంపతులు, చైత్రన్, చిట్టినేని శివ కోటేశ్వరరావు, పారా అశోక్ కుమార్, గూడవల్లి లక్ష్మీనారాయణ పాల్గొని గరికపాటిని ఘనంగా సత్కరించారు.



గరికపాటి నరసింహారావును సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు

జనవరి 28 నుంచి ప్రవచనాలు

వచ్చే ఏడాది జనవరి 28, 29, 30 తేదీలలో పట్టాభిపురం రమా సత్యనారాయణ స్వామి దేవస్థానంలో యోగా వాసిష్టంపై ప్రవచనాలు ఉంటాయని గరికపాటి నరసింహారావు తెలిపారు.

సమస్యలకు సాహిత్యమే పరిష్కారం

● ఆంధ్రప్రదేశ్ తెలుగు, సాంస్కృతిక అకాడమీ చైర్మన్ ఆర్‌డీ విల్సన్

గుంటూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంలో కనపడని సమస్యలకు సాహిత్యమే పరిష్కారమని ఆంధ్రప్రదేశ్ తెలుగు, సాంస్కృతిక అకాడమీ చైర్మన్ ఆర్‌డీ విల్సన్ అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయం ధార్మిక ప్రాంగణంలో ఆదివారం 16వ సోమేపల్లి సాహితీ పురస్కారాల సభ ఘనంగా జరిగింది. రమ్య భారతి సాహిత్య పత్రిక నిర్వాహకులు చలపాక ప్రకాష్, దివంగత సోమేపల్లి వెంకట సుబ్బయ్య కుమారుడు వశిష్టల ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన విల్సన్ మాట్లాడుతూ, రాజ్యాంగంలో లేని ఎన్నో సమస్యలను పరిష్కరించటానికి అత్యుత్తమ మార్గం సాహిత్యమే అన్నారు. రమ్యభారతి త్రైమాసిక పత్రిక గౌరవాధ్యక్షులు వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ మనలో అంతర్లీనంగా ఉన్న సాహిత్యాన్ని వెలికి తీయడానికి ఒక వేదికను ఏర్పాటుచేసిన మహావ్యక్తి సోమేపల్లి వెంకట సుబ్బయ్య అని, అదే బాటలో ఆయన కుమారుడు నడుస్తున్నారన్నారు. అనంతరం కథల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షులు డాక్టర్ సి.భవాని దేవీ, ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం సుభాని, కోశాధికారి నానా, ప్రముఖ కథకులు శ్రీకంఠస్ఫూర్తి, సాహితీవేత్తలు పాపినేని శివశంకర్, రావెల సాంబశివరావు, సిహెచ్ సుశీలమ్మ, పెనుగొండ లక్ష్మీనారాయణ, శివప్రసాద్, తోటకూర వెంకట నారాయణ పాల్గొని పురస్కార గ్రహీతలను ఆశీర్వదించారు.



విజేతలకు సాహితీ పురస్కారాలు అందిస్తున్న విల్సన్, హజరత్తయ్య గుప్తా, వశిష్ట తదితరులు

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల పల్లెబాట

గుంటూరు(విద్య), డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్‌అండ్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పల్లెబాట పట్టారు. ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల్లో గ్రామీణ ప్రాంత ప్రజానీకంతో మమేకం కావడంతోపాటు అక్కడ సమస్యల్ని పరిష్కరించేందుకు తమవంతు సహకారం అందిస్తున్నారు. రూరల్ మండల పరిధిలోని తిక్కిరెడ్డిపాలెం, కోయవారిపాలెం, కొర్నెపాడు, బొర్రావారిపాలెం గ్రామాలలో క్యాంపులు కొనసాగించారని ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ వెల్లడించారు.

పునర్వినియోగ వనరులను వినియోగించుకోవాలి

● జిల్లా పర్యావరణ ఇంజనీరు నజీనా బేగం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రత్యామ్నాయ, పునర్వినియోగ ఇంధన వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని జిల్లా పర్యావరణ ఇంజనీర్ నజీనా బేగం పిలుపునిచ్చారు. జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ కేంద్రం, చలపతి ఫార్మసీ కాలేజీ సౌజన్యంతో ఆదివారం నగరంలో గ్రీన్ ఇండియా రన్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హార్ట్‌ఫుల్ నెస్ మెడిటేషన్ కేంద్రం జోనల్ కో-ఆర్డినేటర్ రామ కోటేశ్వరరావు, పర్యావరణ, జిల్లా కో ఆర్డినేటర్ డి.తిరుపతిరెడ్డి, చలపతి కళా శాల ప్రిన్సిపాల్ రామారావు, మెడిటేషన్ కేంద్ర వలంటీర్లు, చలపతి ఫార్మసీ కాలేజీ విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న నజీనా బేగం, పాల్గొన్న విద్యార్థులు, అధికారులు

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాలతో పాటు, విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదిగే విధంగా రోటరీ సభ్యులు ఎంతోగానో కృషి చేస్తోందని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర ప్రశంసించారు. రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆధ్వర్యంలో నిర్వ హించే యువజన క్రీడోత్సవాలు - రోటోఫెస్ట్ 2025 వేడుకను ఆదివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, క్లబ్ అధ్యక్షుడు నంబూరు ఎస్ ఆర్ కృష్ణమూర్తి, క్లబ్ సభ్యులు గార్లపాటి రవి కిరణ్, ముప్పవరపు వెంకట సత్యనారాయణ, కనమర్లపూడి రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు సహకరించాలి

గుంటూరు(విద్య),డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయా సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన భీమినేని వందనాదేవిని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్‌యూఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.జగదీష్ కుమార్, జిల్లాకార అధ్యక్షుడు పసల బాల స్వామి, సహాధ్యక్షులు శ్రీధర్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా ముగిసిన క్రెడాయ్ ప్రాపర్టీ షో

గుంటూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): గుంటూరు క్రెడాయ్ ఆధ్వర్యంలో రింగ్ రోడ్డులోని సిద్ధార్థ గార్డెన్స్‌లో మూడు రోజులుగా జరుగుతున్న 8వ ప్రాపర్టీ షో ఆదివారంతో ముగిసింది. ముగింపు సందర్భంగా తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్ హాజరై మూడు రోజులుగా ప్రజలకు నిర్మాణ రంగంలో ఉపయోగపడే విధంగా ప్రాపర్టీ షో నిర్వహించటం, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, గుంటూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌ల ఉన్నతాధికారులను క్రెడాయ్ సంస్థ నాయకులు ఆళ్ళ శివారెడ్డి, ఆరుమళ్ళ సతీష్‌రెడ్డి, మామిడి రాము, మెట్టు సాంబశివారెడ్డి, ఏవీ నాగార్జునరెడ్డి, తియ్యగూర వినోదరెడ్డిలు శాలువాతో సత్కరించారు. మాజీ చైర్మన్ ఆళ్ళ శివారెడ్డి మాట్లాడుతూ గుంటూరు పరిసర ప్రాంతాల్లో క్రెడాయ్ ప్రాపర్టీ షోలో పెద్ద ఎత్తున వ్యాపార లావాదేవీలు నిర్వహించటం సంతోషదాయకమన్నారు. ప్రాపర్టీ షోలో స్టాల్స్ ఏర్పాటు చేసుకున్న బ్యాంకర్లకు, బిల్డర్స్‌కు, రియల్ ఎస్టేట్ సంస్థలు, ఐరన్ సంస్థలు, పెయింట్, సిమెంట్ వంటి వివిధ నిర్మాణ రంగాలకు ఉపయోగపడే వారిందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం కూడా పది బంపర్ డ్రాలు నిర్వహించామని, గెలుపొందిన కస్టమర్లకు బహుమతులు అందజేశామని, అలానే వేలాది పూల మొక్కలను అందించామన్నారు.



కస్టమర్లకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్, పక్కన రాము, శివారెడ్డి తదితరులు

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు : ఎస్పీ

గుంటూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. ఎస్పీ ఆదే శాల మేరకు ఆదివారం సాయంత్రం జిల్లా వ్యాప్తంగా ఈవ్‌టీజింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఆకతాయిలు, రోడ్లపై అనవసరంగా తిరిగేవారు, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడే వారిని గుర్తించి అక్కడికక్కడే కౌన్సెలింగ్ ఇచ్చారు.

రాజకీయ రిజర్వేషన్ల సాధనకు ఉద్యమించాలి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మైదాన ప్రాంత గిరిజనుల రాజకీయ రిజర్వేషన్ల సాధనకు చేసే ప్రజా చైతన్య యాత్రలో ప్రతి ఒక్కరూ కలిసి రావాలని గిరిజన ప్రజా సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఎస్టీ కమీషన్ సభ్యుడు వడిత్యా శంకర నాయక్ కోరారు. స్థానిక అంబేడ్కర్ భవన్లో ఆదివారం గిరిజన ప్రజా చైతన్య యాత్ర గోడపత్రికలను ఆవిష్కరించి, వివరాలను వెల్లడించారు. తమ హక్కుల సాధనకు ఈ నెల 28న గుంటూరులోని అంబేడ్కర్ భవన్లో నిర్వహించే రౌండ్ టేబుల్ సమావే శానికి జిల్లా నలుమూలల ఉన్న గిరిజనులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హనుమంతు నాయక్, దుర్గా నాయక్, అంజి నాయక్, కళ్యాణ్, భాస్కర్, సతీష్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



గోడప్రతులను ఆవిష్కరిస్తున్న వడిత్యా శంకర్ నాయక్ తదితరులు

రాష్ట్రానికి ఇంధన సంరక్షణ అవార్డు

▸▸ రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్న ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్

అమరావతి, డిసెంబరు 14 (ఆంధ్రప్రదేశ్): ఇంధన పరిరక్షణ, సామర్థ్యంలో రాష్ట్రం సాధించిన జాతీయ ఇంధన సంరక్షణ అవార్డును ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ అందుకున్నారు. జాతీయ ఇంధన సంరక్షణ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనకు ఈ అవార్డును అందజేశారు. స్టేట్ డిసిగ్నేటెడ్ ఏజెన్సీ(ఎస్డీఏ) విభాగం గ్రూప్-2లో ఏపీ మొదటి బహుమతి సాధించి దేశవ్యాప్తంగా సత్తా చాటింది.



రాష్ట్రపతి ముర్ము నుంచి అవార్డు అందుకుంటున్న ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్

ఏపీలో మనిషి సగటు జీవిత కాలం 70 ఏళ్లు

▸▸ పురుషులు 68 ఏళ్లు.. మహిళలు 73 ఏళ్లు

▸▸ పండ్లు, చేపల ఉత్పత్తిలో రాష్ట్రానికి మొదటి స్థానం

▸▸ ఆర్బీఐ తాజా నివేదికలో వెల్లడి

అమరావతి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో మనిషి సగటు జీవిత కాలం 70 సంవత్సరాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తాజా నివేదికలో పేర్కొంది. రాష్ట్రంలో 2019-23 మధ్య నమోదైన జనన, మరణాల వివరాల ప్రకారం.. మనిషి సగటు జీవిత కాలం 70 ఏళ్లని తేల్చింది. ఇందులో పురుషుల సగటు జీవిత కాలం 68 ఏళ్లుగా, మహిళల సగటు 73 ఏళ్లుగా ఉంది. పురుషుల కంటే మహిళల సగటు ఐదేళ్లు ఎక్కువగా ఉంది. జాతీయ సగటు జీవిత కాలం 70 ఏళ్లతో సమానంగా ఏపీ నిలిచింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వివిధ రంగాల్లో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు సాధించిన పురోగతి గణాంకాలను ఆర్బీఐ తాజాగా విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం వివిధ రంగాల్లో ఏపీ అగ్రస్థానంలో నిలిచింది. దేశం మొత్తమ్మీద పండ్లు, చేపల ఉత్పత్తిలో ఏపీ మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. పండ్ల తోటల పెంపకంలో రెండో స్థానంలో నిలిచింది. కోటీ 93 లక్షల టన్నుల పండ్లు ఉత్పత్తి చేస్తూ ఏపీ ప్రథమ స్థానంలో నిలవగా, కోటీ 68 లక్షల టన్నుల ఉత్పత్తితో మహారాష్ట్ర రెండో స్థానం సాధించింది. 8.96 లక్షల హెక్టార్లలో పండ్ల తోటలు సాగు చేస్తున్న మహారాష్ట్ర తొలి స్థానంలో, 8.07 లక్షల హెక్టార్లలో పండ్ల తోటలు సాగుచేస్తున్న ఏపీ రెండో స్థానంలో నిలిచాయి. 51.58 లక్షల టన్నుల చేపల ఉత్పత్తితో ఏపీ దేశంలో అగ్రస్థానంలో నిలవగా.. 22.02 లక్షల టన్నుల ఉత్పత్తితో పశ్చిమబెంగాల్ రెండో స్థానం సాధించింది. ప్రస్తుత ధరల వద్ద ఏపీ స్థూల ఉత్పత్తి 2024-25లో రూ.15.93 లక్షల కోట్లుగా ఉన్నట్లు ఆర్బీఐ తెలిపింది. ఏపీ తలసరి జీఎస్డీపీ రూ.2.66 లక్షలుగా ఉంది. విద్యుత్ ఉత్పత్తిలో ఏపీ దేశంలో 14వ స్థానంలో నిలిచింది. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో ఏపీ పక్కనున్న తెలంగాణతో కలిసి 74 మార్కులతో 10వ స్థానం దక్కించుకుందని ఆర్బీఐ నివేదిక వెల్లడించింది.

జగన్ హయాంలో ఎక్కడా లేనంత అవినీతి!

▸▸ రాష్ట్రానికి తీరని నష్టం

▸▸ గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు ఆవేదన



విజయనగరం రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో ఎంతో అవినీతి జరిగిందని, ప్రపంచంలోనే ఈస్థాయి అవినీతి మరెక్కడా జరగలేదని గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు పేర్కొన్నారు. విజయనగరంలోని క్షత్రియ పరిషత్ భవనంలో ఆదివారం ఆయనను క్షత్రియ పరిషత్ ఆధ్వర్యంలో సన్మానించారు. గజపతిరాజు మాట్లాడుతూ వైసీపీ పాలనలో అవినీతి వల్ల రాష్ట్రానికి తీరని నష్టం, ప్రజలకు తేరుకోలేని అన్యాయం జరిగిందన్నారు. విశాఖపట్నంలో 800 ఎకరాలు తీసుకున్నట్టు తనపైనా వైసీపీ ఆరోపణలు చేసిందని, అవి నిజం కాదని తెలిపారు. న్యాయస్థానాల్లో కేసులు కూడా వేశారని, ఒక్క ఆధారాన్ని కూడా కోర్టుకు వైసీపీ అందించలేకపోయిందని చెప్పారు. ప్రజాధనాన్ని దొంగతనం చేసి, 16 నెలలు జైల్లో ఉండి వచ్చిన వ్యక్తిని రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రిని చేయడం వల్ల 2019 నుంచి 2024 వరకూ రాష్ట్రానికి, ప్రజలకు ఎంతో నష్టం జరిగిందన్నారు. 2024 నుంచి రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని, ప్రజా సంక్షేమం కోసం కృషి జరుగుతోందని తెలిపారు.

అరటి ధరకు ఊపు!

▸▸ కిలో కనీసంగా రూ.10, గరిష్ఠంగా రూ.17

▸▸ ఉత్తరాది వ్యాపారుల రాకతో పుంజుకున్న మార్కెట్

▸▸ రాయలసీమ రైతులకు ఊరట

▸▸ గత నెలలో కిలో అరటి రూ.2కు పతనం



అమరావతి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అరటి ధర పుంజుకుంది. కిలో కనీసంగా రూ.10, గరిష్ఠంగా రూ.17కు చేరింది. రాయలసీమ జిల్లాల్లో పండిస్తున్న అరటిని ఉత్తరాది రాష్ట్రాల నుంచి పండ్ల వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. అరటి ధర మరింత పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. నాణ్యత లేని అరటి గత నెలలో కిలో రూ.2కు పడిపోగా.. కాస్త నాణ్యమైన అరటి కిలో రూ.7-8 దాకా పలికింది. దాదాపు నెల రోజుల పాటు ఎగుమతులు మందగించి, ధరలు పడిపోయాయి. ఇప్పుడు ఉత్తరాది వ్యాపారుల రాకతో కనీస ధర కిలోకు రూ.10కి చేరింది. తాజాగా పులివెందుల మార్కెట్‌లో గరిష్ఠ ధర రూ.16-17 దాకా పలికింది. గత నెల 20 నుంచి ఈ నెల 10 వరకు అరటి ధర పతనమైంది. సీమ ప్రాంతం నుంచి ఢిల్లీ, ముంబై, కోల్‌కతా వంటి పెద్ద మార్కెట్లకు ఎగుమతులు నిలిచిపోయాయి. ఈ ఏడాది మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లలో అరటి సాగు పెరిగి, నాణ్యమైన సరుకు తక్కువ ధరకు లభించడంతో వ్యాపారులు అక్కడి నుంచే ఎక్కువగా కొనుగోలు చేశారు. దీంతో కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో అరటికి డిమాండ్ లేకుండా పోయింది. ఎగుమతులు నిలిచిపోయి, తక్కువ ధరకు కూడా కొనేనాథుడు లేక రైతులు అరటి గెలలను పశువులకు మేతగా వదిలేయాల్సి వచ్చింది.

రైతుల ఆవేదనపై స్పందించిన సీఎం

దాదాపు నెల పాటు అరటి మార్కెట్‌లో సంక్షోభం నెలకొంది. అరటి రైతుల ఆవేదనపై స్పందించిన సీఎం చంద్రబాబు.. ఉద్యానశాఖ అధికారులను ఉత్తరాది రాష్ట్రాలకు పంపి, వ్యాపారులతో చర్చలు జరిపించారు. డిసెంబరు రెండో వారం నుంచి సీమ అరటిని కొనుగోలు చేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ మేరకు నాలుగైదు రోజుల నుంచి ఉత్తరాది వ్యాపారులు రాయలసీమ మార్కెట్లకు వస్తున్నారు. దీంతో కొనుగోళ్లు సాగుతుండటంతో అన్ని రకాల అరటి పండ్ల ధరలు టన్ను రూ.10 వేల పైనే పలుకుతున్నాయి. గరిష్ఠ ధర రూ.16 వేలు దాటింది. రాష్ట్రంలో లక్షా 30 వేల హెక్టార్లలో అరటి సాగులో ఉండగా, 87 లక్షల టన్నుల ఉత్పత్తి వస్తుందని అధికారులు అంచనా వేశారు. రాయలసీమ రైతులు గ్రాండ్9 రకం అరటిని 34 వేల హెక్టార్లలో పండిస్తున్నారు. ఈ ఏడాది రాష్ట్రం నుంచి 2 లక్షల టన్నుల అరటి ఎగుమతి లక్ష్యంగా పెట్టుకోగా, గత నెల మూడో వారంలో అరటి ధరల సంక్షోభం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు 70 వేల టన్నుల అరటిని వ్యాపారులు కొనుగోలు చేశారని ఉద్యాన శాఖ డైరెక్టర్ కే శ్రీనివాసులు ఆదివారం చెప్పారు. అరటి ధర మరింత పెరుగుతుందని, అరటి మార్కెట్‌ను ప్రతి రోజు సమీక్షిస్తున్నట్లు వివరించారు.

పుంజుకోని రబీ సాగు

▸▸ అంచనాల్లో 32 శాతం మించని వివిధ పంటల సాగు విస్తీర్ణం'

రాష్ట్రంలో రబీ సాగు మందకొడిగా సాగుతోంది. సీజన్ ప్రారంభమై రెండు నెలలైనా.. పంట విస్తీర్ణం 32 శాతం మించలేదు. ఈ సీజన్‌లో 20.70 లక్షల హెక్టార్లలో 22 రకాల పంటలు సాగవుతాయనే అంచనా ఉండగా, ఇప్పటి వరకు 6.57 లక్షల హెక్టార్లలో మాత్రమే పంటలు సాగులోకి వచ్చాయి. మొంథా, దిత్వా తుఫాన్ల కారణంగా వరి కోతలు ఆలస్యమై, దాళ్వా వరి సాగు ఆలస్యమౌతోంది. మరోవైపు కృష్ణా డెల్టా, సాగర్ కుడి కాల్వ కింద వరి సాగుకు నీటి గ్యారెంటీ లేకపోవడంతో రైతులు సందిగ్ధంలో ఉన్నారు. 7.45 లక్షల హెక్టార్లలో వరి సాగవ్వాల్సి ఉండగా.. ఇప్పటికి 1.33 లక్షల హెక్టార్లలోనే నాట్లు పడ్డాయి. ఈశాన్య రుతుపవనాలు, వరుస తుఫాన్లతో వర్షాలు విస్తారంగా కురిసినా.. మెట్ట ప్రాంతాల్లో చిరుధాన్యాలు, అపరాలు, నూనె గింజల సాగు పెద్దగా పుంజుకోలేదు. ప్రస్తుతం చిరుధాన్యాలు 2.97 లక్షల హెక్టార్లకు బదులు 1.21, నూనె గింజలు 1.25 లక్షల హెక్టార్లకు బదులు 0.21, అపరాలు 8.20 లక్షల హెక్టార్లకు బదులు 3.44 లక్షల హెక్టార్లలోనే విత్తనం పడింది. పత్తి, పొగాకు, మిర్చి సాగు కూడా అంతంత మాత్రంగానే ఉంది.


పీఎస్ఈల ఉద్యోగులకు నిధి పోర్టల్ ద్వారా చెల్లింపులు

▸▸ జనవరి నుంచే శ్రీకారం

అమరావతి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థ(పీఎస్ఈ)ల్లోని ఉద్యోగుల జీతభత్యాల చెల్లింపులను నిధి పోర్టల్ ద్వారా జరపాలని రాష్ట్ర ఆర్థిక శాఖ నిర్ణయించింది. ఈ మేరకు ఆ శాఖ కార్యదర్శి వినయ్ చంద్ అన్ని పీఎస్ఈలకు సర్క్యులర్ జారీ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలైన కార్పొరేషన్లు, కంపెనీలు, సొసైటీలు, అథారిటీలు, పట్టణాభివృద్ధి సంస్థలు, బోర్డులు, విశ్వవిద్యాలయాలు, ఇతర అటానమస్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల జీతభత్యాల చెల్లింపుల వివరాలు ప్రభుత్వం వద్ద ఒకే చోట అందుబాటులో లేవు. చాలా పీఎస్ఈలు జీతభత్యాల చెల్లింపుల కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను, మాన్యువల్ విధానాన్ని అవలంబిస్తున్నాయి. ఇలా ప్రభుత్వ రంగంలో జరుగుతున్న చెల్లింపులు ముక్కలుముక్కలుగా ఉండడం వల్ల మానవ వనరులపై పెడుతున్న ఖర్చును ప్రభుత్వం సరిగా అంచనా వేయలేకపోతోంది. దీనివల్ల ఆర్థిక నిర్వహణ దెబ్బతింటోంది. గతంలో ప్రభుత్వ రంగ సంస్థలు తమ వద్ద పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలను నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేశాయి. ఈ నేపథ్యంలో వారికి నిధి పోర్టల్ ద్వారా జీతభత్యాలు (డిసెంబరు నెలవి) జరపాలని నిర్ణయించారు. మొదటి దశలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ విద్యా సొసైటీ, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఆచార్య నాగార్జున, ఆదికవి నన్నయ్య, కృష్ణా యూనివర్సిటీలు, ఏపీ ఖాదీ, విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డుల్లోని ఉద్యోగులకు ఈ పోర్టల్ ద్వారా వేతనాలు (డిసెంబరు నెలవి) చెల్లించనున్నారు. మిగిలిన కార్పొరేషన్లు, కంపెనీలు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు, సొసైటీలు, అథారిటీలు, పట్టణాభివృద్ధి సంస్థలు, విశ్వవిద్యాలయాలు, ఇతర అటానమస్ సంస్థల్లోని ఉద్యోగులను వచ్చే జనవరి నుంచి ఇదే పోర్టల్ పరిధిలోకి తీసుకురానున్నారు. అంటే వారికి ఫిబ్రవరి నుంచి దీని ద్వారా జీతభత్యాలు చెల్లిస్తారు.

బెట్టింగ్ యాప్‌కు మరో యువకుడు బలి

▸▸ కంభంలో రైలు కిందపడి ఆత్మహత్య



కంభం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ భూతానికి మరో యువకుడు బలయ్యాడు. బెట్టింగ్ యాప్ నిర్వాహకుల వేధింపులు తాళలేక ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ప్రకాశం జిల్లా కంభంలో ఆదివారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. మార్కాపురం మండలం బిరుదుల నరవ గ్రామానికి చెందిన కిక్కిరి నరేంద్రరెడ్డి (23) మార్కాపురంలోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ పూర్తి చేశాడు. యాప్‌లో క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటు పడి సుమారు రూ.2 లక్షలకు పైగా అప్పు చేశాడు. బెట్టింగ్ యాప్ నిర్వాహకులు ఫోన్లు చేసి వేధించడం ప్రారంభించారు. దీంతో తట్టుకోలేక నరేంద్రరెడ్డి శనివారం రాత్రి మార్కాపురం నుంచి కంభం వచ్చాడు. ఆదివారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో సెల్‌ఫోన్ నుంచి కుటుంబ సభ్యులకు, స్నేహితులు, బంధువులకు తాను రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు మెసేజ్‌లు పెట్టాడు. అనంతరం తిరుపతి నుంచి వచ్చే రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. నరేంద్రరెడ్డి తండ్రి మునిరెడ్డి వ్యవసాయ కూలీ. తల్లి చిన్నప్పుడే చనిపోయినట్లు తెలిసింది. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడే నరసాపురానికి వందేభారత్

▸▸ రైల్వేస్టేషన్‌లో ప్రత్యేక ఏర్పాట్లు

▸▸ జెండా ఊపి ప్రారంభించనున్న కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ

నరసాపురం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): గత ఏడాదిగా ఇదిగో... అదిగో.. అంటూ ఊరిస్తున్న వందేభారత్ రైలు ఎట్టకేలకు పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం రానుంది. చెన్నై విజయవాడ మధ్య నడుస్తున్న ఈ రైలును నరసాపురం వరకు పొడిగించారు. దీంతో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ సోమవారం నరసాపురం రైల్వేస్టేషన్‌లో చెన్నై వెళ్లే ఈ రైలుకు జెండా ఊపి ప్రారంభించనున్నారు. దీనికోసం నరసాపురం రైల్వేస్టేషన్‌లో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. తొలి రోజున విజయవాడ నుంచి నరసాపురంలోని ఒకటో నంబరు ప్లాట్‌ఫాంకు ఈ రైలు రానుంది. నరసాపురం చేరుకోగానే వందేభారత్‌ను పూలదండలతో అలంకరించనున్నారు. ప్లాట్‌ఫాంపై తాత్కాలికంగా వేదిక నిర్మిస్తున్నారు. రైల్వే ఏజీఎం ప్రశాంత్‌కుమార్ ఆదివారంనరసాపురం స్టేషన్‌ను సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రైలు షెడ్యూల్ ఇలా..

విజయవాడ నుంచి నరసాపురానికి మధ్యాహ్నం 2.10 గంటలకు చేరుకుంటుంది. తిరిగి 07678 నంబరుతో మధ్యాహ్నం 2.50 గంటలకు నరసాపురంలో బయలుదేరి భీమవరం టౌన్ స్టేషన్‌కు 3.19 గంటలకు చేరుకుని బయలుదేరి వెళుతుంది. పశ్చిమగోదావరి జిల్లాలో ఈ రైలుకు రెండు హాల్ట్‌లు మాత్రమే ఇచ్చారు. జిల్లా నుంచి వెళ్లే తొలి వందేభారత్ రైలు కావడంతో ప్రయాణికుల్లో ఉత్సాహం నెలకొంది.



పిన్నెల్లి సోదరులు.. దాడులు, హత్యలు చేయించిన దుర్మార్గులు

▸ వారి కోసం కొవ్వొత్తుల ర్యాలీలు చేయాలా..?: బుద్దా వెంకన్న



విజయవాడ అర్బన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ చైర్మన్ పదవికి వేలం పెట్టి దాడులు, హత్యలు చేయించిన దుర్మార్గులు పిన్నెల్లి సోదరులని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న అన్నారు. విజయవాడలోని ఎంపీ కార్యాలయంలో ఆదివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఆదేశాలతో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలను అరెస్టు చేస్తే.. అది తప్పు, అన్యాయమని జగన్ మాట్లాడుతున్నాడని విమర్శించారు. టీడీపీ మద్దతుదారులను చంపేయాలని లక్ష్యంగా పెట్టుకున్న వ్యక్తులు పిన్నెల్లి సోదరులన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సామాజిక వర్గంపైన తెగబడిన దుర్మార్గులని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిన్నెల్లి సోదరులకు మద్దతుగా కొవ్వొత్తుల ప్రదర్శన చేయాలని, జైలుకు వెళ్లి పరామర్శించాలని జగన్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇద్దరు వ్యక్తులను కిరాతకంగా చంపిన పిన్నెల్లి సోదరులను వెనుకేసుకురావడం ఆయన నైజానికి నిదర్శనమన్నారు. అందుకే వైసీపీకి ప్రజలు 11 సీట్లు ఇచ్చారన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో కొడాలి నాని, పేర్ని నానిలు ఏదేదో వాగుతున్నారని.. ఒకరికి గుండెకాయ లేదు, మరొకరి ఊపిరితిత్తులు దెబ్బతిన్నాయని ఎద్దేవా చేశారు. ఇటువంటి వారు జగన్‌ను సీఎం చేస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారని విమర్శించారు. రాజశేఖరరెడ్డి బతికి వచ్చినా మళ్లీ జగన్ సీఎం కావడం కల అన్నారు.

నేడు ఢిల్లీకి లోకేశ్

▸ రాష్ట్ర సమస్యలపై కేంద్రమంత్రులకు వినతులు



అమరావతి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి లోకేశ్ సోమవారం ఢిల్లీలో పర్యటించనున్నారు. ఉదయం 8.30 గంటలకు ఢిల్లీ చేరుకోనున్న ఆయన నేరుగా పార్లమెంటు హౌస్‌కు వెళతారు. అక్కడ కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌లతోపాటు పలువురు కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర సమస్యలపై వినతిపత్రాలు అందజేస్తారు. రాత్రికి ఢిల్లీలోనే బస చేసి మంగళవారం ఉదయం ఢిల్లీ నుంచి నేరుగా విశాఖపట్నానికి చేరుకుంటారు. అక్కడ పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

పోలవరం క్షేత్రంలో టెస్టింగ్ కిట్లు పెంచండి

▸ టెక్నీషియన్ల సంఖ్యను కూడా: సీఎస్ఎంఆర్ఎస్

▸ ఈసీఆర్ఎఫ్ కోసం వాడుతున్న మట్టి, రాళ్ల నాణ్యత బాగుంది

▸ ఇక తరచూ పర్యవేక్షిస్తాం: శాస్త్రవేత్తలు

అమరావతి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు ప్రధాన నిర్మాణాలైన డయాఫ్రం వాల్, ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం పనులకు వాడుతున్న మట్టి, రాళ్ల నాణ్యతపై సెంట్రల్ సాయిల్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్) సంతృప్తి వ్యక్తంచేసింది. కీలక దశలో ఉన్న ఈ నిర్మాణాలకు సంబంధించి మట్టి, రాళ్ల నాణ్యతా పరీక్షల మోతాదును పెంచాలని సూచించింది. నాణ్యతా ప్రమాణాలను పరీక్షించే ల్యాబ్ టెక్నీషియన్ల సంఖ్యను కూడా పెంచాలని తెలిపింది. ప్రాజెక్టు ప్రాంతంలో క్షేత్రస్థాయి పర్యటన చేస్తున్న ఈ సంస్థ శాస్త్రవేత్తల బృందం ఆదివారం కూడా పరీక్షలు కొనసాగించింది. ఇప్పటికే 81శాతం మేర పూర్తయిన డయాఫ్రం వాల్ పనులపైన, దీనికోసం వాడుతున్న ప్లాస్టిక్-కాంక్రీట్ మిశ్రమం దృఢత్వంపైనా సంతృప్తి వ్యక్తంచేసింది. మిగిలిన 19శాతం పనులు వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి పూర్తి చేస్తామని ప్రాజెక్టు ఇంజనీర్లు తెలిపారు. భవిష్యత్‌లోనూ ఇదే నాణ్యత కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న ఐదు టెస్టింగ్ యంత్రాలను రెట్టింపు చేయడానికి, ల్యాబ్ టెక్నీషియన్లను కూడా పెంచేందుకు అంగీకరించారు. ఈసీఆర్ఎఫ్ డ్యాం పనులు కూడా చురుగ్గా ప్రణాళిక మేరకు జరుగుతున్నాయని.. 2027 జూన్ నాటికి పూర్తవుతాయని తెలిపారు. గోదావరి పుష్కరాల సమయానికి పోలవరం ప్రాజెక్టును ప్రారంభించగలమన్న ధీమా వ్యక్తంచేశారు.

క్యాబినెట్ ఆమోదం లేకుండానే అప్పులు: బుగ్గన

పంజాగుట్ట, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మంత్రివర్గం ఆమోదం లేకుండానే ఏపీలోని కూటమి ప్రభుత్వం విచ్చలవిడిగా అప్పులు చేస్తోందని మాజీ మంత్రి, వైసీపీ నేత బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ బాండ్లు తాకట్టుపెట్టి.. 9శాతానికిపైగా వడ్డీతో రూ.5,750 కోట్లు అప్పు తెచ్చిందన్నారు. ఇవే బాండ్లను తమ ప్రభుత్వ హయాంలో సంక్షేమం కోసం అమ్మకానికి పెడితే నానా రాద్ధాంతం చేశారని విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మద్యం ఆదాయాన్ని తాకట్టుపెట్టి అప్పులు తెస్తున్నా జీవో ఇవ్వడం లేదని అన్నారు. ఎక్సైజ్ శాఖ జీవో ఇవ్వలేదని.. క్యాబినెట్ ఆమోదం కూడా లేకుండా బాండ్లకు ప్రభుత్వం ఎలా గ్యారెంటీ ఇస్తుందని ప్రశ్నించారు. అప్పుల విషయంలో కూటమి నేతలు యాక్టర్ల కంటే ఎక్కువ నటిస్తున్నారని, అమరావతి కోసం రూ.40 వేల కోట్లు అప్పు చేశారని ఆరోపించారు.

వైద్య కళాశాలలకు 50 లక్షల రిసెర్చ్ ఫండ్

▸ క్రీడల ప్రోత్సాహానికి రూ.25 లక్షలు ఇచ్చే యోచన

▸ ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ చంద్రశేఖర్ వెల్లడి



అనంతపురం వైద్యం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): వ్యాధుల కారకాలు, వాటి నిర్మూలనపై పరిశోధనలు చేసేందుకు రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్యవిద్య కళాశాలలకు రూ.50లక్షల చొప్పున రిసెర్చ్ ఫండ్ ఇవ్వనున్నట్లు ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం అనంతపురం నగరంలోని కస్తూరి ఫిజియోథెరపీ ప్రైవేట్ కళాశాలలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. గ్రాడ్యుయేట్ విద్యార్థులకు చెల్లించే రిసెర్చ్ ఫెలోషిప్ మొత్తాన్ని రెట్టింపుచేసి, వారిని ప్రోత్సహిస్తున్నామన్నారు. వైద్య కళాశాలలకు రూ.50 లక్షల చొప్పున రిసెర్చ్ ఫండ్‌తో పాటు క్రీడలను ప్రోత్సహించేందుకు రూ.25 లక్షల చొప్పున ఇవ్వడానికి కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. డెంటల్, ఆయుష్ విద్యపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. ఇందులో భాగంగానే ఆయుష్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

తెనాలిలో ఆరు స్క్రబ్ టైఫస్ కేసులు

తెనాలి అర్బన్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ కేసులు పెరుగుతున్నాయి. గుంటూరు జిల్లా తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ఆరు స్క్రబ్ టైఫస్ కేసులు బయటపడ్డాయి. వారందరికీ చికిత్స అందిస్తున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి ఆదివారం తెలిపారు. స్క్రబ్ టైఫస్ బాధితుల్లో నలుగురు మహిళలు, ఇద్దరు పురుషులు ఉన్నారని చెప్పారు. రెండు రోజుల క్రితం చికిత్స పొందుతున్న ఒకరి ఆరోగ్యం మెరుగవ్వడంతో డిశ్చార్జ్ చేశామని చెప్పారు.

దక్షిణ భారతంపైకి చలిగాలులు

▸ అరకు లోయలో 4.4 డిగ్రీల ఉష్ణోగ్రత

విశాఖపట్నం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): వాయవ్య, మధ్య భారతంలో అధికపీడనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో సైబీరియా నుంచి వచ్చే శీతల గాలులు మధ్య భారతం, దానికి ఆనుకుని ఉన్న దక్షిణ భారతంపైకి వీస్తున్నాయి. చాలాకాలం తర్వాత చలిగాలులు తెలంగాణ, కోస్తా, రాయలసీమ, ఉత్తర కర్ణాటక మీదుగా తమిళనాడులోని పలు ప్రాంతాలకు విస్తరించాయి. వీటి ప్రభావంతో రాష్ట్రంలో చలి తీవ్రత కొనసాగుతోంది. దీనికితోడు అనేక ప్రాంతాల్లో మంచు దట్టంగా కురుస్తోంది. పది రోజుల నుంచి చలి గాలుల జోరు తగ్గలేదు. ఉత్తరకోస్తాలో ఏజెన్సీ ప్రాంతాలతోపాటు రాయలసీమలో అనేక ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. ఆదివారం అరకులోయలో 4.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మైదాన ప్రాంతంలోని శ్రీసత్యసాయి జిల్లా ఆర్.అనంతపురంలో 8.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.





'అభ్యుదయం' యాత్రలో హోంమంత్రి అనిత, డీఐజీ గోపీనాథ్ జెట్టి, విజయవాడలో జరిగిన ర్యాలీలో డీజీపీ గుప్తా, ఈగల్ ఐజీ రవికృష్ణ, సీపీ రాజశేఖర్ బాబు (ఫైల్)

'డ్రగ్స్ వద్దు బ్రో...'!

▸ పోలీసులు, ఈగల్ అవగాహన కార్యక్రమాలు

▸ మత్తుకు వ్యతిరేకంగా 'అభ్యుదయం' యాత్ర

▸ విద్యార్థులు, యువతతో కలిసి డ్రగ్స్‌పై సమరం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

డ్రగ్స్, గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు యువత, విద్యార్థుల జీవితాలను చిత్తు చేస్తున్నాయి. ఎన్నో దుష్పరిణామాలకు కారణమవుతున్నాయి. వీటిని సమూలంగా నిర్మూలించడానికి పోలీసులు, ఈగల్ బృందాలు అహర్నిశలు కృషి చేస్తున్నాయి. మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలను వివరించడంతో పాటు వివిధ శాఖల సమన్వయంతో 'డ్రగ్స్ వద్దు బ్రో' నినాదంతో అవగాహన కల్పిస్తున్నాయి. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా సరిగ్గా నెల క్రితం విశాఖ రేంజ్ పోలీసులు ప్రారంభించిన 'అభ్యుదయం' యాత్రలో హోంమంత్రి అనిత, డీఐజీ గోపీనాథ్ జెట్టి పాల్గొన్నారు. అలాగే విజయవాడ ర్యాలీలో డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, అనంతపురంలో ఎస్పీ జగదీశ్.. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి విద్యార్థులు, ప్రజలు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా గళమెత్తారు. ఎక్కడికక్కడ సైకిల్ ర్యాలీలు, సభలు, కళాజాతాల రూపాల్లో..

మత్తుకు దూరంగా ఉండండి

ప్రతి విద్యార్థి, యువకుడు తన కుటుంబానికి, ఈ దేశానికి ఉపయోగపడాలన్నది ప్రభుత్వ ఆకాంక్ష. గంజాయి, డ్రగ్స్ బారిన పడితే ఏదో ఒకరోజు పట్టుబడక తప్పదు. ఎన్‌డీపీఎస్ యాక్టు కింద అరెస్టయితే వారి జీవితంపై పిడుగు పడ్డట్లే.. కనీసం పదేళ్ల జైలు శిక్ష పడుతుంది. జీవితంలో కీలక సమయం కోల్పోతారు. దేశాన్ని ప్రేమించే వారైతే మత్తుకు దూరంగా ఉండండి. డ్రగ్స్, గంజాయిపై టోల్‌ఫ్రీ నంబరు 1072కు సమాచారం ఇవ్వండి.

- ఆకే రవికృష్ణ, ఈగల్ ఐజీ

'మా ఫ్రెండ్ క్లాస్ టాపర్. ఒక మంచి ఇంజనీర్ అవుతాడనుకున్నాం. అలాంటివాడు అనూహ్యంగా డ్రగ్స్‌కు బానిసగా మారాడు. చివరికి వాటిని సరఫరా చేస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. కోర్టు పదేళ్ల శిక్ష విధించడంతో విశాఖ సెంట్రల్ జైలు పాలయ్యాడు.'

- ఓ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థి ఆవేదన

'మా అబ్బాయిని మంచి ప్రయోజకుడిని చేద్దామనుకున్నా.. వాడు గంజాయికి అలవాటు పడ్డాడని తెలిసింది.. కౌన్సిలింగ్ ఇప్పించడంతో మత్తు మహమ్మారికి దూరమయ్యాడు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలపై ఓ కన్నేసి ఉంచాలి. లేకపోతే... డ్రగ్స్‌తో పాటు నేరాలకు కూడా అలవాటు పడితే మన కుటుంబమే కాదు.. సమాజమూ మూల్యం చెల్లించాల్సి వస్తుంది.'

- ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ఓ తండ్రి అనుభవం

'డ్రగ్స్ వద్దు బ్రో.. సైకిల్ తొక్కు బ్రో..', 'సిగరెట్టు- రోగానికి మొదటి మెట్టు.. గుట్కా- నరకానికి దగ్గరి దారి.. గంజాయి- శ్మశానంలో చోటు ఖరారు.. డ్రగ్స్- ఆ మూడింటికీ మించి..' అంటూ పోలీసులు, ఈగల్ బృందాలు ప్రచారం చేస్తున్నాయి. నవంబరు రెండో వారంలో రాష్ట్రవ్యాప్తంగా పోలీసుశాఖ మొదలుపెట్టిన అవగాహన ర్యాలీలు మత్తు రహిత ఆంధ్రప్రదేశ్ కోసం అన్ని వర్గాల్లోనూ చైతన్యం నింపుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఏపీ గంజాయి ఉత్పత్తి కేంద్రంగా, డ్రగ్స్ దిగుమతికి చిరునామాగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి ఉత్తరాంధ్రలో పది వేల ఎకరాలకు పైగా గంజాయి సాగవుతోంది. ఏడాదిలోనే దాన్ని కూకటి వేళ్లతో పెకిలించిన పోలీసులు... గంజాయి సాగుకు దూరంగా ఉంటామని గిరిజన రైతులతో ప్రమాణం చేయించారు. అయితే ఒడిశా నుంచి రవాణా కొనసాగుతుండటంతో రాష్ట్రంలో వినియోగం ఆశించిన మేర తగ్గలేదు. దీంతో ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి ఉత్తరాంధ్రలో జిల్లాల ఎస్పీలతో సమావేశమై 'సంకల్పం' పేరుతో ఏడాదిగా 19వేల చోట్ల 10.80 లక్షల మంది ప్రజలు, విద్యార్థులతో 4,700 విద్యాసంస్థల్లో చైతన్యం కల్పించారు. గంజాయి సాగు, సరఫరా, వినియోగంపై ఉక్కుపాదం మోపారు. జాగిలాలతో పాటు డ్రోన్లతో స్మగ్లర్లను పోలీసులు వెంటాడారు. ఇది మంచి ఫలితాలివ్వడంతో రాష్ట్రవ్యాప్తంగా 'డ్రగ్స్ వద్దు బ్రో.. సైకిల్ తొక్కు బ్రో..' అంటూ చైతన్య ర్యాలీలకు పోలీసు శాఖ శ్రీకారం చుట్టింది. ఏడాది చివరి వరకూ ఈ ప్రచారాన్ని కొనసాగిస్తామని, కొత్త సంవత్సరంలో మరో రూపంలో డ్రగ్స్ అరికట్టేందుకు ప్రజల్లోకి వెళతామని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి వినియోగం లేకుండా చేయడమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు.

సర్వస్వం కోల్పోతారు

స్నేహితులు, తెలిసినవారు ఒత్తిడి చేశారనో, ఆసక్తితోనో ఒకసారి మత్తుకు అలవాటు పడితే శారీరకంగా, మానసికంగానే కాదు మొత్తం జీవితాన్నే కోల్పోతారు. పిల్లల్ని నిరంతరం గమనిస్తూ ఉండాలి. వారి ప్రవర్తనలో తేడా కనివస్తే తల్లితండ్రులు వెంటనే అప్రమత్తం కావాలి. గంజాయి సాగు, నిల్వ, రవాణా మాత్రమే కాదు వినియోగించినా చట్టపరంగా చర్యలు తప్పవు.

- గోపీనాథ్ జెట్టి, విశాఖ రేంజ్ డీఐజీ

ఎవరో ఇచ్చారని తీసుకుంటే...

బెంగళూరులో వీకెండ్ పార్టీకి వెళ్లాం.. హైదరాబాద్‌లో ఫ్రెండ్స్‌తో పబ్‌కు వెళ్లాం.. అక్కడ ఎవడో రుచి చూపించాడు అని డ్రగ్స్ తీసుకుంటే చేజేతులా జీవితాన్ని నాశనం చేసుకున్నట్లే. మీరు తీసుకునే డ్రగ్స్ మీకు, మీ కుటుంబానికే కాదు సమాజానికి, దేశానికీ నష్టమే. డ్రగ్స్‌కు దూరంగా.. లక్ష్య సాధనకు దగ్గరగా ఉండండి.

- జగదీశ్, అనంతపురం జిల్లా ఎస్పీ





మేయర్ స్రవంతి కలెక్టర్‌కు పంపిన రాజీనామా లేఖ

నెల్లూరు మేయర్ రాజీనామాకు ఆమోదం

▸ గోవాకు చేరిన క్యాంపు రాజకీయం

▸ ఆశలు వదులుకున్న వైసీపీ నేతలు

నెల్లూరు(సిటీ), డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): నెల్లూరు మేయర్ పొట్లూరి స్రవంతి తన రాజీనామా లేఖను ఆదివారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా క్యాంపు కార్యాలయానికి పంపారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో ఆయన సూచన మేరకు క్యాంపు కార్యాలయంలో ఆయన చెప్పిన అధికారికి లేఖను అందజేసినట్లు ఆమె భర్త జయవర్ధన్ వెల్లడించారు. అనంతరం అదే లేఖను మీడియా ప్రతినిధులకు విడుదల చేశారు. ఆ లేఖను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం ఆమె రాజీనామాను ఆమోదిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. గత ప్రభుత్వంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో నెల్లూరులోని 54 కార్పొరేషన్ స్థానాలను వైసీపీ కైవసం చేసుకుంది. ఎస్టీ జనరల్ కేటగిరీలో భాగంగా ఆమె మేయర్‌గా బాధ్యతలు స్వీకరించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాకతో ఆమె భర్త జయవర్ధన్ అవినీతి బాగోతం బట్టబయలయ్యాక అతను రెండు పర్యాయాలు జైలు జీవితం గడిపారు. ఆమె పదవి నాలుగేళ్లు పూర్తికావడంతో ఇటీవల అవిశ్వాసం పెడుతూ కార్పొరేటర్లు నోటీసులు ఇచ్చారు. ఆమెను పదవి నుంచి దించాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 18న అవిశ్వాసం పెడుతూ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. తనకు బలం లేదని గ్రహించిన ఆమె తన పదవికి రాజీనామా చేశారు. ఆమె కలెక్టర్‌కు పంపిన లేఖను ప్రభుత్వం ఆమోదించడంతో ఆమె శకం ముగిసినట్లయింది. కాగా, 18న జరగాల్సిన అవిశ్వాస సమావేశం సాధారణ సమావేశంగా జరుగుతుందని కార్పొరేషన్‌లోని కొందరు అధికారులు తెలిపారు.

ఆచితూచి టీడీపీ పెద్దల అడుగులు

ఇంతటితో మేయర్ వివాదానికి తెర పడిందని అందరూ భావిస్తున్నా, టీడీపీ పెద్దలు మాత్రం ఆచితూచి అడుగులు వేస్తున్నారు. మేయర్ తన రాజీనామాను కలెక్టర్ పేరుతో ఇవ్వడంపై ఆరా తీస్తున్నారు. న్యాయబద్ధంగా మేయర్ రాజీనామా చేయాల్సి వస్తే ఆ లేఖను ఎవరికి ఇవ్వాలి? అది అక్కడ్నుంచి ఎవరికి వెళ్తుంది? ఆపై చర్యలు ఏముంటాయోనని ఆరా తీస్తున్నారు. కాగా, అటు టీడీపీకి చెందిన కార్పొరేటర్లు, వైసీపీ నుంచి టీడీపీలో చేరిన కార్పొరేటర్ల బృందం తిరుపతి నుంచి ఆదివారం సాయంత్రం గోవాకు చేరుకుంది. ఇక్కడి పరిస్థితులను బట్టి వారిని తిరిగి నెల్లూరుకు తీసుకువచ్చేందుకు టీడీపీ పెద్దలు రంగం సిద్ధం చేశారు. మేయర్ రాజీనామాపై స్పష్టత వచ్చాకే వారంతా నెల్లూరు చేరుకుంటారని తెలుస్తోంది. మేయర్ రాజీనామా ప్రకటనతో అవిశ్వాసంపై వైసీపీ ఆశలు వదులుకుంది. తనకున్న అతికొద్దిమంది కార్పొరేటర్లపై కట్టడిని వదిలేసింది.

బకాయిలు గట్టెక్కేదెలా?

(మొదటి పేజీ తరువాయి)

తిరిగి ఎలా చెల్లిస్తారు? ప్రభుత్వం కూడా ష్యూరిటీ ఇవ్వడం లేదు. ఒకవేళ అది హామీ ఇవ్వాలన్నా సాధ్యంకాదు. ఇప్పటికే ప్రభుత్వం ద్రవ్య జవాబుదారీ-ఆర్థిక నిర్వహణ (ఎఫ్ఆర్‌బీఎం) పరిమితికి చేరువైంది. పోనీ నెట్‌వర్క్ ఆస్పత్రుల ఆస్తులు తాకట్టు పెడతారా..? అందుకు అవి అంగీకరిస్తాయా' అని ప్రశ్నించారు. వీటికి అధికారులు సమాధానం చెప్పలేకపోయారు. నెట్‌వర్క్ ఆస్పత్రుల బకాయిలు చెల్లించడం ప్రశ్నార్థకంగా మారింది.

అవగాహన లేకుండా హామీ..

సాధారణంగా ప్రభుత్వంలో పనిచేసే అధికారులు.. ఏదైనా హామీ ఇచ్చే సమయంలో సాధాసాధ్యాలను పరిశీలించిన తర్వాత ముందుకెళ్తారు. కానీ ట్రస్టులకు బ్యాంకులు రుణాలు ఇస్తాయా ఇవ్వవా అన్న విషయంలో కనీస అవగాహన లేకుండా.. అప్పు తెచ్చి రెండు నెలల్లో బకాయిలు చెల్లిస్తామని ఆరోగ్య శాఖ, వైద్య సేవ ట్రస్టు అధికారులు నెట్‌వర్క్ ఆస్పత్రులకు హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకే స్పెషాలిటీ ఆస్పత్రుల అసోసియేషన్ (ఆషా) సమ్మె విరమణకు అప్పట్లో అంగీకరించింది. ఇప్పుడు బ్యాంకర్ల తీరుతో పరిస్థితి తలకిందులు కావడంతో ట్రస్టు అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అప్పుల కోసం బ్యాంకర్లతో మాట్లాడుకోవాలని ట్రస్టుకు సూచించిన ఆర్థిక శాఖ.. తిరిగి చెల్లించే విషయంలో హామీ ఇవ్వకపోవడంతో బ్యాంకర్లు.. రుణమివ్వడానికి నిరాకరించాయి.

ట్రస్టు సొమ్ము ఏపీ మెర్క్‌కు..

వాస్తవానికి నెట్‌వర్క్ ఆస్పత్రుల బకాయిలు రూ.2,400 కోట్లే. కానీ ట్రస్టు అధికారులు ఏపీ మెర్క్(ఆంధ్రప్రదేశ్ వైద్య విద్య- పరిశోధన కార్పొరేషన్)కు చెల్లించాల్సిన రూ.600 కోట్లను కూడా కలిపి మొత్తం 3వేల కోట్లు రుణంగా తీసుకోవాలని భావించారు. గత జగన్ ప్రభుత్వం కొత్త మెడికల్ కాలేజీల కోసం ఏపీ మెర్క్‌ను ఏర్పాటు చేసింది. ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు (అప్పటి ఆరోగ్యశ్రీ ట్రస్టు)లో రోగుల కోసం కేటాయించిన నిధుల్లో 15 శాతాన్ని.. అంటే రూ.600 కోట్లకు పైగా ఈ కార్పొరేషన్‌కు బదలాయించింది. ఫలితంగా ప్రభుత్వాస్పత్రుల్లో పేద రోగులకు అందించే వైద్యం నాణ్యత తగ్గిపోయింది. కొత్త మెడికల్ కాలేజీల కోసం రోగులను నిర్లక్ష్యం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ట్రస్టు నుంచి ఏపీ మెర్క్‌కు ఒక్క రూపాయి కూడా బదలాయించలేదు. అయితే అప్పట్లో ఇచ్చిన 600 కోట్లను కూడా కలిపి ట్రస్టు అధికారులు రూ.3 వేల కోట్ల బకాయిలు చూపిస్తున్నారు. ఆస్పత్రులకు ఇవ్వాల్సిన 2,400 కోట్లలోనూ అధిక మొత్తం బకాయిలు (రూ.1,500 కోట్లు) టాప్-50 ఆస్పత్రులకే చెల్లించాల్సి ఉంది. వీటికోసం రుణం తీసుకోవడం కంటే.. వాటితో చర్చించి.. నిర్దిష్ట సమయంలోగా సర్దుబాటు చేస్తామని ఒప్పందానికి రావాలని నిపుణులు సూచిస్తున్నారు.

రోగులకు తొలి ప్రాధాన్యం..

మరోవైపు.. ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ రోగులకు సేవల విషయంలో మాత్రం ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం లేదు. రోగులకు ఇబ్బందులు ఎదురుకాకూడదనే.. ప్రతి నెలా ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టుకు దాదాపు రూ.300 కోట్ల వరకూ విడుదల చేస్తోంది. నెట్‌వర్క్ ఆస్పత్రులు సమ్మె విరమించిన తర్వాత క్రమం తప్పకుండా వాటి ఖాతాల్లో నిధులు జమవుతున్నాయి. ఈ నేపథ్యంలో బకాయిల విషయంలోనూ తొలుత చిన్న ఆస్పత్రులకు చెల్లింపులు జరిపి.. పెద్ద ఆస్పత్రులకు వాయిదాల రూపంలో చెల్లించడం ద్వారా ఆర్థిక భారం తగ్గించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

నేడు శాంతివనానికి బాబు

▸ వెల్‌నెస్, మెడిటేషన్ సెంటర్‌ను పరిశీలించనున్న ముఖ్యమంత్రి

▸ సాయంత్రం బెజవాడలో అమరజీవి 'ఆత్మార్పణ దినం' కార్యక్రమానికి హాజరు

అమరావతి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్ మండలంలో ఉన్న కన్హా శాంతి వనాన్ని సందర్శించనున్నారు. సోమవారం ఉదయం జూబ్లీహిల్స్‌లోని తన నివాసం నుంచి బయల్దేరి 11 గంటలకు శాంతివనం చేరుకుంటారు. ఆశ్రమం అధ్యక్షుడు కమలేశ్ డి.పటేల్ దాజీతో సమావేశమవుతారు. రెండు గంటలు అక్కడే ఉండి.. వెల్‌నెస్, మెడిటేషన్ సెంటర్, యోగా కేంద్రాలను తిలకిస్తారు. ట్రీ కన్జర్వేషన్ సెంటర్, రెయిన్ ఫారెస్ట్ కేంద్రం, మెడిటేషన్ సెంటర్, బయోచార్ కేంద్రం, పుల్లెల గోపీచంద్ స్టేడియంతో పాటు హార్ట్‌ఫుల్‌నెస్ ఇంటర్నేషనల్ స్కూలును సందర్శిస్తారు. అనంతరం శాంతివనం వ్యవస్థాపకుడు దాజీ నివాసానికి వెళ్తారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో 1,400 ఎకరాల్లో కన్హా శాంతి వనాన్ని శ్రీరామచంద్ర మిషన్ అభివృద్ధి చేసింది. ప్రపంచంలోనే అతిపెద్ద మెడిటేషన్ సెంటర్ ఇక్కడ ఉంది. అంతేగాక.. 8 లక్షలకు పైగా వివిధ జాతుల వృక్షాలతో బయోడైవర్సిటీ కేంద్రంగా ఈ ఆశ్రమం పర్యాటకులను పెద్దసంఖ్యలో ఆకర్షిస్తోంది. యువతను గ్లోబల్ లీడర్లుగా తయారు చేసేందుకు ఈ ఆశ్రమం అధ్యక్షుడు దాజీ నేతృత్వంలో 'హార్ట్ ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లీడర్‌షిప్'ను ఇక్కడ నిర్వహిస్తున్నారు. 'కౌశలం' పేరిట శిక్షణ కార్యక్రమాలను చేపడుతున్నారు. కన్హా శాంతివనంలోని సుస్థిర వ్యవసాయ క్షేత్రాన్ని కూడా చంద్రబాబు సందర్శించనున్నారు. అనంతరం ఆయన అమరావతికి చేరుకుంటారు. సాయంత్రం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తున్న అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినం కార్యక్రమానికి హాజరవుతారు.

'ఏ టేల్ ఆఫ్ టు స్టేట్స్' పుస్తకాన్ని ఆవిష్కరించిన సీఎం

▸ రచయిత సీనియర్ జర్నలిస్టు ఐ.వెంకట్రావు



ఆదివారం హైదరాబాద్‌లో 'ఏ టేల్ ఆఫ్ టు స్టేట్స్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చంద్రబాబు. చిత్రంలో ప్రముఖ రచయిత ఐ.వెంకట్రావు, ఎన్.అనూరాధ, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి కె.చంద్రహాస్, పబ్లిషర్లు ఐ.వేణు, ఐ.రఘు

అమరావతి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ జర్నలిస్టు ఐ.వెంకట్రావు రాసిన 'ఏ టేల్ ఆఫ్ టు స్టేట్స్' పుస్తకాన్ని సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. ఆదివారం హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. 'విలీనం-విభజన' పేరుతో అదే పుస్తకానికి తెలుగు అనువాదాన్ని కూడా ఆయన ఆవిష్కరించారు. దీనిని తెలుగులోకి అనువదించిన ఎన్.అనూరాధను సీఎం అభినందించారు. ఈ పుస్తకం భావితరాలకు, పరిశోధకులకు ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల విలీనం, విభజనతో పాటు రెండు రాష్ట్రాలను పాలించిన 22 మంది సీఎంల పాలనా కాలాన్ని కూడా ఈ పుస్తకంలో ప్రస్తావించారు. రచయిత, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి కె.చంద్రహాస్, పబ్లిషర్లు ఐ.వేణు, ఐ.రఘు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నాన్ ఎస్‌సీఎస్ కోటా 6 పోస్టుల భర్తీకి చర్యలు

▸ 29, 30 తేదీల్లో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

అమరావతి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): నాన్ సివిల్ సర్వీసెస్ కోటా ఐఏఎస్ పోస్టుల భర్తీకి లైన్ క్లియరైంది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 6పోస్టుల భర్తీకి ప్రభుత్వం 29మంది పేర్లను కేంద్రానికి పంపించింది. ఆ జాబితాలోని అభ్యర్థులకు రెండు విడతల్లో యూపీఎస్సీ ఇంటర్వ్యూలు నిర్వహించనుంది. ఈనెల 29వ తేదీన 15 మందికి, 30వ తేదీన 14 మందికి ఇంటర్వ్యూలకు హాజరు కావాలంటూ యూపీఎస్సీ నుంచి ఆహ్వానం అందింది. ఎంపికైనవారి జాబితాను యూపీఎస్సీ జనవరిలో విడుదల చేయనుంది.

మలి విడతలోనూ కాంగ్రెస్ జోరు!

▸ తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో సగానికిపైగా సర్పంచ్ సీట్లు కైవసం

▸ 4332 స్థానాల్లో అధికార పార్టీకి 2234.. ఉనికి చాటుకున్న బీఆర్ఎస్

▸ 25 శాతానికి పైగా సీట్లలో గెలుపు

హైదరాబాద్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగుతోంది. తొలి విడతలో మెజారిటీ స్థానాలను కైవసం చేసుకున్న హస్తం పార్టీ.. మలి విడతలోనూ అదే జోరు కొనసాగించింది. ఆదివారం జరిగిన రెండో విడత ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులే అత్యధిక స్థానాల్లో విజయబావుటా ఎగురవేశారు. మలి విడతలో 192మండలాల పరిధిలోని 3911 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగ్గా.. 2200కు పైగా స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. మెజారిటీ సీట్లను సాధించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అధికార పార్టీ తన పట్టును నిలుపుకున్నట్లయింది. మరోవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి కూడా మలి విడత ఫలితాలు కాస్త ఊరటనిచ్చాయి. 1100కు (25 శాతానికి) పైగా సీట్లను గెలుచుకోవడం ద్వారా గ్రామాల్లో తన ఉనికిని చాటుకుంది. మరో ప్రధాన ప్రతిపక్షం బీజేపీకి తొలి విడతతో పోలిస్తే స్వల్పంగా సీట్లు పెరిగాయి. కమ్యూనిస్టులు, ఇతర పార్టీలూ పది శాతానికి పైగా సీట్లను కైవసం చేసుకున్నాయి. మలి విడతలో మొత్తం 4,332 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే వీటిలో 415 స్థానాలు ఏకగ్రీవం కాగా.. ఐదు గ్రామాల్లో నామినేషన్లు దాఖలు కాలేదు. మిగిలిన 3,911 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. కాగా, మలి విడతలో మొత్తం 4332 సర్పంచ్ సీట్లకు గాను కడపటి వార్తలు అందేసరికి కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇచ్చిన అభ్యర్థులు 2220కి పైగా స్థానాలను గెలుచుకున్నారు. అంటే 50 శాతానికి పైగా సీట్లు ఆ పార్టీ సొంతం అయ్యాయి. మొత్తం ఫలితాలు వచ్చేసరికి ఇది మరింతగా పెరగనుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు జిల్లాల వారీగానూ ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగింది. స్థానిక ఎన్నికలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు పూర్తి స్థాయిలో దృష్టి పెట్టారు. తుది విడత ఎన్నికల్లోనూ ఇదే జోరు కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

బీఆర్ఎస్‌కు కాస్త ఊరట..

రెండో విడత సర్పంచ్ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ పార్టీ వెనకంజలోనే ఉంది. అయితే ఈ ఎన్నికల్లో 25 శాతానికి పైగా సీట్లను కైవసం చేసుకోవడం ఊరట కలిగించే అంశమేనని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మలి విడతలో మొత్తం 4332 గ్రామ పంచాయతీలకుగాను కడపటి వార్తలు అందేసరికి బీఆర్ఎస్ పార్టీ మద్దతు ఇచ్చిన అభ్యర్థులు 1185 సీట్లు గెలుచుకున్నారు. ఇక మలి విడత పంచాయతీ ఎన్నికల్లోనూ బీజేపీ.. తన బలాన్ని చూపలేకపోయింది. కడపటి వార్తలు అందేసరికి ఆ పార్టీ మద్దతు ఇచ్చిన అభ్యర్థులు 250కి పైగా సీట్లలో గెలిచారు. ఇక వామపక్ష పార్టీలు సహా ఇతరులు చెప్పుకోదగ్గ స్థానాల్లో గెలిచారు. మొత్తం 4332 స్థానాలకుగాను 618 సీట్లు కైవసం చేసుకున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.


MARUTI SUZUKI
NEXA
THE THRILL THAT DRIVES
INDIA'S FASTEST SALES.
NOW STARTS AT ₹ 6.55 LAKH*
FRONX TURBO
INDIA'S FASTEST
4 LAKH SALES
#Claim verified by independent research agency JATO DYNAMICS limited date 17-November-2025 for fastest to 4 lakh Sales in the Industry since launch.
FRONX
TURBO
1.0L Turbo Boosterjet Engine with Progressive Smart Hybrid
360 View Camera
Head Up Display
NEXTre' Rear Combination Lights
6 Airbags As Standard
3 years 100 000 km WARRANTY^
EXTENDABLE UPTO 6 YEARS
BENEFITS UP TO
₹ 73 000*
VELOCITY EDITION
GET ACCESSORY PACKAGE OF UP TO
₹ 43 000*
EXCHANGE OFFER UP TO ₹10 000*
NEXA SAFETY SHIELD
SCAN TO CONNECT TO
A SHOWROOM NEAR YOU!
e-book today @
www.nexaexperience.com
Contact us at
1800-200-[6392]
1800-102-[NEXA]
For detailed T&C kindly visit your nearest dealership. Ex. showroom Price of ₹6 84 900 lakh, Consumer Offer (-) ₹15 000, Exchange Bonus (-) ₹10 000, Corporate offer (-) ₹5 000 = ₹6 54 900 lakh*. Price mentioned may vary based on the customer's eligibility, profile, and applicable offers at the time of purchase. *Above shown offer includes Velocity Kit. Offers may vary subject to the model and variant purchased and shall be applicable till stock lasts. *All offers are brought to you by NEXA dealers only. Maruti Suzuki reserves the right to withdraw offers at any point in time without any advance notice. Maruti Suzuki Smart Finance is now available pan-India. Maruti Suzuki Subscribe available only in selected cities. Creative Visualization. For details on functioning of safety features including airbags, kindly refer to the owner's manual. ^3 years or 100 000 km whichever is earlier. #Claim verified by independent research agency JATO DYNAMICS limited date 17-November-2025 for fastest to 4 lakh Sales in the Industry since launch. Price shown is of FRONX Sigma Variant.